ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in
Published From Nizamabad
PRGI No.TELTEL/2010/33275

# ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
&
Public Notice
Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

శనివారం | 16-05- 2026 | సంపుటి: 17, సంచిక: 43, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆




### త్రీ ట్రిలియన్ డాలర్ల

# ఎకానమీ లక్ష్యం

**దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 2047 నాటికి 10 శాతానికి పెంచుతాం**

**నాలుగు రాష్ట్రాల ఎన్నికల తర్వాత వసూళ్ల పర్వానికి తెరలేపిన బీజేపీ**

**అంతర్జాతీయ స్థాయిలో చమురు ధరలు తగ్గినా పెట్రో ధరలు ఎందుకు పెంచారు?**

**ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు**

సంగారెడ్డి, మే 15 (ప్రజాకలం) :
దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 2047 నాటికి 10 శాతానికి పెంచేలా 'తెలంగాణ రైజింగ్ విజన్' ద్వారా రాష్ట్రాన్ని త్రీ ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం తొగర్‌పల్లి గ్రామంలో శుక్రవారం రూ.651 కోట్లతో 44 ఎకరాల్లో నెలకొల్పనున్న కేజేఎ స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్ -2 మెగా ఫుడ్ పరిశ్రమకు మంత్రి దామోదర రాజనర్సింహ, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, ఎంపీలు రఘునందన్‌రావు, సురేష్ షెట్కార్, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డితో కలిసి భూమి పూజ, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీదర్‌బాబు మాట్లాడుతూ.. అస్తవ్యస్త పట్టణీకరణ వల్ల వచ్చే అర్బన్ ప్రాంతాల్లో సమస్యలు రా కుండా

తరువాయి 2వ పేజీలో...

### కుమారుడిని బండి సంజయ్

# అప్పగించాలి

## పోక్సో కేసులో నిందితులు శిక్ష నుంచి తప్పించుకోలేరు

### సీఎం రేవంత్‌రెడ్డి వార్నింగ్

**పోక్సో కేసు నిందితుడు బండి భగీరథ్ పారిపోవడం తప్పు**

**ఎలాంటి కేసులనైనా ధైర్యంగా ఎదుర్కోవాలి**

**పారిపోతే సమస్యకు పరిష్కారం దొరకదు**



హైదరాబాద్, మే 15 (ప్రజాకలం) :
మహిళలపైన నేరాలను తమ ప్రభుత్వం నియంత్రించిదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కేసులో 8వ తేదీ రాత్రి బాలిక తల్లి పేట్ బషీరాబాద్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చారని తెలిపారు. 9వ తేదీన విచారణ ప్రారంభించి కేసు పెట్టామని చెప్పుకొచ్చారు. శుక్రవారం హైదరాబాద్ వేదికగా సీఎం మీడియాతో మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటనలో మొత్తం 10 కార్యక్రమాలకు హాజరయ్యారని అన్నారు. ఆయన భద్రత కోసం 10 వేల మంది పోలీసులు పనిచేశారని చెప్పారు. 11వ తేదీన సెక్షన్లు సవరించి వెంటనే నోటీసులు జారీ చేశామని తెలిపారు. బండి భగీరథ్ కరీంనగర్‌లో ఫిర్యాదు చేశారని ప్రస్తావించారు. ఫిర్యాదులను బేరీజు వేసుకుని అమ్మాయి స్టేట్‌మెంట్‌ను తీసుకొని నోటీసులు ఇచ్చారని తెలిపారు.

**ఈ కేసులో ఐదు టీంలు పనిచేస్తున్నాయి..**

తొందరపడితే 1000 మంది పోలీసులను తీసుకుని ఇంటి మీద పడ్డారని అంతా విమర్శలు చేసేవారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

తరువాయి 2లో...

## కలం కౌంటర్




### కాళేశ్వర క్షేత్రంలో సరస్వతీ అంత్య పుష్కర పుష్కరాలు

**డిప్యూటీ సీఎంకు అహ్వానపత్రిక అందించిన మంత్రి కొండా సురేఖ**



2లో

### గిరిజన ఆర్థిక స్వావలంబనకు

# "ఇప్ప పువ్వు" ప్రాజెక్ట్ దిక్సూచి

**- గిరిజన మహిళలు, రైతులు, యువత ఆర్థికాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం**

**- అడవిని ఆదాయ వనరుగా మార్చే దిశగా తెలంగాణ ప్రభుత్వం ముందడుగు**

**- గిరిజన సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



హైదరాబాద్, మే 15 (ప్రజాకలం) :
గిరిజన ప్రాంతాల్లో సంప్రదాయ జీవన విధానానికి ఆధారమైన ఇప్ప (మహువా) పువ్వును గిరిజన కుటుంబాల ఆర్థికాభివృద్ధికి ప్రధాన వనరుగా మలిచే దిశగా తెలంగాణ ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు పేర్కొన్నారు. శుక్రవారం డా.బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మంత్రి కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన "మహువా ఫ్లవర్ ప్రాజెక్ట్ అమలు"పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క గారు రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి గారితో కలిసి ఈ వర్క్ షాప్ లో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు మాట్లాడుతూ...
గిరిజన ఆదివాసీ మహిళలు, రైతులు, యువత, ముఖ్యంగా అత్యంత వెనుకబడిన గిరిజన వర్గాల జీవనోపాధి మెరుగుదలకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని స్పష్టం చేశారు. అడవుల్లో సహజసిద్ధంగా లభించే ఇప్ప పువ్వు గిరిజన సంస్కృతి, ఆహార సంప్రదాయాలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రస్తుతం ఇప్ప పువ్వును కేవలం సంప్రదాయ వినియోగానికి మాత్రమే పరిమితం కాకుండా, ఆహార ఉత్పత్తులు, ఔషధ వినియోగాలు,

తరువాయి 2వ పేజీలో...

### పెట్రోల్ పెంపుపై..

# రాజకీయ రగడ

**పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై కేంద్రానికి సీఎం విజయ్ హెచ్చరిక**

**ఎన్నికలు ముగిసిన వెంటనే ధరలు పెంచడం దారుణమన్న టీవీకే అధినేత**

**ప్రజలపై అదనపు భారాన్ని మోపొద్దని మోడీ సర్కార్‌కు విజ్ఞప్తి**

**వెంటనే నిర్ణయం వెనక్కి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్**

**తమిళనాడు సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి సారి బీజేపీపై విమర్శలు**

**ప్రతిపక్షాల ఆరోపణలకే కేంద్రం బలం చేకూర్చిందన్న రాజకీయ వర్గాలు**

**ఇంధన ధరల పెంపుపై కేంద్రానికి సీఎం విజయ్ ఘాటు హెచ్చరిక**



చెన్నై, మే 15;
దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే అధినేత విజయ్ కేంద్రంలోని మోడీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఇటీవల ఐదురాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన కొద్ది రోజులకే ఇంధన ధరలను పెంచడం పూర్తిగా ప్రజావ్యతిరేక నిర్ణయమని ఆయన మండిపడ్డారు. ప్రజలు ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతుండగా.. మరోసారి ఇంధన ధరల భారం మోపడం సరైంది కాదన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను కారణంగా చూపుతూ కేంద్ర ప్రభుత్వం శుక్రవారం (మే 15) నుంచి దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచిన విషయం తెలిసిందే.

తరువాయి 2వ పేజీలో...

# బొద్దింకల వ్యాఖ్యలు

## నిరుద్యోగ యువతపై సీజేఐ సూర్యకాంత్ తీవ్ర వ్యాఖ్యలు

**- సోషల్ మీడియా, సమాచార హక్కు వేదికల ద్వారా వ్యవస్థపై దాడులంటూ ఆందోళన**

**- సీనియర్ న్యాయవాది హోదా కోరిన పిటిషనర్‌ను మందలించిన ధర్మాసనం**

**- కోర్టు ప్రసాదించే గౌరవాన్ని వ్యాజ్యాలతో సాధించలేరన్న సుప్రీంకోర్టు**

న్యూ ఢిల్లీ, మే 15:
భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ కొంతమంది నిరుద్యోగ యువతపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఉద్యోగాలు లేకపోవడంతో కొందరు యువకులు సామాజిక మాధ్యమాలు, సమాచార హక్కు చట్టం కార్యకర్తలుగా మారి వ్యవస్థపై దాడులు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి వారు బొద్దింకల్లా వ్యవస్థలో వ్యాపిస్తూ దాడులు చేస్తున్నారని వ్యాఖ్యానించారు.

తరువాయి 2వ పేజీలో...



# ఇక ఆన్‌లైన్‌లోనే నీట్

### ఇక ఓఎంఆర్ పత్రాలు ఉండవు..

**వచ్చే ఏడాది నుంచి ఆన్ లైన్లో నీట్ పరీక్ష**

**సీబీటీ విధానంలో నీట్**

**నీట్ కోసం మళ్లీ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు**

**పరీక్ష సెంటర్ నిర్ణయించుకునేందుకు వారం గడువు**

**జూన్ 21 నీట్ రీ- ఎగ్జామ్**

**14 నుంచి అడ్మిట్ కార్డులు విడుదల**



న్యూ ఢిల్లీ, మే 15 :
వచ్చే ఏడాది నుంచి ఆన్ లైన్ లో నీట్ పరీక్ష నిర్వహిస్తామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రకటించారు. వచ్చే ఏడాది నీట్ పరీక్షను సీబీటీ విధానంలో నిర్వహిస్తామని వివరించారు. మళ్లీ మాల్ ప్రాక్టీస్ జరగకుండా చూడటమే తమ ధ్యేయమని పేర్కొన్నారు. జూన్ 21 నుంచి నీట్ రీ-ఎగ్జామ్ నిర్వహిస్తామని కేంద్రమంత్రి తెలిపారు. జూన్ 14 నుంచి అడ్మిట్ కార్డులు విడుదల చేస్తామని సూచించారు.

తరువాయి 2వ పేజీలో...

# నాంపల్లిలో అగ్నికీలలు

## జైపూర్ రైలు ఏసీ బోగీలో మంటలు

**ప్లాట్‌ఫామ్ నంబర్-4పై ఘటన కలకలం**

**మూడు ఫైరింజన్లతో మంటల అదుపు**

**కారణాలపై రైల్వే అధికారుల దర్యాప్తు**



2

# కుమారుడిని బండి సంజయ్ అప్పగించాలి

మొదటి పేజీ తరువాయి...

సినిమా వాళ్లు, రాజకీయ నాయకులు ఎవరైనా తనకు మినహాయింపులు లేవని స్పష్టం చేశారు. బాలిక కేసులో ఎలాపడితే అలా చేయడానికి వీల్లేదని తేల్చిచెప్పారు. బండి సంజయ్‌కి తాను సహాయం చేస్తే పోక్సో కేసు పెట్టం కదా..? అని ప్రశ్నించారు. పోక్సో కేసు పెట్టామంటేనే తన కమిట్‌మెంట్ ఏమిటో తెలుస్తుంది కదా..? అని నిలదీశారు. హోంమంత్రిగానే కాకుండా ముఖ్యమంత్రిగా చర్యలు తీసుకోవడం తన బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ కేసులో ఐదు టీంలు పనిచేస్తున్నాయని వివరించారు. బండి సంజయ్ ఇంటికి పోలీసులు నోటీసులు ఇవ్వడానికి వెళ్లారని.. మాజీ మంత్రి కేటీఆర్ బావమరిది ఇంటికి వెళ్లారని తెలిపారు. బండి సంజయ్‌కి, బీఆర్ఎస్‌లకి మధ్య ఎక్కడ చెడిందో తనకు తెలియదని విమర్శించారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఇప్పుడు పోలీసు ఆఫీసర్ కాదని చెప్పారు. పోక్సో కేసు పెడితే బెదిరించినట్లా లేక బాధితురాలి పక్షాన ఉన్నట్లా అని ప్రశ్నించారు. కేటీఆర్, బండి సంజయ్‌కి మధ్య ఏముందో తనకు తెలియదని అన్నారు. చట్టప్రకారం నిందితులను శిక్షిస్తామని హెచ్చరించారు. ఈ కేసు పిల్లల భవిష్యత్తుకు సంబంధించిన అంశమని తెలిపారు. ఏ చిన్న తప్పు చేసినా పిల్లల జీవితాలు నాశనం అవుతాయని అన్నారు. అమ్మాయికి రెండు బర్త్ సర్టిఫికెట్స్ ఉన్నాయని.. వాటన్నింటిని పోలీసులు విచారించాలి కదా..? అని ప్రశ్నించారు.

**నిందితులు తప్పించుకోలేరు..**

ఒకరోజు ఆలస్యమైన శిక్ష నుంచి నిందితులు తప్పించుకోలేరని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తనను జైల్లో పెట్టిన మాజీ సీఎం కేసీఆర్ కుటుంబం పట్ల తాను కఠినంగా వ్యవహారించానా..? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ విలీనాన్ని బండి సంజయ్ వ్యతిరేకించారని కోపమా..? అని అడిగారు. తాను సత్రం నడపటం లేదని.. ప్రభుత్వాన్ని నడుపుతున్నానని చెప్పుకొచ్చారు. వందశాతం బాదితులకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని.. తప్పు చేసిన వారిని శిక్షిస్తామని స్పష్టం చేశారు. డిసెంబర్‌కు ముందే జరిగిన ఘటనపైనే బాధితురాలి ఫిర్యాదు వచ్చిందని తెలిపారు. నాలుగు నెలలు వెనక్కు వెళ్లి అప్పటి ఘటనలను విచారించాలంటే సమయం పడుతుందని చెప్పారు. కుమారుడు విషయంలో బండి సంజయ్ తీరు నైతికంగా తప్పు అని తెలిపారు. బండి భగీరథ్ ధైర్యంగా ఈకేసు ఎదుర్కోవాలని అన్నారు. కొడుకును తీసుకువచ్చి బండి సంజయ్ స్టేషన్‌లో అప్పగించాలని సూచించారు. నోటీసు సమయంలో స్పందించకపోతే పోలీసులు కఠినంగా వ్యవహారిస్తారని స్పష్టం చేశారు. వ్యవస్థలను పట్టాలెక్కించాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. ప్రతి 15 రోజులకు ఒకసారి జిల్లా పర్యటనలకు వెళ్తున్నానని అన్నారు. నిధుల సమీకరణపైన ఎక్కువ సమయం కేటాయిస్తున్నానని తెలిపారు. జడ్పీటీసీగా ఉన్నప్పుడు ఏ ఇంట్లో ఉన్నానో ముఖ్యమంత్రి అయ్యాక కూడా అదే ఇంట్లో ఉన్నానని స్పష్టం చేశారు. కష్టపడ్డ నాయకులకే నామినేటేడ్ పోస్టులు ఇస్తున్నామని అన్నారు. ఇందిరమ్మ ఇంట్లో ఉండే వెడ్మ బొజ్జుకు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి గెలిపించుకున్నామని ప్రస్తావించారు. రూపాయి చేతిలో లేని మందుల సామెల్ లాంటి సామాన్యులకి టికెట్ ఇస్తే 50 వేల మెజార్టీతో గెలిచారని గుర్తుచేశారు.

**మూసీని ప్రక్షాళన చేస్తాం..**

చాకలి ఐలమ్మ కుటుంబం, శ్రీకాంతాచారి కుటుంబం, కోదండరాం, ఆకునూరి మురళీ ఇలా అందరిని గుర్తుపెట్టుకుని పదవులు ఇచ్చామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. జయ జయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతం చేశామని తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేశామని అన్నారు. ఎవరు అడ్డువచ్చినా మూసీని ప్రక్షాళన చేస్తామని తేల్చిచెప్పారు. డ్రగ్స్ తీసుకుంటే కఠిన చర్యలు విధిస్తామని స్పష్టం చేశారు. ప్రధానిగా మోదీ, ముఖ్యమంత్రిగా తాను అధికారిక కార్యక్రమంలో మాట్లాడానని తెలిపారు. కేంద్రంతో ఆనాటి సీఎం కేసీఆర్ ఏనాడు కలిసి రాలేదని అన్నారు. నిధుల కోసం తమతో కలిసి రావాలని ప్రధాని మోదీ అడిగారని ప్రస్తావించారు. ప్రభుత్వాల సహకారం గురించి మాత్రమే మాట్లాడారని చెప్పారు. రాజకీయాల్లో తన కమిట్‌మెంట్ గురించి ప్రధాని మోదీకి తెలుసునని చెప్పుకొచ్చారు. మైక్‌ల ముందే తాము మాట్లాడుకున్నామని.. రహస్యం ఏం లేదని తేల్చిచెప్పారు. కేంద్రంతో కలిసి రమ్మని తెలంగాణ ప్రభుత్వాన్ని మోదీ కోరారని ప్రస్తావించారు. తనకు డిమాండ్ ఉందని అనుకున్నా.. తనకు ఇబ్బంది లేదని చెప్పారు. దేశంలో తనకు డిమాండ్ ఉందని.. తెలంగాణ ప్రజలకు గౌరవం ఇదని తెలిపారు. రాహుల్‌గాంధీ నాయకత్వంలో తాను పనిచేస్తానని అన్నారు. సోనియాగాంధీ లేకుంటే వేయ్యేళ్లయినా తెలంగాణ వచ్చేది కాదని చెప్పారు. తాను కాంగ్రెస్‌లో చేరినప్పుడు అధికారంలో లేదని.. తన మనసుకు నచ్చినట్లు చేస్తానని తెలిపారు. అవకాశాల కోసం అవకాశవాదీగా మారనని స్పష్టం చేశారు. నిబద్దతతో పార్టీలో చేరాననే గాంధీ కుటుంబం తనకు ఈ అవకాశం ఇచ్చిందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# గిరిజన ఆర్థిక స్వావలంబనకు "ఇప్ప పువ్వు" ప్రాజెక్ట్ దిక్సూచి

మొదటి పేజీ తరువాయి...

విలువ ఆధారిత పరిశ్రమలు, గ్రామీణ సూక్ష్మ పరిశ్రమల అభివృద్ధికి ఉపయోగించే అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. గిరిజన ప్రాంతాల్లో శాస్త్రీయ సేకరణ, నిల్వ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ వ్యవస్థలను అభివృద్ధి చేసి గిరిజన కుటుంబాలకు స్థిరమైన ఆదాయం అందించేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. ప్రత్యేకంగా గిరిజన మహిళా సంఘాలు, స్వయం సహాయక బృందాలు, యువజన సమాఖ్యలను ఈ ప్రాజెక్ట్‌లో భాగస్వామ్యం చేసి గ్రామీణ స్థాయిలో ఉపాధి అవకాశాలు పెంచాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. అటవీ సంపదపై గిరిజనుల హక్కులను పరిరక్షిస్తూ, అదే సమయంలో వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేలా సమగ్ర విధానాలు అమలు చేస్తున్నామని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన, పోషకాహార భద్రత, మహిళా సాధికారత, యువతకు ఉపాధి కల్పన వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని ఇప్ప పువ్వు ఆధారిత ప్రాజెక్టులను రూపొందిస్తున్నామని మంత్రి వెల్లడించారు.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి అడవి ఉత్పత్తుల విలువను పెంచడం ఎంతో అవసరమని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం గిరిజన సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యతగా తీసుకొని పనిచేస్తోందని మంత్రి అన్నారు. గిరిజన ప్రాంతాల్లో సహజ వనరుల ఆధారంగా స్థిరమైన ఉపాధి అవకాశాలు సృష్టించి యువత వలసలను తగ్గించడం, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడం ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. ఈ సందర్భంగా వివిధ శాఖలతో అలాగే ప్రభుత్వ యంత్రాంగం ఉమ్మడిగా సమన్వయంతో పైలట్ ప్రాజెక్టులు చేపట్టి, భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే దిశగా కార్యాచరణ చేపట్టాలని మంత్రి సూచించారు. గిరిజన సంపద గిరిజనులకే లాభదాయకంగా మారే విధంగా పారదర్శక విధానాలతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క గారు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో సహజసిద్ధంగా లభించే ఇప్ప పువ్వు కేవలం అటవీ ఉత్పత్తి మాత్రమే కాకుండా గిరిజన కుటుంబాల ఆర్థిక స్వావలంబనకు బలమైన ఆధారంగా మారే సామర్థ్యం కలిగి ఉందన్నారు. ఇప్ప పువ్వు నుండి లడ్డూలు, నాచురల్ హెల్త్ ఫుడ్స్, సంప్రదాయ ఆహార పదార్థాలు తయారు చేయవచ్చని, ఇప్ప గింజల నుండి నూనె తయారీకి కూడా విశేష అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఇప్ప ఆకులు, పువ్వులు, గింజలు అన్నీ వినియోగంలోకి తీసుకువస్తే గిరిజన ప్రాంతాల్లో చిన్న స్థాయి పరిశ్రమలు ఏర్పడి మహిళలకు పెద్ద ఎత్తున ఉపాధి లభిస్తుందని ఆమె పేర్కొన్నారు.ఇప్ప పువ్వుతో పోషకాహార పదార్థాలు, పిల్లలకు ఆరోగ్యకరమైన స్నాక్స్, మిల్లెట్ ఆధారిత ఫుడ్ ప్రొడక్ట్స్, హెర్బల్ టీలు, నాచురల్ స్వీటెనర్లు తయారు చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. గ్రామీణ స్థాయిలో మహిళా సంఘాలకు శిక్షణ ఇచ్చి "ట్రైబల్ నాచురల్ ఫుడ్ బ్రాండ్స్" రూపంలో మార్కెట్‌లోకి తీసుకురావాలని సూచించారు.

గిరిజన మహిళల సంప్రదాయ జ్ఞానాన్ని ఆధునిక సాంకేతికతతో అనుసంధానం చేస్తే ప్రపంచ మార్కెట్‌లో తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావచ్చని సీతక్క గారు పేర్కొన్నారు.

ప్రతి గిరిజన గ్రామంలో ఇప్ప పువ్వు సేకరణ, నిల్వ, ప్రాసెసింగ్‌కు మినీ యూనిట్లు ఏర్పాటు చేయాలని, యువతను స్టార్టప్ రంగంలో ప్రోత్సహించాలని సూచించారు. ఇప్ప పువ్వు ఆధారిత ఉత్పత్తులకు ప్రత్యేక బ్రాండింగ్, ఆకర్షణీయమైన ప్యాకేజింగ్, ఈ-కామర్స్ మార్కెటింగ్ ద్వారా అంతర్జాతీయ మార్కెట్‌ను లక్ష్యంగా చేసుకోవాలని తెలిపారు. గిరిజన మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీలు, ప్రభుత్వ సబ్సిడీలు, స్వయం ఉపాధి పథకాలను అనుసంధానం చేయాలని అధికారులకు సూచించారు. రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ ..మహువా (ఇప్ప పువ్వు) ప్రాజెక్టును కేవలం చర్చల స్థాయిలో కాకుండా క్షేత్రస్థాయిలో అమలు జరిగేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఈ ప్రాజెక్ట్ విజయవంతం కావడంలో ఐటిడిఏ పీఓల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి గారు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారి చొరవను ప్రత్యేకంగా అభినందించారు. గిరిజన ఆర్థిక స్వావలంబనకు దోహదపడే మహువా (ఇప్ప పువ్వు) ప్రాజెక్ట్‌ను కార్యరూపంలోకి తీసుకురావడంలో మంత్రి చూపుతున్న పట్టుదల, నిరంతర కృషిని కొనియాడారు. ఈ ప్రాజెక్ట్‌పై ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి గారితో పలుమార్లు చర్చలు జరిపి, సమగ్ర సమావేశాలు ఏర్పాటు చేసేందుకు, వివిధ శాఖల సమన్వయంతో ముందుకు తీసుకెళ్తున్న తీరు ప్రశంసనీయమన్నారు. గిరిజన కుటుంబాల జీవనోపాధి మెరుగుదలకు స్పష్టమైన దిశలో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.మహువా ప్రాజెక్ట్‌ను రాష్ట్ర స్థాయిలో విజయవంతంగా అమలు చేయాలనే సంకల్పంతో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవను వేం నరేందర్ రెడ్డి గారి అభినందించారు. ఈ ప్రాజెక్ట్ విజయవంతం అయితే గిరిజన ప్రాంతాల్లో కొత్త ఆశలు నింపుతోందని వేం నరేందర్ రెడ్డి గారు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చూపుతున్న చిత్తశుద్ధి, కార్యాచరణ వల్ల గిరిజన ప్రాంతాల్లో ఆర్థికాభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని అభిప్రాయపడ్డారు. గిరిజన ప్రాంతాల్లో సేకరణ తర్వాత నిల్వ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ వ్యవస్థలు బలోపేతం కాకపోతే గిరిజనులకు సరైన లాభం అందదని తెలిపారు. అందువల్ల ఇప్ప పువ్వు ఆధారిత ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు. ఈ ప్రాజెక్ట్ అమలుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి, వివిధ శాఖల మధ్య సమన్వయంతో కార్యాచరణ ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ప్రతి దశలో స్పష్టమైన బాధ్యతలు, కాలపరిమితి (టైమ్‌లైన్) ఉండేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు.రిజనుల్లో ఈ ప్రాజెక్ట్‌పై నమ్మకం, భరోసా కలిగే విధంగా ప్రభుత్వం పని చేయాలని అన్నారు. మహువా ఆధారిత జీవనోపాధిపై రాష్ట్రంలోని దాదాపు రెండున్నర లక్షల గిరిజన, ఆదివాసీ కుటుంబాల భవిష్యత్తు ముడిపడి ఉందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి గారు గిరిజన సంక్షేమం విషయంలో ఖర్చుకు వెనుకాడరని, మంచి ఫలితాలు ఇచ్చే ప్రాజెక్టులకు ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని తెలిపారు. సరైన ప్రణాళిక, పారదర్శక అమలు, మార్కెటింగ్ వ్యవస్థలతో తెలంగాణను దేశంలోనే మహువా ఆధారిత పరిశ్రమల కేంద్రంగా తీర్చిదిద్దే అవకాశం ఉందన్నారు.

# పెట్రోల్ పెంపుపై.. రాజకీయ రగడ

మొదటి పేజీ తరువాయి...

ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు లీటర్‌కు సుమారు రూ. 3 వరకు ధరలు పెంచడంతో సామాన్యులపై అదనపు ఆర్థిక భారం పడనుంది. రవాణా ఖర్చులు పెరగడంతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు కూడా మరింత పెరిగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్పందించిన సీఎం విజయ్.. ఎన్నికల సమయంలో ధరలు పెంచకుండా ఆపి, ఫలితాలు వెలువడిన వెంటనే పెంపు నిర్ణయం తీసుకోవడం వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని విమర్శించారు. ప్రజల సంక్షేమం కంటే రాజకీయ ప్రయోజనాలకే కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆరోపించారు. పెరిగిన ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇక కాంగ్రెస్ సహా పలు ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల ముందు నుంచే ఇంధన ధరల పెంపుపై కేంద్రాన్ని విమర్శిస్తున్నాయి. ఎన్నికలు పూర్తయ్యాక తప్పకుండా ధరలు పెరుగుతాయని చేసిన ఆరోపణలు ఇప్పుడు నిజమయ్యాయని ప్రతిపక్ష నేతలు పేర్కొంటున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన పది రోజుల వ్యవధిలోనే ధరలు పెరగడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత విజయ్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని నేరుగా టార్గెట్ చేస్తూ విమర్శించడం ఇదే మొదటిసారి కావడం విశేషం. దీంతో దక్షిణాది రాజకీయాల్లో విజయ్ మరింత దూకుడుగా వ్యవహరించనున్నారనే సంకేతాలు కనిపిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# త్రీ ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యం

మొదటి పేజీ తరువాయి...

పకడ్బందీ ప్రణాళికలతో పారిశ్రామికీకరణ చేపడుతున్నట్లు తెలిపారు. పరిశ్రమలను కేవలం హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా, గ్రామీణ, సెమీ-అర్బన్ ప్రాంతాలకు విస్తరిస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక విధానాలు, మౌలిక సదుపాయాలు, 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వల్లే దేశీయ, అంతర్జాతీయ సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నాయని చెప్పారు.

**భారీ ఉపాధి కల్పన, ఉద్యోగ అవకాశాలు**

తొగర్‌పల్లిలో రూ. 651 కోట్ల పెట్టుబడితో 44 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న ఈ నూతన యూనిట్ ద్వారా 1,551 మందికి ప్రత్యక్షంగా, దాదాపు 5,000 మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి శ్రీదర్‌బాబు వెల్లడించారు. పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు పెద్దపీట వేస్తూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు.నెస్లే, హిందుస్థాన్ యూనీలివర్, డాక్టర్ రెడ్డీస్ వంటి గ్లోబల్ బ్రాండ్లకు కో-మాన్యుఫ్యాక్చరింగ్ పార్ట్‌నర్‌గా ఉన్న కేజేఎస్ సంస్థ రాకతో ఫుడ్ ప్రాసెసింగ్, ఎఫ్ఎంసీజీ రంగాలలో 'మేడ్ ఇన్ తెలంగాణ' బ్రాండ్ అంతర్జాతీయ స్థాయికి చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తొగర్‌పల్లిలో నిర్మించే ఈ పరిశ్రమ పూర్తిగా కాలుష్య రహితమన్నారు.రాబోయే కాలంలో అంతర్జాతీయ కారిడార్‌లో ఓ ఇండస్ట్రీ నెలకొల్పుతామని చెప్పారు. జహీరాబాద్ లాంటి ప్రాంతంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కోసం కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కంపెనీ ప్రతినిధులు, టీజీఐఐసీ అధికారులు పాల్గొన్నారు.

**ఎన్నికల తర్వాత బీజేపీ వసూళ్ల పర్వం**

నాలుగు రాష్ట్రాల ఎన్నికల తర్వాత బీజేపీ ప్రభుత్వం వసూళ్ల పర్వానికి తెరలేపిందని మంత్రి శ్రీదర్‌బాబు ఆరోపించారు. సంగారెడ్డిలో మీడియా సమావేశంలో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం పేదల నడ్డి విరుస్తుందని, పెట్రోల్ ధరలు ఒకేసారి మూడు రూపాయలు పెంచారని విమర్శించారు. నాలుగు రాష్ట్రాల ఎన్నికల సమయంలో ధరలు పెంచలేదని, ఎన్నికల తర్వాత వసూళ్లు మొదలు పెట్టారని విమర్శించారు. అంతర్జాతీయ స్థాయిలో చమురు ధరలు పెరిగినప్పుడు ధరలు పెంచని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం.. చమురు ధరలు తగ్గినప్పుడు పెట్రో ధరలు ఎందుకు పెంచిందని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల మధ్య చిచ్చు పెట్టడమే బీజేపీ లక్ష్యమని, రాష్ట్ర ప్రజల బాగు కోసం పని చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని స్పష్టం చేశారు. హిల్ట్ పాలసీ కాలుష్య నివారణ కోసం తీసుకున్నామని చెప్పారు. సీఎం, మంత్రులు అందరం కలిసి పని చేస్తున్నామని, క్యాబినేట్‌లో అందరం కలిసి నిర్ణయాలు తీసుకుంటామన్నారు.

**రైతులపై మాట్లాడే హక్కు బీఆర్ఎస్‌కు లేదు**

రైతుల సమస్యలపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ పార్టీకి లేదని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఎన్నడూ లేని విధంగా ఈసారి ధాన్యం మార్కెట్లోకి వచ్చిందని, కొన్ని సందర్భాల్లో లారీలు ఆలస్యంగా వస్తే దాన్ని అదనుగా తీసుకుని బీఆర్ఎస్ ఆందోళనలు చేయడం సిగ్గు చేటన్నారు. ప్రతి రెండు రోజులకు ఓసారి ధాన్యం కొనుగోళ్లపై సీఎం సమీక్ష చేస్తున్నారని, రైతులు ఆందోళన చెందవద్దు, చివరి గింజ వరకు ప్రభుత్వమే కొంటుందని మంత్రి హామీనిచ్చారు. కాగా ఎంతో మంది విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం ఆటలాడుతుందని, నీట్ ఎగ్జామ్ నేషనల్ లీకేజీ ఏజెన్సీగా మారిందని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. చట్టాలను బీఆర్ఎస్ చుట్టాలుగా చేసుకున్నట్టు తాము ప్రవర్తించమని, చట్టం తన పని తాను చేసుకుంటూ వెళ్తుందని తెలిపారు.

# బొద్దింకల వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి...

సీనియర్ న్యాయవాది హోదాను కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సూర్యకాంత్ ఈ వ్యాఖ్యలు చేశారు. వ్యవస్థపై దాడి చేసే పరాన్నజీవులు ఇప్పటికే సమాజంలో ఉన్నారని, అలాంటి వారితో చేతులు కలపాలనుకుంటున్నారా అంటూ పిటిషనర్‌ను ధర్మాసనం ప్రశ్నించింది. సీనియర్ న్యాయవాదుల హోదాకు సంబంధించిన సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు చేయడంలో ఢిల్లీ హైకోర్టు జాప్యం చేస్తోందని ఆరోపిస్తూ న్యాయవాది సంజయ్ దూబే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. హైకోర్టుపై ధిక్కార చర్యలు తీసుకోవాలని కోరుతూ దాఖలైన ఈ పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం విచారణకు స్వీకరించలేదు. సీనియర్ న్యాయవాది హోదా అనేది కోర్టు ప్రసాదించే విశిష్ట గౌరవమని, దానిని వ్యాజ్యాల ద్వారా పొందలేరని ధర్మాసనం స్పష్టం చేసింది. మీకు తప్ప ప్రపంచంలో ఎవరికైనా ఆ హోదా ఇవ్వవచ్చని వ్యాఖ్యానించిన సూర్యకాంత్, ఒకవేళ హైకోర్టు మీకు హోదా ఇచ్చినా మీ ప్రవర్తనను బట్టి మేము దానిని పక్కన పెడతామని అసహనం వ్యక్తం చేశారు. పిటిషనర్ సామాజిక మాధ్యమాల్లో ఉపయోగించిన భాషను కూడా ధర్మాసనం ప్రస్తావించింది. న్యాయవ్యవస్థను లక్ష్యంగా చేసుకుని వస్తున్న పోస్టులు తమ దృష్టికి వస్తున్నాయని పేర్కొంది. అనంతరం పిటిషనర్ కోర్టుకు క్షమాపణలు తెలియజేస్తూ పిటిషన్‌ను వెనక్కి తీసుకోవడానికి అనుమతి కోరగా, సుప్రీంకోర్టు అందుకు అనుమతి ఇచ్చింది.

# కాళేశ్వర క్షేత్రంలో సరస్వతీ అంత్య పుష్కర పుష్కరాలు

## డిప్యూటీ సీఎంకు ఆహ్వానపత్రిక అందించిన మంత్రి కొండా సురేఖ



హైదరాబాద్, మే 15 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరం వేదికగా సరస్వతీ నది అంత్య పుష్కరాలను తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ పుష్కరాలలో పాల్గొనాల్సిందిగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ప్రజా భవన్ కు ప్రత్యేకంగా వచ్చి దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ, దేవాదాయ శాఖ డైరెక్టర్ ఎం. హనుమంతరావు, ఇతర ఉన్నతాధికారులు ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వేద పండితులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను వేదోఛ్చారణలతో ఆశీర్వదించారు. సరస్వతీ అంత్య పుష్కరాలను మే 21 నుంచి జూన్ 1 వరకు 12 రోజుల పాటు కాళేశ్వరంలో నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ సీఎంకు మంత్రి కొండా సురేఖ వివరించారు. మే 21న ఉదయం 5:43 గంటలకు తొలి పుష్కర స్నానంతో వేడుకలు ప్రారంభమవుతాయి. కంచి పీఠాధిపతి శ్రీ శంకర విజేంద్ర సరస్వతి స్వామి తొలి పుష్కర స్నానాన్ని ఆచరిస్తారని డిప్యూటీ సీఎంకు వివరించారు. త్రివేణి సంగమం వద్ద ప్రతిరోజూ గంగా హారతి నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోందని వివరించారు.

# ఇక ఆన్‌లైన్‌లోనే నీట్

మొదటి పేజీ తరువాయి...

**నీట్ కోసం ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు: కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్**

నీట్ కోసం మళ్లీ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు. ఏ నగరాల్లో పరీక్ష రాయాలో నిర్ణయించుకునేందుకు విద్యార్థులకు వారం గడువు ఇస్తామని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తే మత మొదటి ప్రాధాన్యమని తెలిపారు.

**NEET-UG పేపర్ లీక్ కేసులో ఇప్పటివరకు ఏడుగురు అరెస్ట్...** అభ్యర్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు ఎన్టీఏ నీట్ రీఎగ్జామ్ తేదీని ప్రకటించింది. పేపర్ లీక్‌తో మే 3న జరిగిన నీట్ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ రద్దు చేసింది. అభ్యర్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తి, రాజకీయ నేతలు ఆందోళనల మేరకు రీ షెడ్యూల్ చేసింది. అటు నీట్ పేపర్ లీకేజీపై సీబీఐ దర్యాప్తు కొనసాగుతుంది. నీట్ పేపర్ లీకేజీ కేసులో ఇప్పటివరకు ఏడుగురు అరెస్ట్ అయినట్లు సీబీఐ అధికారులు పేర్కొన్నారు.

# నాంపల్లిలో అగ్నికీలలు

## జైపూర్ రైలు ఏసీ బోగీలో మంటలు

**ప్లాట్‌ఫామ్ నంబర్-4పై ఘటన కలకలం**

**మూడు ఫైరింజన్లతో మంటల అదుపు**

**కారణాలపై రైల్వే అధికారుల దర్యాప్తు**



హైదరాబాద్, మే 15 :

నగరంలోని నాంపల్లి రైల్వేస్టేషన్లో గురువారం ఉదయం అగ్నిప్రమాదం చోటుచేసుకుని ప్రయాణికుల్లో తీవ్ర ఆందోళన కలిగించింది. జైపూర్‌కు బయలుదేరాల్సిన రైలులోని ఏసీ కోచ్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్టేషన్ పరిసరాల్లో కలకలం రేగింది. రైలును నాలుగో నంబర్ ప్లాట్‌ఫామ్‌పై నిలిపి ఉంచిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు అధికారులు తెలిపారు. బోగీ నుంచి దట్టమైన పొగలు ఎగసిపడటంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే మూడు ఫైరింజన్లతో ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ముఖ్యంగా బీ1 ఏసీ బోగీలో మంటలు ఎక్కువగా వ్యాపించగా, అగ్నిమాపక సిబ్బంది సమయానికి స్పందించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పినట్లు అధికారులు వెల్లడించారు. ఘటన సమయంలో బోగీలో ప్రయాణికులు లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని సమాచారం. అగ్నిప్రమాదం కారణంగా కొంతసేపు రైల్వే కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. భద్రతా చర్యల్లో భాగంగా ప్లాట్‌ఫామ్ పరిసరాలను ఖాళీ చేయించి ప్రయాణికులను ఇతర ప్రాంతాలకు తరలించారు. షార్ట్‌సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగి ఉండవచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నప్పటికీ, అసలు కారణాలపై రైల్వే అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

# ధాన్యం కొనుగోలు, రవాణా ప్రక్రియలో వేగం పెంచాలి

## - జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



జగిత్యాల్ ప్రతినిధి, మే 15 (ప్రజాకలం) : జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు, రవాణా, మిల్లులలో లోడింగ్–అన్‌లోడింగ్ ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా సివిల్ సప్లై అధికారులు, ధర్మపురి నియోజకవర్గ స్థాయి అధికారులు మరియు రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు విక్రయించిన ధాన్యాన్ని సకాలంలో మిల్లులకు తరలించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మిల్లుల వద్ద వాహనాలు ఎక్కువసేపు నిలిచిపోకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. మిల్లులలో లోడింగ్ మరియు అన్‌లోడింగ్ పనులు నిరంతరాయంగా కొనసాగించేలా మిల్లర్లు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రతి రోజు కొనుగోలు, రవాణా, అన్‌లోడింగ్ ప్రక్రియలపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, పెండింగ్‌లో ఉన్న లారీలను వెంటనే క్లియర్ చేయాలని సూచించారు. ధాన్యం నిల్వలు ఎక్కువ కాలం కేంద్రాల వద్ద ఉండకుండా వేగంగా మిల్లులకు తరలించాలని అన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. సమస్యలు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా సివిల్ సప్లై అధికారులు, ధర్మపురి నియోజకవర్గానికి చెందిన తహసీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆకస్మిక తనిఖీలతో ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్ ఫోకస్

## - కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లుల్లో వేగవంతమైన ప్రక్రియలకు ఆదేశాలు



జగిత్యాల్ ప్రతినిధి, మే 15 (ప్రజాకలం) : జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లు, నిల్వలు, మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలనే లక్ష్యంతో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శుక్రవారం ధర్మపురి మండలం జైన, రాజారం గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు. అలాగే దుబ్బలగూడెం గ్రామంలోని మొక్కజొన్న గోదాంను, దమ్మన్నపేట గ్రామంలోని పరమేశ్వర రైస్ మిల్ మరియు ధనలక్ష్మి రైస్ మిల్లులను సందర్శించి అక్కడి పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని సూచించారు. ధాన్యం తూకం, నిల్వలు, రవాణా ప్రక్రియల్లో ఎటువంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. రైతులకు సమగ్ర సేవలు అందేలా అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలో జిల్లాలో అకాల వర్షాల పరిస్థితులు ఉన్నందున కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు గన్ని సంచులు, టార్పాలిన్ కవర్లు తగినంతగా అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డేటా ఎంట్రీ ఆన్లైన్‌లో నమోదు చేసి రైతుల ఖాతాల్లో సకాలంలో నగదు జమ అయ్యేలా చూడాలని పేర్కొన్నారు. అదేవిధంగా మిల్లుల వద్ద ధాన్యాన్ని త్వరితగతిన అన్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నుంచి రైస్ మిల్లులకు చేరుతున్న ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే దిగుమతి చేసి, లారీలను తిరిగి పంపించాలని మిల్లర్లకు ఆదేశించారు. రైతులు, రవాణాదారులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం దిగుమతి, నిల్వ, మిల్లింగ్ ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. మిల్లుల్లో ధాన్యం నిల్వలు, తేమ శాతం, మిల్లింగ్ సామర్థ్యాన్ని పరిశీలించిన కలెక్టర్, ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని పనులు సక్రమంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. మిల్లర్లు తగినంత హమాలీలను అందుబాటులో ఉంచుకుని వచ్చిన ధాన్యాన్ని వెంటనే దింపుకోవాలని ఆదేశించారు. అలాగే మిల్లర్లు, ట్రాన్స్‌పోర్టర్లు, అధికారులు పరస్పర సమన్వయంతో కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని వేగంగా మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, సివిల్ సప్లైస్ డీఎం జితేంద్ర ప్రసాద్, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### మహిళల భద్రత – స్వయం సాధికారతపై

# విస్తృత అవగాహన సదస్సు



జగిత్యాల్ ప్రతినిధి, మే 15 (ప్రజాకలం) : మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "99 రోజుల కార్యాచరణ ప్రణాళిక – ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా బీర్‌పూర్ మండల కేంద్రంలో ఉపాధి హామీ కార్మికులకు, తుంగూర్ గ్రామంలోని శ్రీ సూర్య గ్రామైక్య సంఘం సమావేశంలో మహిళల కోసం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళల భద్రత, హక్కులు, సంక్షేమ పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆడపిల్లల విద్య ప్రాముఖ్యత, బాలికల రక్షణ, మంచి స్పర్శ – చెడు స్పర్శ గుర్తింపు, మొబైల్ వినియోగానికి బానిస కావడం వల్ల కలిగే దుష్ప్రభావాలు, సామాజిక మాధ్యమాల ప్రభావం, బాలికల విజయాలు, బాల్య వివాహాల నిషేధ చట్టం, మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలపై సిబ్బంది వివరించారు. అలాగే మహిళల భద్రతకు సంబంధించిన అత్యవసర సహాయ సంఖ్యలను కూడా తెలియజేశారు. పోలీసు సహాయ కేంద్రం – 100, సఖి కేంద్రం – 181, బాలల సహాయ కేంద్రం – 1098, అంతర్జాల నేరాల ఫిర్యాదు కేంద్రం – 1930, వృద్ధుల సహాయ కేంద్రం – 14567, మత్తు పదార్థాల బానిసత్వ నివారణ సహాయ కేంద్రం – 14416 గురించి వివరించారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం అందిస్తున్న వివిధ ఆర్థిక పథకాలు, పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం గురించి కూడా అవగాహన కల్పించారు. మహిళల అభివృద్ధి, భద్రత, స్వయం సాధికారత లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని మహిళా సాధికారత కేంద్రం బృందం సభ్యులు స్వప్న, గౌతమి, హేమశ్రీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు, గ్రామ సంఘాల ప్రతినిధులు, ఉపాధి హామీ కార్మికులు, మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

# బక్రీద్ నేపథ్యంలో జగిత్యాల జిల్లాలో హై అలర్ట్

## - పశువుల అక్రమ రవాణాపై ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేక నిఘా



జగిత్యాల్ ప్రతినిధి, మే 15 (ప్రజాకలం) : రాబోయే బక్రీద్ పండుగ నేపథ్యంలో జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. పశువుల అక్రమ రవాణా, గోవధ నివారణపై కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ఐపీఎస్ తెలిపారు. జిల్లాలోకి ప్రవేశించే అన్ని ప్రధాన మార్గాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా సరిహద్దులోని రాయపట్నం, రాజారాంపల్లె, చిల్వకోడూర్ చెక్‌పోస్టులను జిల్లా ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. జిల్లాలోకి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ముఖ్యంగా పశువులను తరలించే వాహనాల పత్రాలను పూర్తిగా పరిశీలించాలని ఆదేశించారు. ప్రతి వాహనానికి సంబంధించిన వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. పశువులను అక్రమంగా రవాణా చేసే వాహనాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించవద్దని, అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని ఎస్పీ పేర్కొన్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో మరింత అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. అక్రమంగా గోవులను రవాణా చేస్తున్నారనే పేరుతో కొందరు వ్యక్తులు లేదా సంఘాలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడం, అల్లర్లు సృష్టించడం వంటి చర్యలకు పాల్పడితే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. చట్టాన్ని అమలు చేసే బాధ్యత పూర్తిగా పోలీస్ శాఖదేనని, ఎవరూ స్వచ్ఛందంగా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని స్పష్టం చేశారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి చర్యలనైనా ఉపేక్షించబోమని పేర్కొన్న ఎస్పీ, ప్రజలు కూడా పోలీస్ శాఖకు సహకరించి అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్–100కు సమాచారం అందించాలని కోరారు. ఈ తనిఖీలలో డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, ధర్మపురి సీఐ రామ్ నరసింహా రెడ్డి, ఎస్ఐలు మహేష్, ఉదయ్ కుమార్, కృష్ణసాగర్ తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సేవలకు గుర్తింపుగా డీఎస్పీలకు ఘన వీడ్కోలు

## - అంకితభావంతో పనిచేయాలని ఎస్పీ అశోక్ కుమార్ సూచన




జగిత్యాల్ ప్రతినిధి మే 15 (ప్రజాకలం) : జగిత్యాల జిల్లా పోలీస్ శాఖలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ప్రత్యేక బందోబస్తు విధుల్లో విశేష సేవలందించిన డీఎస్పీలు రఘు చందర్, శ్రీనివాస్‌లకు బదిలీ సందర్భంగా జిల్లా ఎస్పీ ఘనంగా సన్మానం నిర్వహించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బదిలీపై వెళ్తున్న అధికారులకు శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... జిల్లాలో విధులు నిర్వహించిన కాలంలో ఇద్దరు అధికారులు ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకువచ్చారని కొనియాడారు. ముఖ్యంగా పండుగలు, ఎన్నికలు, ప్రత్యేక బందోబస్తు, నేర నియంత్రణ, యువతలో మత్తు పదార్థాల నిర్మూలన వంటి అంశాల్లో సమర్థవంతంగా పనిచేశారని పేర్కొన్నారు. ప్రజల భద్రతకే ప్రాధాన్యత ఇస్తూ ప్రతి పోలీస్ అధికారి అంకితభావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. పోలీసింగ్‌లో నిజాయితీ, క్రమశిక్షణ, సేవాభావం ఉంటే ప్రజల ఆదరణతో పాటు ఉన్నతాధికారుల ప్రశంసలు కూడా లభిస్తాయని ఎస్పీ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని, ఎక్కడ విధులు నిర్వహించినా వృత్తి ధర్మాన్ని పాటిస్తూ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కొత్త ప్రాంతాల్లో కూడా ఇదే సేవా తత్వంతో ప్రజలకు చేరువై సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లనున్న డీఎస్పీలు జగిత్యాల జిల్లాలో పనిచేసిన అనుభవాలను గుర్తు చేసుకున్నారు. జిల్లా ఎస్పీ మార్గదర్శకత్వంలో పనిచేయడం గర్వంగా భావిస్తున్నామని తెలిపారు. అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది అందించిన సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. జగిత్యాల జిల్లాలో సేవలందించడం తమకు మంచి అనుభవాన్ని ఇచ్చిందని, మధుర స్మృతులతో కొత్త బాధ్యతలకు వెళ్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ , డీఎస్పీలు పురుషోత్తం రెడ్డి, రాములు, సీఐలు, ఎస్ఐలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రాథమిక పాఠశాల లో 90% కి మించి పాఠశాలకు హాజరైన ఉపాధ్యాయులకు సన్మానం

## - మండల విద్యాధికారి, గ్రామ సర్పంచ్, పాఠశాల ప్రధానోపా ధ్యాయులు ఆధ్వర్యంలో



ఎండపల్లి, మే 15 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామం లో ప్రాథమిక పాఠశాల లో ఉపాధ్యాయులు రాష్ట్రం లోనే అత్యధిక 90 హాజరు శాతం ఉన్న ఉపాధ్యాయులను అభినందించి న పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ శుక్రవారం రోజున ఉపాధ్యాయు లకు ఘన సన్మానం ప్రాథమిక పాఠశాల గుల్లకోట లో పని చేస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యా యులు వి ప్రశాంత్, కే కృష్ణారెడ్డి లను శుక్రవారం రోజున ఎండపల్లి మండల విద్యాధికారి సముద్రాల హరికృష్ణ, గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్, పాఠశాల ప్రధానోపా ధ్యాయులు చందూరి రాజిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మా నించారు. తెలంగాణ రాష్ట్రం లో సెప్టెంబర్ 2025 నుండి ఐదు మార్చి 2026 మధ్యకాలంలో 90 శాతానికి మించి పాఠశాలకు హాజరైన ఉపాధ్యాయులకు రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ప్రత్యేకంగా ప్రశంసా పత్రాలు అందజేయడం జరిగింది. ఇందు లో భాగంగా జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం ప్రాథమిక పాఠశాల గుల్లకోట లో పనిచేస్తున్న వి ప్రశాంత్, కే కృష్ణారెడ్డి అనే ఇద్దరు ఉపాధ్యా యులు ఆ ఘనత సాధించి పలువురి ప్రశంసలు పొందారు. ఏప్రిల్ మాసంలో ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చందూరి రాజిరెడ్డి తెలంగాణ రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన పనితీరుతో పాఠశాలను అన్ని రంగాలలో అభివృద్ధి పరిచినందుకు ఉత్తమ ప్రధానోపాధ్యాయులుగా గుర్తించి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈ నవీన్ నికోలస్ గారు ఘనంగా సన్మానించి ప్రశంసా పత్రం అందించారు. ఈ నెలలో ప్రాథమిక పాఠశాల గుల్లకోటకు సంబంధించి న ఇద్దరు ఉపాధ్యాయులు మెరుగైన హాజరు శాతంతో రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ ప్రశంస పొందడం రెండు రోజుల క్రితం ఉత్తమ అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ గా ఒరుపుల లావణ్యను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సన్మానించడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలోనే గుల్లకోట ప్రాథ మిక పాఠశాల అన్ని రంగాలలో గుర్తింపును సాధించిందని పలువురు ప్రశంసించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయు లకు ప్రశంసా పత్రాలు అందజేయ డంతో పాటు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో మండల విద్యాధికారి సముద్రాల హరికృష్ణ, గుల్లకోట గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేశ్ గౌడ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు ఎస్ రమాదేవి, ఎన్ నరేష్ కుమార్, ఎన్ శ్రీలత, జి శిరీష తదితరులు పాల్గొన్నట్లు పాఠశాల ప్రధానోపా ధ్యాయులు చందూరి రాజిరెడ్డి తెలిపారు.

# లారీ ఢీకొని వృద్ధుడు మృతి



## - మేడిపల్లి గ్రామంలో విషాదం

మెట్ పల్లి రూరల్,మే 15:(ప్రజా కలం):అతివేగం ఒకరి ప్రాణాన్ని బలితీసుకుంది. జాతీయ రహదారి దాటుతున్న క్రమంలో వేగంగా దూసుకొచ్చిన లారీ ఢీకొట్టడంతో ఓ వృద్ధుడు అక్కడికక్కడే దుర్మరణం చెందిన విషాద సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని మేడిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మేడిపల్లి గ్రామానికి చెందిన కోట రాజన్న (78, తండ్రి: రాజారాం) నివాసం జాతీయ రహదారి (ఎన్ హెచ్ 63) కి అనుకుని ఉంటుంది. రాజన్న ప్రతిరోజూ ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడానికి, ముఖం కడుక్కోవడానికి హైవే అవతలి వైపు ఉన్న బోరు బావి వద్దకు వెళ్తుంటాడు. ఎప్పటిలాగే శుక్రవారం (మే 15) ఉదయం సుమారు 5:30 గంటల ప్రాంతంలో ముఖం కడుక్కుని తిరిగి ఇంటికి రావడానికి రహదారి దాటుతున్నాడు. ఈ క్రమంలో మెట్‌పల్లి వైపు నుండి ఆర్మూర్ వైపు మామిడి పండ్ల లోడుతో అతివేగంగా, అజాగ్రత్తగా దూసుకొచ్చిన హర్యానా రిజిస్ట్రేషన్ లారీ (HR 61 C 4844) రాజన్నను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన వృద్ధుడు రాజన్న అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను హర్యానా రాష్ట్రంలోని నాన్ తల గ్రామానికి చెందిన రామ్ నివాస్ (48, తండ్రి: బాణారాం)గా గుర్తించారు. మృతుడి కుమారుడు కోట రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం ఎస్సై జి. నవీన్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. శవపరీక్ష నిమిత్తంమృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.కళ్లెదుటే తండ్రి రోడ్డు ప్రమాదంలో మరణించడంతో మృతుని కుటుంబంలో తీవ్ర విషాద ఛాయలు చోటు చేసుకుంది.

# పశువుల అక్రమ రవాణాపై పటిష్ట నిఘా

## -రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా



పెద్దపల్లి,మే15:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) రాబోయే బక్రీద్ పండుగను పురస్కరించుకుని పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లాలో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసినట్లు సీపీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. శుక్రవారం సుల్తానాబాద్ మండలం దుబ్బపల్లి వద్ద ఏర్పాటు చేసిన అంతర్‌జిల్లా సరిహద్దు చెక్‌పోస్టును జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్‌పోస్ట్ వద్ద తనిఖీల సరళిని,వివరాల నమోదు రిజిస్టర్లను పరిశీలించిన సీపీ విధుల్లో ఉన్న సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి,పశువుల రవాణాకు సంబంధించిన పత్రాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించాలని,అనుమానాస్పద వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో మరింత అప్రమత్తంగా ఉంటూ విధులను నిర్వర్తించాలని,నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పండుగ సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలంతా పోలీసులకు సహకరించాలని,ఏదైనా అనుమానాస్పద సమాచారం ఉంటే వెంటనే తెలియజేయాలని కోరారు. ఈ తనిఖీ కార్యక్రమంలో పెద్దపల్లి ఏసీపీ జి.కృష్ణ, సుల్తానాబాద్ సీఐ రంజిత్,ఎస్ఐ చంద్రకుమార్ తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా కలం
శనివారం, మే 16, 2026

# పోదుపు బాటలో 40 దేశాలు

ఒక ఏడాది పాటు ఖర్చులు తగ్గించుకోండి. బంగారం కొనుగోలు చేయకండి. విలాసవంతమైన వస్తువుల కోసం డబ్బులు వెచ్చించకండి.. ఇటీవల హైదరాబాద్ సభలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపు ఇది. సహజంగానే ప్రధానమంత్రి పిలుపునకు వక్రీకరణలు చేసేస్తుంది కాంగ్రెస్ పార్టీ. ఇప్పుడు కూడా అదే పని చేసింది.. వాస్తవానికి పొదుపు అనేది మన జీవితంలో ఒక భాగం అయితే అది చాలా బాగుంటుంది.. ఉదాహరణకు మనకు జ్వరం వస్తే డాక్టర్ మాంసాహారం తినవద్దని చెబుతుంటారు. దానివల్ల ఆరోగ్యానికి ఇబ్బంది కలుగుతుందని డాక్టర్ పరోక్షంగా హెచ్చరికలు జారీ చేస్తారు. దానిని మనం సానుకూలంగా తీసుకోవాలి. అంతేతప్ప వ్యతిరేకంగా తీసుకుంటే మన ఆరోగ్యమే పాడవుతుంది. ఇదే విషయాన్ని నరేంద్ర మోడీ పరోక్షంగా చెప్పారు. దేశ ప్రధాని సూచించిన పొదుపు మంత్రాన్ని మనలో చాలామంది వ్యతిరేకంగా చూస్తున్నారు గాని.. మన మాదిరిగానే ప్రపంచ వ్యాప్తంగా 40 దేశాలు పొదుపు మంత్రాన్ని పాటిస్తున్నాయి.పశ్చిమాసియా సంక్షోభం ఇప్పుడు ప్రపంచానికి కొత్త పాఠాలు నేర్పుతోంది. అయితే దీని నుంచి తేరుకోవడానికి ప్రపంచ వ్యాప్తంగా 40 దేశాలు పొదుపు చర్యలను పాటిస్తున్నాయి.. ఇంతకీ ఆ జాబితాలో ఎటువంటి దేశాలు ఉన్నాయంటేమన పక్కనే ఉన్న బంగ్లాదేశ్, శ్రీలంక, పెరూ వంటి దేశాలు పాఠశాలలకు సంబంధించిన పని దినాలను పూర్తిగా తగ్గించాయి. రిమోట్ లెర్నింగ్ విధానాన్ని పెంచేశాయి.. శ్రీలంకలో అయితే బుధవారాలలో కార్యాలయాలకు సెలవులు ప్రకటిస్తున్నారు. జోర్డాన్, పాకిస్తాన్ దేశాలలో ప్రభుత్వ అధికారులకు సంబంధించిన అంతర్జాతీయ ప్రయాణాలను పూర్తిగా నిషేధించాయి. విదేశాలకు సంబంధించిన ప్రతినిధులకు ఆతిథ్యం ఇవ్వడాన్ని జోర్డాన్ పూర్తిగా తగ్గించింది. ప్రభుత్వ భవనాలలో ఏసీల వినియోగాన్ని కూడా తగ్గించాలని ఆదేశాలు జారీ చేసింది. బంగ్లాదేశ్లో ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, మసీద్ ప్రాంతాలలో ఏసీల వినియోగాన్ని కనీసం 25ళీ లేదా అంతకంటే ఎక్కువ ఉష్ణోగ్రతకు సెట్ చేయాలని బంగ్లాదేశ్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. శ్రీలంక, మలేషియా, థాయిలాండ్ ప్రాంతాలలో కూడా ఇటువంటి ఆదేశాలు అమలులో ఉన్నాయి.ఆస్ట్రేలియాలో ఎవరీ లిటిల్ బీట్ హెల్ప్స్ ప్రచారం మొదలైంది. ఇది ఇంధన వీడియో గాని స్వచ్ఛందంగా ప్రోత్సహిస్తూ ఉంటుంది.బ్రిటన్ దేశంలో చిన్న చిన్న వ్యాపారులు ఎలక్ట్రిక్ హీటింగ్ విధానానికి మారిపోవడానికి సిద్ధంగా ఉన్నారు. దానికోసం ఆర్థిక సహాయం పొందడానికి బాయిలర్ ఆఫ్ గ్రేడ్ పథకాన్ని ఇటీవల మొదలుపెట్టారు.. విద్యుత్ వినియోగాన్ని తగ్గించడానికి శ్రీలంక ప్రభుత్వం బిల్ బోర్డులపై లైట్లు ఆపివేస్తోంది. ఫిలిప్పీన్స్, పాకిస్తాన్ దేశాలలో ప్రభుత్వ అధికారులకు నాలుగు రోజుల పని దినాలు అమలులో ఉన్నాయి. ఇందులో 50% రిమోట్ వర్క్ విధానాన్ని అక్కడి ప్రభుత్వాలు అందుబాటులో తీసుకొచ్చాయి. ఇండోనేషియాలో ప్రభుత్వ సంస్థలలో పనిచేసే ఉద్యోగులు శుక్రవారం ఇంటి వద్ద నుంచి పనిచేస్తున్నారు.. మయన్మార్ దేశంలో బుధవారం రిమోట్ వర్క్ విధానం అమలులో ఉంది. వియత్నాం కూడా ఇదే విధానాన్ని అమలు చేసే పనిలో ఉంది. మరో వైపు బంగారం ఎలా అయితే మెరుస్తుందో.. దీని ఆధారంగా సాగే రంగాలు అదే స్థాయిలో దూసుకుపోతుంటాయి. అయితే బంగారం వినియోగం స్థాయిలో ఉత్పత్తి లేకపోవడంతో భారత్ లాంటి దేశం దిగుమతుల మీద ఆధారపడుతూ ఉంటుంది. ఈ దిగుమతులే ఇప్పుడు భారత్ కు గుదిబండ లాగా మారిపోయాయి.. అందువల్లే భారత ఆర్థిక వ్యవస్థ బంగారం వల్ల తీవ్రమైన ఒత్తిడికి గురవుతోంది. అంతర్జాతీయంగా ఏర్పడిన పరిస్థితుల వల్ల బంగారం ధరలు స్థిరంగా ఉండటం లేదు. అయినప్పటికీ బంగారం దిగుమతులు మనదేశంలో తగ్గడం లేదు. బంగారం దిగుమతికి అధికంగా ఫారెక్స్ నిల్వలను ఖర్చు చేయడం వల్ల ఇబ్బంది ఏర్పడుతోంది. దీంతో భారత్ సుంకం పెంచుతూ నిర్ణయం తీసుకుంది.సుంకం పెంచడం వల్ల మనదేశంలో ఉన్న బంగారం, వెండి ధరలు పెరుగుతాయి. పాత బంగారం రీసైక్లింగ్ కు వచ్చేస్తూ ఉంటుంది. దీనివల్ల దిగుమతులు చాలా వరకు తగ్గుతాయి. అదే సమయంలో పన్నులు అధికంగా ఉన్నప్పుడు.. అక్రమ మార్గంలో బంగారం దేశానికి దిగుమత అయ్యే ప్రమాదం లేకపోలేదు.. దీనిని ఏ విధంగా అడ్డుకుంటారనేది తెలియాల్సి ఉంది. ఇప్పటికే మన దేశంలో ఉన్న ప్రధాన విమానాశ్రయాలలో ప్రతిరోజు కస్టమ్స్ అధికారులు విదేశాల నుంచి అక్రమంగా వస్తున్న బంగారాన్ని పట్టుకుంటున్నారు. అయితే ఇప్పుడు బంగారం మీద సుంకం పెంచిన నేపథ్యంలో.. అధికారులు దాడులను మరింత తీవ్రం చేసే అవకాశం ఉంది.ఇక మనదేశంలో బంగారం మీద సుంకం విధించడం ఇదే తొలిసారి కాదు. 2022లో బంగారం మీద సుంకం 10.75 శాతం ఉండేది. అప్పుడు దానిని 15% కి పెంచారు. 2024 లో మనదేశంలో ఆభరణాల పరిశ్రమలను ప్రోత్సహించేందుకు సుంకం మొత్తాన్ని ఆరు శాతానికి తగ్గించారు.. మధ్య ఆసియా ప్రాంతంలో యుద్ధం వల్ల సుంకం మొత్తాన్ని ఆరు శాతం నుంచి 15% పెంచారు. 2012 కంటే ముందు కూడా బంగారం పై దిగుమతి సుంకం ఉండేది. అయితే బంగారం విలువతో సంబంధం ఉండేది కాదు. 10 గ్రాములకు కేవలం 300 రూపాయలు చొప్పున సుంకం వసూలు చేసేవారు. అంతర్జాతీయంగా బంగారం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో వ్యాట్ అనే విధానాన్ని కేంద్రం తీసుకొచ్చింది. అప్పుడు బంగారం విలువలో రెండు శాతం కస్టమ్స్ టాక్స్ విధించేవారు. దీంతో నాడు బంగారం మీద ఒక శాతంగా ఉన్న దిగుమతి సుంకం డబుల్ అయింది. బడ్జెట్లో అయితే దానిని నాలుగు శాతం పెంచేశారు.2013లో రూపాయి విలువ దారుణంగా పతనమైంది. విదేశీ మారక ద్రవ్య నిల్వలు దారుణంగా పడిపోయాయి. ఈ నేపథ్యంలో ఆ సంవత్సరం ప్రభుత్వం ఏకంగా మూడుసార్లు సుంకాన్ని పెంచేసింది. 2013లో జనవరిలో నాలుగు శాతం నుంచి ఆరు శాతానికి పెంచింది. జూన్ నెలలో ఏకంగా 6 నుంచి 8 శాతానికి పెంచింది. ఆగస్టులలో 8 నుంచి 10 శాతానికి పెంచింది. 2014 అంటే నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2018 వరకు దాదాపు 10 శాతం దిగుమతి సుంకం మాత్రమే వసూలు చేసేవారు. 2019లో 12.5% పెంచేశారు. 2021 కేంద్ర బడ్జెట్లో 12.5% నుంచి 10.75% తగ్గించారు. తాజాగా 15% సుంకం పెంచిన నేపథ్యంలో.. దాని విలువలను కేంద్రం బయటపెట్టింది. 10 శాతాన్ని ప్రాథమిక కస్టమ్స్ డ్యూటీగా.. ఐదు శాతం అగ్రికల్చర్ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్మెంట్ సెస్ గా ప్రకటించింది.

# రోడ్లపై పశువులు వదిలితే కఠిన చర్యలు తప్పవన్న ఎస్ఐ

## - మూడు ఆవులను తాటిపల్లి గోశాలకు తరలించిన అధికారులు



ధర్మపురి, మే 15 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణం లో రోడ్లపై ఒంటరిగా తిరుగు తున్న పశువుల విషయం లో పోలీసులు, మున్సిపల్ అధి కారులు ఇప్పటికే పలుమార్లు యజమానులకు హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే ప్రజల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, పశువుల సంరక్షణ దృష్ట్యా ఆవులు, ఎద్దులు, బర్రెలను బయట వదలకుండా యజమానులు తమ ఇళ్ల వద్దనే కట్టివేసుకోవాలని సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ నేపథ్యం లో చాలా మంది పశువుల యజమానులు బాధ్యతగా స్పందించి తమ పశువులను తీసుకెళ్లి జాగ్రత్తగా సంరక్షించు కున్నారు. అయితే కొంతమంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం తో మూడు ఆవులు పట్టణంలోని ప్రధాన రహదారులపై స్వేచ్ఛగా తిరుగుతూ ప్రజలకు, వాహన దారులకు ఇబ్బందులు కలిగి స్తున్నట్లు గుర్తించబడింది. దీనిపై వెంటనే స్పందించిన ధర్మపురి పోలీసులు,మున్సిపల్ సిబ్బంది సంయుక్తంగా చర్యలు చేపట్టి ఆ మూడు ఆవులను సురక్షితంగా తాటిపల్లి గోశాలకు తరలించడం జరిగింది. అలాగే సంబంధిత పశువుల యజమానుల పై చట్టపరమైన కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ప్రజల ప్రాణ భద్రతకు భంగం కలిగించే విధంగా పశువులను రోడ్లపై వదిలేయడం తీవ్రమైన నిర్లక్ష్యంగా పరిగణించ బడుతుంది. ఇకపై కూడా రోడ్లపై ఎవరూ లేకుండా ఒంటరిగా పశువులు కనిపించిన పక్షంలో వాటిని స్వాధీనం చేసుకొని గోశాలలకు తరలించడం తో పాటు సంబంధిత యజమాను ల పై కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుంది.ధర్మపురి పట్టణ ప్రజలు, పశువుల యజమానులు పోలీసు, మున్సిపల్ అధికారులకు సహకరించి పట్టణంలో శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ, పరిశుభ్రత పరిరక్షణ లో భాగస్వాములు కావలసిన అవసరం ఉందని ధర్మపురి ఎస్సై జి మహేష్ తెలిపారు.

# బీజేపీలో రచ్చకెక్కిన విభేదాలు

## - నడిరోడ్డుపై నేతల ఘర్షణ

పెద్దపల్లి, మే15:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ నాయకుల మధ్య అంతర్గత విభేదాలు ఒక్కసారిగా బహిర్గతమయ్యాయి.స్థానిక నేతల మధ్య చోటుచేసుకున్న ఘర్షణ నడిరోడ్డుపై పరస్పర దూషణలు,భౌతిక దాడుల ప్రయత్నం వరకు వెళ్లడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇచ్చే పార్టీలో ఈ తరహా ఉదంతం చోటుచేసుకోవడం పట్ల సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.వివరాల్లోకి వెళితే...బీజేపీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేష్ వ్యవహారశైలిని తప్పుబడుతూ బీజేవైఎం కార్యకర్త మల్లెత్తుల అంజి యాదవ్ కొంతకాలంగా సోషల్ మీడియాలో విమర్శనాత్మక పోస్టులు పెడుతున్నారు.ఈ క్రమంలో ఇరుపక్షాల మధ్య సామాజిక మాధ్యమాల్లో సవాళ్లు,ప్రతిసవాళ్లు నడిచాయి.ఈ వివాదం కాస్తా ముదరడంతో ఇద్దరు నేతలు మండల కేంద్రంలోని నడిరోడ్డుపై ముఖాముఖిగా తలపడ్డారు. మాట మాట పెరిగి ఒకరినొకరు నెట్టుకునే స్థాయికి పరిస్థితి వెళ్ళింది.మండల అధ్యక్షుడు కార్యకర్తను పక్కకు నెట్టేసే ప్రయత్నం చేయగా,సదరు కార్యకర్త కూడా తీవ్ర ఆగ్రహంతో నిరసన వ్యక్తం చేస్తూ దాడికి యత్నించడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.రోడ్డుపై సాగిన ఈ హైడ్రామాను చూసేందుకు స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.ఇటీవల మండల కేంద్రంలో జరిగిన అక్రమ



నిర్మాణాలపై ఫిర్యాదుల విషయంలో వీరి మధ్య విభేదాలు తలెత్తినట్లు సమాచారం. మండల అధ్యక్షుడు వ్యక్తిగత కారణాలతోనే సొంత పార్టీ కార్యకర్తల ఇళ్లను లక్ష్యంగా చేసుకుని ఫిర్యాదులు చేస్తున్నారనే ఆరోపణలు కేడర్ నుంచే వినిపిస్తున్నాయి.దీనికి తోడు ఆయనపై ఆర్థికపరమైన వసూళ్ల ఆరోపణలు కూడా రావడంతో వివాదం మరింత తీవ్రరూపం దాల్చింది. నడిరోడ్డుపై జరిగిన ఈ బహిరంగ ఘర్షణతో పార్టీ ప్రతిష్ట దెబ్బతిందని నియోజకవర్గ స్థాయి నేతలు భావిస్తున్నారు. ఈ ఘటనపై పార్టీ అధిష్టానం తక్షణమే స్పందించి, బాధ్యులపై విచారణ జరిపి కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని స్థానిక పార్టీ శ్రేణులు డిమాండ్ చేస్తున్నారు.

# ఉపాధి హామీ ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేయండి



## - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి,మే15;(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

జిల్లాలో ఉపాధి హామీ పనులు,ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను అధికారులు సమన్వయంతో వేగంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు.శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీతో కలిసి పంచాయతీల అభివృద్ధి,ఉపాధి హామీ, ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే 25 రోజుల్లో ఉపాధి హామీ కార్మికుల హాజరును గణనీయంగా పెంచి,మంజూరైన పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు.ప్రతి మండలంలో రోజుకు సగటున 305 మంది హాజరే లక్ష్యంగా,ఉదయం 5:30 నుండి 6:30 గంటల లోపు కార్మికుల మొబిలైజేషన్ జరిగేలా ఎంపీడీవోలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ముత్తారం,జూలపల్లి, శ్రీరాంపూర్ మండలాల్లో కాలువల పూడికతీత పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.అలాగే ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని సమీక్షిస్తూ,ప్రస్తుతం పెండింగ్లో ఉన్న 605 శాంక్షన్ ఆర్డర్లను,గ్రౌండింగ్ పూర్తయిన ఇళ్లకు 5 రోజుల్లోగా జారీ చేయాలని ఆదేశించారు.రద్దయిన ఇళ్లను అర్హులైన ఇతర లబ్ధిదారులకు వేగంగా కేటాయించాలని,ప్రతి మండలంలో కనీసం 10 నుండి 15 ఇళ్లకు గృహ ప్రవేశాలు జరిగేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని తెలిపారు.పెండింగ్లో ఉన్న డబుల్ బెడ్రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, కేటాయింపు ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ నరేందర్, హౌసింగ్ పీడీ రాజేశ్వర్,ఎంపీడీవోలు,ఈఈ పీఆర్, హౌసింగ్ ఏఈలు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# చదువుతోనే బాలికల భవిష్యత్తు ఉజ్వలం

## మహిళా సాధికారత సమన్వయకర్త దయ అరుణ - బాలికల రక్షణ,ఆరోగ్యంపై ప్రత్యేక సదస్సు

ఓదెల,మే 15 (ప్రజాకలం జిల్లా ప్రతినిధి) ఆడపిల్లలు చదువుతోనే సమాజంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త దయ అరుణ అన్నారు.మండల కేంద్రమైన ఓదెల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు పలు కీలక అంశాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వ 99 రోజుల ప్రజా పాలన పురస్కరించుకుని పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ తరగతులలో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా దయ అరుణ మాట్లాడుతూ.. ఆడపిల్లలను రక్షించండి-చదివించండి అనే నినాదంతో బాలికల హక్కుల సాధన,మహిళా రక్షణ కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు.విద్యార్థినులు చదువుతో పాటు తమ ఆరోగ్య పరిరక్షణ పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని,ముఖ్యంగా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు ఇచ్చే హెచ్పీవీ టీకా ప్రాధాన్యతను తెలుసుకోవాలని సూచించారు.అత్యవసర




సమయాల్లో ఆపన్నహస్తం అందించే ప్రభుత్వ ఉచిత సహాయక సంఖ్యల వినియోగంపై బాలికలకు అవగాహన కల్పించారు. నేటి సమాజంలో యువత భవిష్యత్తును నీరుగారుస్తున్న మాదకద్రవ్యాల వ్యసనానికి దూరంగా ఉండాలని,వాటి నివారణపై విద్యార్థినులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె ఉద్బోధించారు.బాలికలు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తేనే అన్ని రంగాలపై పట్టు సాధించవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారి జ్యోతి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

# గ్రంథాలయాలు విజ్ఞానానికి సోపానాలు



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే 15 (ప్రజా కలం)

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో గ్రంథాలయాలు ఉండడంతో విద్యార్థులకు విజ్ఞానం కలుగుతుందని,ఆ విజ్ఞానం ద్వారా ఉపాధి అవకాశాలు లభిస్తాయని మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కే.వేంకయ్య అన్నారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విద్యా వారోత్సవాల వేడుకల సందర్భంగా మెట్ పల్లి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పుస్తకాల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గ్రంథాలయాల ద్వారా విద్యార్థులకు విజ్ఞానం బాగా పెరుగుతుందని,ఆ విజ్ఞానంతో పోటీ పరీక్షలకు హాజరు అయితే మాత్రం ఉపాధి అవకాశాలు వారికే లభిస్తాయని అన్నారు. కొందరు విద్యార్థులు గ్రంథాలయాల్లోనే ఎక్కువ సమయం గడుపుతున్నారని, దాంతో విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను సాధిస్తున్నారని ప్రిన్సిపాల్ కే.వేంకయ్య హర్షం వ్యక్తం చేశారు.కళాశాల ఇంచార్జి లైబ్రేరియన్ ఏ. మనోజ్ కుమార్ మాట్లాడుతూ, కళాశాలలో విద్యార్థులకు సంబంధించిన అన్ని పుస్తకాలు ఉన్నాయని,ఆ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ తొంటి దేవన్న,కళాశాల అకాడమిక్ కో- ఆర్డినేటర్ బిల్ల రాజేందర్, లెక్చరర్లు అంజయ్య,శ్రీకాంత్, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గుల్లకోట నుండి రాజారాంపల్లి వైపు బైకుపై వెళ్తున్న క్రమంలో పాస్పోర్ట్ కవర్ పడి పోయింది

## -పాస్పోర్ట్ నంబర్ ఈ 9563704 ఎవరికైనా దొరికినచో నా సెల్ నం 9000868248 తెలుపగలరు

ఎండపల్లి, మే 15 : ( ప్రజా కలం ప్రతినిధి )



జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామానికి చెందిన వొజ్జల లక్ష్మణ్ తండ్రి రాజేశం పుట్టిన తేదీ 10.02.1983 వయసు 43 సంవత్సరాలు కులం ఓసి వైశ్య ఇంటి నంబర్ 3-37 గ్రామం గుల్లకోట అను నేను తేదీ 12.5.2026 మంగళవారం రోజున ఉదయం 10 గంటల ప్రాంతంలో నేను గుల్లకోట నుండి రాజారాంపల్లి వైపు బైకుపై వెళ్తున్న క్రమం లో మార్గ మధ్యలో నా యొక్క పాస్పోర్ట్ తో ఉన్న కవరు పడిపోయింది పాస్పోర్ట్ నంబర్ ఈ 9563704 అనే నెంబర్ గల పాస్పోర్టు తో ఉన్న కవర్ పడిపోయింది ఎవరికైనా దొరికినచో నా యొక్క సెల్ నెంబర్ 9000868248 నంబర్ కు తెలుపగలరు.

# రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

పెద్దపల్లి,మే15:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

పెద్దపల్లి-రాఘవాపురం రైల్వే స్టేషన్ల మధ్య మంథని ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో శుక్రవారం ఒక గుర్తు తెలియని పురుషుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు.ప్రమాద స్థలాన్ని పరిశీలించిన రామగుండం ప్రభుత్వ రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ జి.తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం...సుమారు 50 నుండి 55 సంవత్సరాల వయస్సు గల సదరు వ్యక్తి, పట్టాలపై వెళ్తున్న ఏదో ఒక ఎగువ రైలు బండి కింద పడి ప్రాణాలు కోల్పోయినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు.మృతుడు నలుపు రంగు ప్యాంట్,లోపల తెలుపు షర్ట్, పైన లైట్ బ్లూ రంగు షర్ట్ ధరించి ఉన్నాడని,అలాగే కలర్ డిజైన్ గల హాఫ్ ప్యాంటు,పింక్,బ్లూ,పసుపు రంగుల డిజైన్ ఉన్న టాప్ ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు.కాగా మృతుడు ధరించిన షర్ట్పై విఎంఆర్ దుర్గా టైలర్స్,శాంతి నగర్- బిసిఎం అనే లేబల్ కుట్టి ఉందని,అతని వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు గానీ, ఇతర వస్తువులు గానీ లభించలేదని వివరించారు.ప్రస్తుతం మృతదేహాన్ని తదుపరి చర్యల నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామని,ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తిరుపతి పేర్కొన్నారు.పైన పేర్కొన్న ఆనవాళ్లను బట్టి మృతుని వివరాలు తెలిసిన వారు ఎవరైనా ఉంటే వెంటనే 9949304574, 8712658604 ఫోన్ నెంబర్లలో సంప్రదించి సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# శ్రీ కట్ట మైసమ్మ తల్లికి వెండి కానుక

పెద్దపల్లి,మే15:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

పట్టణంలోని మినీ ట్యాంక్ బండ్ పరిధిలో వెలసిన శ్రీ కట్ట మైసమ్మ తల్లి ఆలయానికి చందపల్లె మాజీ ఎంపీటీసీ గంగుల భారతి - వెంకటేశం దంపతులు 50 గ్రాముల వెండిని కానుకగా సమర్పించారు.ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు,అర్చనలు నిర్వహించారు.అనంతరం ఆలయ అర్చకులు దాతలకు తీర్థప్రసాదాలు అందజేసి,పూలమాలలు,కండువాలతో ఘనంగా సత్కరించి వేదమంత్రాల మధ్య ఆశీర్వదించారు.ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు బొడ్డుపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ కట్ట మైసమ్మ తల్లి దయ వల్ల పట్టణ ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని,అమ్మవారి శుభాశీస్సులు ఎల్లప్పుడూ అందరిపై ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు.భక్తిశ్రద్ధలతో సాగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ దొడ్డుపల్లి జగదీష్,రజక సంఘం అధ్యక్షులు బొడ్డుపల్లి రామ్మూర్తి,ఆలయ కమిటీ సభ్యులు గండు రంగయ్య,భూతగడ్డ సంపత్,గుడికందుల మల్లయ్య,పవనూరి లక్ష్మణ్,గుడికందుల శ్రీనివాస్,ముక్కెర రాజేశం,రాచమల్ల అంజయ్య,మధునయ్య, బొడ్డుపల్లి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



## ఎండపల్లి మండల నూతన కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులుగా గెల్లు నియామకం

### -నియామక పత్రం అందుకున్న గెల్లు చంద్రశేఖర్ యాదవ్



ఎండపల్లి, మే 15 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండల నూతన కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు గా గెల్లు చంద్రశేఖర్ యాదవ్ ను నియమించిన పీసీసీ రాష్ట్ర అధ్యక్షులు బి మహేష్ కుమార్ గౌడ్ నియమించారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పిసిసి అధ్యక్షులు బి మహేష్ కుమార్ గౌడ్ లేక విడుదల చేశారు. పిసిసి అధ్యక్షులు బి మహేష్ కుమార్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజేంగి నందయ్య, రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఉమ్మడి వెల్గటూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాటిపర్తి శైలేందర్ రెడ్డి, పొనుగోటి శ్రీనివాసరావు, మద్దుల గోపాల్ రెడ్డి, లకు గెల్లు చంద్రశేఖర్ యాదవ్ ధన్యవాదాలు తెలిపారు.

## అరెస్టులతో ఉద్యమాలను అణచలేరు

### - ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు దామ సదయ్య

### - తెలంగాణ ఉద్యమకారుల ముందస్తు అరెస్ట్




పెద్దపల్లి,మే15 (ప్రజాకలం జిల్లా ప్రతినిధి)ఎన్నికల సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడి కోసం హైదరాబాద్‌కు తరలివెళ్తున్న ఉద్యమకారులను పోలీసులు శుక్రవారం ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు దామ సదయ్య,ప్రధాన కార్యదర్శి గుర్రాల వీరేశం మాట్లాడుతూ ప్రాణాలకు తెగించి ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమాలు చేపట్టిన తమకు ప్రభుత్వాలు మొండిచేయి చూపించడం విచారకరమన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్నా ఇప్పటివరకు ఇస్తామన్న 250 గజాల నివేశన స్థలాలు కేటాయించకపోవడం, ఇతర ఎన్నికల హామీలను నెరవేర్చకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తమ హక్కుల సాధనకై శాంతియుతంగా ఆందోళన చేస్తున్న తమను అక్రమంగా అరెస్టు చేసినంత మాత్రాన ఉద్యమాన్ని ఆపబోమని,ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని ఇరువురు స్పష్టం చేశారు. పోలీసుల చేతిలో అరెస్టయిన వారిలో ఉద్యమ ఫోరం నాయకులు రాజేష్, కొమురయ్య తదితరులు ఉన్నారు.

## రెడ్ క్రాస్ సేవలకు ప్రజల సహకారం అవసరం

### - సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

జగిత్యాల్ ప్రతినిధి, మే 15 (ప్రజాకలం) :

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇండియన్ రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శుక్రవారం



ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్ క్రాస్ సంస్థ అందిస్తున్న సేవలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఆ సేవలను మరింత విస్తృతంగా ప్రజలకు చేరవేసేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈ నెల 15వ తేదీ నుండి జూన్ 15వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలోని ప్రజలు అధిక సంఖ్యలో సభ్యత్వ నమోదు చేసుకుని రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాలకు సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. అత్యవసర పరిస్థితుల్లో, విపత్తుల సమయంలో మరియు సామాజిక సేవా కార్యక్రమాల్లో రెడ్ క్రాస్ కీలక పాత్ర పోషిస్తోందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, రెడ్ క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లు పట్టివేత

### - నిందితులను బైండోవర్ చేసిన సీఐ నిరంజన్ రెడ్డి

కరీంనగర్ ప్రతినిధి మే 15 (ప్రజాకలం) పోలీసులు గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా చేగుర్తి గ్రామానికి చెందిన ఎలకపెల్లి సందీప్,బొడ్డు శ్రీకాంత్ లు తమ ట్రాక్టర్ల తో మానేరు వాగు నుండి ఇసుకను అక్రమంగా ట్రాక్టర్లలో కరీంనగర్ వైపుకు తరలిస్తుండగా బొమ్మకల్ గ్రామంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద మరియు చేగుర్తి గ్రామం వద్ద కరీంనగర్ రూరల్ పోలీసులు పట్టుకొని అట్టి ట్రాక్టర్లను సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు చేసి తదుపరి చర్య నిమిత్తం కోర్టుకు పంపించినట్లు సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు.ఎవరైనా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు సస్పెక్ట్ షీట్లు తెరుస్తామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.






## చివరి గింజ వరకు మద్దతు ధరతో

# కొనుగోలు చేస్తాం



### - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి,మే15:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

జిల్లాలో రైతుల వద్ద ఉన్న చివరి గింజ వరి,మొక్కజొన్న పంటను మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష స్పష్టం చేశారు.శుక్రవారం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝూతో కలిసి ఆయన పెద్దపల్లి మండలంలోని అన్నపూర్ణ, రాఘవేంద్ర రైస్ మిల్లులతో పాటు పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి నిల్వలు,మిల్లింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయి సమస్యలను వెంటనే పరిష్కరించేందుకే ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఈ యాసంగిలో సుమారు 4.25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉండగా, ఇప్పటివరకు 1.6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతులకు రూ. 280 కోట్లు చెల్లించామని,సెలవు రోజుల్లోనూ ఖాతాల్లో డబ్బులు జమ చేశామని పేర్కొన్నారు.తీవ్ర ఎండలు,వరితో పాటు మొక్కజొన్న కొనుగోళ్లు ఒకేసారి రావడం వల్ల రవాణా,హమాలీ సమస్యలు ఎదురైనప్పటికీ ప్రస్తుతం రోజువారీ కొనుగోళ్లను 13 వేల మెట్రిక్ టన్నులకు పెంచామని,మే 20 నాటికి 80 శాతం కొనుగోళ్లు పూర్తవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల వర్షాలకు తడిసిన 700 మెట్రిక్ టన్నుల ధాన్యానికి కూడా మద్దతు ధర కల్పించామని,ఐదేళ్ల తర్వాత జిల్లాలో 8 కేంద్రాల ద్వారా మొక్కజొన్న కొనుగోళ్లు కూడా ముమ్మరంగా సాగుతున్నాయని తెలిపారు.రైతులు స్వయంగా గన్నీ సంచులు తెస్తే ఒక్కో దానికి రూ.21 చెల్లిస్తామని,హమాలీ కూలీని రూ.8.50కు పెంచామని చెబుతూ,జిల్లాలో ఎక్కడా తూకాల్లో కటింగ్‌లు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. అనంతరం,సుల్తానాబాద్ మండలం దుబ్బపల్లి చెక్ పోస్ట్‌ను తనిఖీ చేసిన కలెక్టర్,బక్రీద్ పర్వదినం నేపథ్యంలో అక్రమ పశువుల రవాణా జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ఏసిపి జి.కృష్ణ,డీటీ సివిస్ మహేష్,మార్కెటింగ్ మేనేజర్ ప్రవీణ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

### - రైస్ మిల్లుల్లో 24 గంటల్లోనే అన్‌లోడింగ్ పూర్తి చేయాలి

### - అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ ఆదేశాలు

జగిత్యాల్ ప్రతినిధి, మే 15 (ప్రజాకలం) :

జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్ అధికారులను ఆదేశించారు. ఇబ్రహీంపట్నం మండలం గోధూరు గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలు మరియు శ్రీ రాజరాజేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లులను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాలలో జరుగుతున్న ధాన్యం సేకరణ విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించిన అదనపు కలెక్టర్, రైతులు ఎక్కువసేపు వేచి ఉండకుండా కొనుగోళ్లు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. కేంద్రాలలో హమాలీల సంఖ్య తగినంతగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ధాన్యం లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసి లారీలను ఆలస్యం లేకుండా రైస్ మిల్లులకు తరలించాలని అధికారులకు ఆదేశించారు. ట్రక్ షీట్ నమోదు, ట్యాబ్ ఎంట్రీలు వంటి డాక్యుమెంటేషన్ పనులను కూడా ఎలాంటి పెండింగ్ లేకుండా సమయానికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాలలో పారదర్శకత పాటించడంతో పాటు రైతులకు అవసరమైన సమాచారం స్పష్టంగా అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు సమయంలో తేమ శాతం,



నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పరిశీలించాలని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి అవకతవకలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను హెచ్చరించారు. అనంతరం రైస్ మిల్లులను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్, మిల్లర్లు హమాలీల సంఖ్యను పెంచి ధాన్యంతో వచ్చిన లారీలను 24 గంటల్లోగా అన్‌లోడ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైస్ మిల్లర్లు అధికారులతో సమన్వయం చేసుకుంటూ ధాన్యం కొనుగోళ్లు సజావుగా, వేగవంతంగా జరిగేలా చూడాలని తెలిపారు. అన్‌లోడింగ్‌లో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వరప్రసాద్, ఎంపీడీవో గణేష్, ఎంపీవో రామకృష్ణరాజు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## 24 గంటల్లో హత్య కేసు చేదన

### భార్యను హత్య చేసి దానిని అత్యాచారం, దోపిడీగా చిత్రీకరించేందుకు యత్నించిన భర్త అరెస్ట్

### మహిళలపై నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు -నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్ హెచ్చరిక




నిర్మల్ మే15 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ఖానాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన హత్య కేసును నిర్మల్ పోలీసులు 24 గంటల్లో ఛేధించారు. మొదటగా మృతురాలు నల్ల మౌనిక అదృశ్యమైనట్లు ఈ నేల 9 న మామడ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేయబడింది. అనంతరం 14 న ఖానాపూర్ మండలం కొత్త తర్లపాడు అటవీ ప్రాంతంలో మృతదేహం లభ్యమవడంతో కేసు హత్య కేసుగా మారింది. దర్యాప్తులో మృతురాలి భర్త నల్ల అరుణ్ తన భార్యను అదనపు కట్న వేధింపులు, కుటుంబ విభేదాలు, అక్రమ సంబంధాల నేపథ్యంలో పథకం ప్రకారం అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి గొంతు నులిమి హత్య చేసినట్లు వెలుగులోకి వచ్చింది. హత్య అనంతరం తనపై అనుమానం రాకుండా ఉండేందుకు గుర్తు తెలియని వ్యక్తులు అత్యాచారం చేసి హత్య చేసి, బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులు దోచుకెళ్లినట్లుగా నమ్మించే విధంగా ఘటనాస్థలాన్ని మార్పులు చేసినట్లు విచారణలో తేలింది. అనంతరం మృతురాలి బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్, ఇతర వస్తువులను దాచిపెట్టి, మామడ పోలీస్ స్టేషన్‌లో తప్పుడు మిస్సింగ్ ఫిర్యాదు ఇచ్చినట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. ఈ కేసు ఛేదనలో సీసీ కెమెరా ఫుటేజ్, సాంకేతిక ఆధారాలు శాస్త్రీయ దర్యాప్తు కీలక పాత్ర పోషించాయి. పోలీసులు నిందితుడు నల్ల అరుణ్‌తో పాటు అతని తల్లిదండ్రులు నల్ల శ్రీనివాస్, నల్ల అదెల్లను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి సుమారు 5 తులాల బంగారు ఆభరణాలు, మోటార్ సైకిల్, సెల్‌ఫోన్, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసిన ఆస్తుల మొత్తం విలువ సుమారు రూ.8 లక్షలు. ఈ కేసును 24 గంటల్లో ఛేదించిన నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, ఖానాపూర్ ఇన్స్పెక్టర్ అజయ్, ఎస్సై రాహుల్,దర్యాప్తులో పాల్గొన్న పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ప్రత్యేకంగా అభినందించారు. నిందితులపై బి ఎన్ ఎస్ చట్టంలోని సంబంధిత సెక్షన్లు, వరకట్నం చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## నూతన వధూవరుల ఆశీర్వదించిన జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు

( వరంగల్/ పర్వతగిరి) మే 15, ప్రజాకలం ప్రతినిధి.

పర్వతగిరి మండలం గోరుగుట్ట తండా గ్రామ సర్పంచ్ బానోత్ విజయలక్ష్మి భాస్కర్ నాయక్ గారి మేనల్లుడి వివాహ రిసెప్షన్లో పాల్గొని నూతన వధువు వరులను ఆశీర్వదించిన జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు బొంపెల్లి దేవేందర్ రావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్. ఈ కార్యక్రమంలో పర్వతగిరి సర్పంచ్ చిదురు శంకర్, మాల్య తండా సర్పంచ్ మంజుల శ్రీనివాస్, రావుర్ ఉప సర్పంచ్ కొమ్ము రమేష్, యువజన కాంగ్రెస్ నాయకులు నరేడ్ల సంతోష్, మండల సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ వంగ సాయికృష్ణ యాదవ్, హ్యాట్ తండా గ్రామపార్టీ అధ్యక్షులు లచ్చు నాయక్, మాజీ సర్పంచ్ వెంకట్రామ్, ఉప సర్పంచ్ భుక్య ఆగమ్మ, బుత్ కన్వీనర్ అనిల్ నాయక్, గ్రామ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## మహిళల ఆర్థిక సాధికారతకే ప్రభుత్వం ప్రాధాన్యత

### - కార్పొరేటర్ నిమ్మరాజుల రజిని



రామగుండం,మే15:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

డ్వాక్రా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి,వారిని కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిర మహిళా శక్తి' పథకాన్ని అమలు చేస్తోందని రామగుండం నగరపాలక సంస్థ 29వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మరాజుల రజిని రవి పేర్కొన్నారు. స్థానిక లింగాపూర్ పరిధిలోని డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులకు రామగుండం శాసనసభ్యులు శ్రీ మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్,నగర మేయర్ శ్రీ మహంకాళి స్వామిల ఆదేశాల మేరకు శుక్రవారం ఆమె చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మహిళా అభ్యున్నతి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమం ఎంతో అభినందనీయమన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్,మేయర్ మహంకాళి స్వామిల ప్రత్యేక చొరవ,సహకారంతో రాబోయే రోజుల్లో 29వ డివిజన్ అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మౌలిక వసతుల కల్పనతో పాటు డివిజన్ లోని మహిళలకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని,ఇందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిమ్మరాజుల రవి,వార్డ్ ఆఫీసర్ సంపత్,బిల్ కలెక్టర్ సిద్ధ ప్రసాద్,కాంగ్రెస్ నాయకులు అర్సనపెల్లి శ్రీనివాస్,అడిచర్ల చంద్రమౌళి,ఎనగందుల సంతోష్,మహిళా సంఘాల ప్రతినిధులు గంగారపు వనజ,సిరిపురం భారతి,ఆశా వర్కర్ పెద్దపల్లి మంజులతో పాటు పెద్ద సంఖ్యలో స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## ఫ్రెండ్లీ పోలీసింగ్‌తోనే ప్రజల్లో నమ్మకం

### - బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంథని రఘు

### - సీఐ కృష్ణను సన్మానించిన బీసీ సంఘం ప్రతినిధులు

పెద్దపల్లి,మే 15:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) రామగుండం ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కృష్ణను శుక్రవారం బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంథని రఘు ఆధ్వర్యంలో పలువురు ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిసి,శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంథని రఘు మాట్లాడుతూ గతంలో కరీంనగర్‌లో అద్భుత సేవలు అందించిన సీఐ




కృష్ణ,రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోనూ అదే అంకితభావంతో శాంతిభద్రతలను కాపాడుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అమలు చేస్తూ,బాధ్యతలు చేపట్టిన వెంటనే సమస్యాత్మక ప్రాంతాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆయన తీసుకుంటున్న ముందస్తు జాగ్రత్తలు అభినందనీయమన్నారు. ప్రజా సమస్యల పట్ల సానుకూలంగా స్పందించిన సీఐకి వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మంథని లక్ష్మణ్,బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బులగం రవీందర్ గౌడ్,ఏ.వెంకట్ రెడ్డి,కాసులపూరి సాగర్,మంథని సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా సోమయ్య

మల్లాపూర్ మే 15 ( ప్రజా కలం ప్రతినిధి)



మల్లాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మాట్ల సోమయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు శుక్రవారం ప్రకటించారు. రాష్ట్ర పీసీసీ ఆదేశాల మేరకు జిల్లాలు, మండలాల్లో నూతన అధ్యక్షుల ఎంపిక ప్రక్రియలో భాగంగా పార్టీకి విస్తృతంగా సేవలు అందించిన సోమయ్యకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు నియోజకవర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగ రావు, మండల నాయకులు జలపతి రెడ్డి కి సోమయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని సోమయ్య పేర్కొన్నారు.

## రైతులు పంటమార్పిడి చేయాలి

### - శాస్త్రవేత్త డా.స్పందన బట్

గొల్లపల్లి మే 15 ప్రజా కలం ప్రతినిధి

గొల్లపల్లి మండల కేంద్రంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పొలాస పరిశోధన సీనియర్ శాస్త్రవేత్త ణతీ.స్పందన భట్ మాట్లాడుతూ పంటల మార్పిడి, సేంద్రీయ వ్యవసాయం, పచ్చిరొట్ట పంటల సాగు, నేల ఆరోగ్యం, మార్కెట్లో డిమాండ్ ఉన్న సన్న వరి రకాల బిపిటి 5204, కె ఎన్ ఎం1638, జేజిఎల్1798, జై శ్రీరామ్ , హెచ్ ఎంటి వంగడాలను సాగు వంటి వివిధ అంశాల పై రైతులకు అవగాహన కల్పించారు. ఎన్ సుమలత మాట్లాడుతూ రసాయన మందులు ఎలా వాడాలో, సమగ్ర సస్యరక్షణ పై తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. ఈ కార్యక్రమంలో బి.కరుణ ఏవో, ఏ ఈ ఓఅశ్విని, ఏ ఎం సి చైర్మెన్ బీమా సంతోష్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.



## రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని

# వెంట వెంటనే గోదాములకు చేర్చాలి

### - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ మే15 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని వెంట వెంటనే గోదాములకు తరలించి భద్రపరచాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.

శుక్రవారం, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సారంగాపూర్ మండలంలోని చించోలి (బి) గ్రామంలో గల గోదామును పరిశీలించారు. ధాన్యం అన్లోడ్ అవుతున్న తీరును చూశారు. అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఇప్పటివరకు గోదాములో నిల్వచేసిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. తగినంత మంది హమాలీలతో అన్లోడింగ్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసి, లారీలను వేగవంతంగా ఖాళీ చేయాలన్నారు. అన్లోడింగ్ పూర్తయిన వెంటనే లారీలు తిరిగి కొనుగోలు కేంద్రాలకు తిరిగి పంపాలని తెలిపారు. ఎక్కడ కూడా కొనుగోలు కేంద్రాలలో తూకం వేసిన ధాన్యం నిల్వ ఉండరాదని అన్నారు. ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని తెలిపారు.

ఈ గోదాము పరిశీలన ప్రక్రియలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌరసరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్ తహసిల్దార్ విజయ కాంతారావు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి కోసం ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదు

### - ప్రతి ఇంటికి ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా

### - తల్లాడ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి



తల్లాడ మే 15 ప్రజా కలం న్యూస్ తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ ప్రజలు తాగునీటి కోసం ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి ఇంటికి ప్రతి వీధికి ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు తల్లాడ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి తెలిపారు. శుక్రవారం తల్లాడ పంచాయతీలో తాగునీటిని ట్యాంకర్ల ద్వారా ప్రతి వీధికి తరలిస్తూ ప్రజలకు నీటిని అందిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిషన్ భగీరథ నీరు రాకపోయినప్పటికీ పంచాయతీలో మూడు ట్యాంకర్ల ద్వారా ప్రజలకు తాగునీరు అందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి ఇంటికి నీరు వస్తాయని ఎటువంటి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదన్నారు. వేసవికాలం నేపథ్యంలో నీటి కొరత ఉందని, ప్రజలు కూడా నీటిని పొదుపుగా వాడుకోవాలి సూచించారు. ఈ కార్యక్రమాన్ని ఈవో శ్రీహరికృష్ణ, గ్రామ పంచాయతీ వర్కర్లు సురేందర్ రెడ్డి, చాంద్, మహంకాళీ కృష్ణ, చలిగంజి వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# హౌస్ లిస్టింగ్ ప్రక్రియలో అధికారులకు ప్రజలు సహకరించాలి

### - హౌస్ లిస్టింగ్ ప్రక్రియ పూర్తి చేసుకున్న జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ మే15 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) జనగణన ప్రక్రియలో భాగమైన హౌస్ లిస్టింగ్ జాబితా తయారీకి జనగణన సిబ్బందికి, ప్రజలంతా సహకరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా కోరారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు నందు, జనగణనలో భాగంగా, తన నివాసానికి సంబంధించి, హౌస్ లిస్టింగ్ ప్రక్రియను కలెక్టర్ భవేశ్ మిశ్రా పూర్తి చేసుకున్నారు. ముందుగా తాను ఆన్ లైన్ లో పూర్తి చేసుకున్న సెల్ఫ్ ఎన్యుమరేషన్ వివరాలు, జనగణన సిబ్బందికి తెలియజేశారు. ఆ వివరాల ఆధారంగా, అధికారులు కలెక్టర్ హౌస్ లిస్టింగ్ ప్రక్రియను పూర్తి చేశారు. కలెక్టర్ నివాస గృహ హౌస్ లిస్టింగ్ ప్రక్రియ పూర్తి చేసిన వారిలో సూపర్వైజర్ బి. రాజేందర్, ఎన్యుమరేటర్ లు హిమబిందు, నాగలత, తదితరులు ఉన్నారు.

## సీనియర్ జర్నలిస్టు పందిరి వెంకట రెడ్డి

# పరామర్శించిన గుండా ఉపేందర్ రెడ్డి

పాలేరు మే 15(ప్రజా కలం న్యూస్ )కూసుమంచి మండల కేంద్రంలోని శుక్రవారంఇటీవల కాలి శస్త్ర చికిత్స విజయవంతం గా పూర్తి చేసుకుని వారి స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న సీనియర్ జర్నలిస్ట్ పందిరి వెంకట రెడ్డి,ని కలసి వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవడం జరిగింది. వారు త్వరగా కోలుకొని, వారి వృత్తిలో త్వరలోనే ఉత్సాహంగా పాల్గొనాలి అని ఆశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మంద నవ్య చంద్రశేఖర్ గౌడ్ బద్దం వెంకట్ రెడ్డి, మంద చంద్రశేఖర్ గౌడ్ పిట్టల వేణు, గుండా విజయ్ పాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ జూనియర్ కళాశాల కూసుమంచిలో

# విద్యా వారోత్సవాలు ఘనంగా నిర్వహణ

పాలేరు మే 15( ప్రజా కలం న్యూస్ )

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల, కూసుమంచిలో విద్యా వారోత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి మండల పరిధిలోని వివిధ గ్రామపంచాయతీల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి కూసుమంచి గ్రామపంచాయతీ సర్పంచ్ కొండ కృష్ణవేణి మాట్లాడుతూ, మండల పరిధిలోని 41 గ్రామపంచాయతీల సర్పంచులందరూ పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలు పొందేలా చైతన్యం కల్పించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, విద్యాశాఖపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ప్రభుత్వ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. అలాగే ప్రభుత్వం త్వరలో విద్యార్థుల కోసం ఉదయం అల్పాహారం,మధ్యాహ్న భోజన పథకాలను ప్రవేశపెట్టబోతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాలను వినియోగించుకుని విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని కళాశాల ప్రతిష్టను మరింత పెంచాలని సూచించారు.గురువాయిగూడెం సర్పంచ్ శ్రీ బానోతు బిక్షం గారు మాట్లాడుతూ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు అందుబాటులో లేని సమయంలో విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లి ప్రైవేట్ కళాశాలల్లో అధిక ఖర్చుతో చదవాల్సి వచ్చేదని గుర్తుచేశారు. ప్రస్తుతం కూసుమంచి మండలంలోనే ప్రభుత్వ కళాశాల అందుబాటులో ఉండటం విద్యార్థులకు గొప్ప అవకాశమని పేర్కొన్నారు. ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, పోటీ పరీక్షలకు అవసరమైన సమగ్ర శిక్షణను కూడా పొందుతారని వివరించారు.



కళాశాల ప్రిన్సిపాల్ బి. వీరభద్రరావు గారు మాట్లాడుతూ, స్వాతంత్ర్యం అనంతరం ఎన్నో సంవత్సరాల పాటు ఈ ప్రాంతంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలు ఉన్నత విద్యకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆడపిల్లల విద్యకు తీవ్ర ఆటంకాలు ఎదురయ్యేవని తెలిపారు. 2024 సంవత్సరంలో మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారి కృషితో కూసుమంచి మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు కావడం ఈ ప్రాంత ప్రజలకు ఒక గొప్ప వరమని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పిస్తోందని, తాను ప్రిన్సిపాల్గా విద్యార్థుల ఉన్నతికి అహర్నిశలు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా 2026 విద్యా సంవత్సరంలో మొదటి సంవత్సరం మరియు ద్వితీయ సంవత్సరంలో టాపర్లుగా నిలిచిన విద్యార్థినీ విద్యార్థులకు షీల్డ్లు మరియు బహుమతులు అందజేసి సత్కరించారు. వివిధ గ్రామాల నుంచి హాజరైన సర్పంచులు విద్య ప్రాధాన్యతపై ప్రసంగించి విద్యార్థులను ప్రోత్సహించారు. గుండా దామోదర్ రెడ్డి గారు కూడా సభను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఉత్తేజాన్ని నింపుతూ, ప్రభుత్వ విద్యపై ప్రజల్లో మరింత విశ్వాసాన్ని పెంపొందించేలా విజయవంతంగా ముగిసింది.

# తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రిజిస్టర్డ్ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారులు ప్రజా భవనం ముందు నిరసన

### ప్రభుత్వం సానుకూల స్పందన - వారం రోజులు లలో కమిటీ ఏర్పాటు అని హామీ

ఖమ్మం మే 15(ప్రజా కలం న్యూస్ )

ఖమ్మం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రిజిస్టర్డ్ రాష్ట్ర అధ్యక్షుడు ఓరుగంటి ఆనంద్ పిలుపుమేరకు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రిజిస్టర్డ్ సంఘం ఆధ్వర్యంలో ఉద్యమకారులకు ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని వివిధ జిల్లాల్లో ఉన్న ఉద్యమకారులందరూ హైదరాబాద్ ప్రజా భవన్ ముందు నిరసన చేశారు .ప్రభుత్వం అన్ని జిల్లాల్లో తెలంగాణ ఉద్యమకారుల ను అక్రమ అరెస్ట్ లు చేసినా కూడా పెద్ద ఎత్తున ఉద్యమకారులు ప్రజా భవన్ దగ్గరికి వెళ్ళారు .ఈ క్రమంలో నిరసన చేస్తున్న ఉద్యమకారులను పోలీస్ అధికారులు ప్రజాపాలనలో వినతి పత్రాలను స్వీకరిస్తున్న (తీసుకుంటున్న) అధికారి చిన్నారెడ్డి దగ్గరకు తీసుకొని వెళ్లారు . ఆయన సీఎం ముఖ్య కార్యదర్శి అయిన శేషాద్రి కి లెటర్ రాశారు . ఆ లెటర్ ను తీసుకొని ఉద్యమకారుల ప్రతినిధులను వెంటబెట్టుకుని పోలీసులు తమ వాహనంలో సెక్రటేరియట్ కి తీసుకెళ్లి ఆరవంతస్తులో ఉన్న సీఎం ముఖ్య కార్యదర్శి అయిన శేషాద్రి దగ్గరికి తీసుకెళ్లారు . ఆయన ఉద్యమకారులతో మాట్లాడి వారి ఆవేదనను విని ,ముఖ్యమంత్రి ఆదేశానుసారం చర్చలు జరిపారు . ఈ సమస్య ఆల్రెడీ సీఎం రేవంత్ రెడ్డి దృష్టిలో కూడా ఉందని ఒక వారం రోజులలో కమిటీని ఏర్పాటు చేసి నిజమైన ఉద్యమకారులను గుర్తించి వారికి న్యాయం జరిగేలా చేస్తామని హామీ ఇచ్చారని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రిజిస్టర్డ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కె వి కృష్ణారావు పేర్కొన్నారు . ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ జూన్ 2 లోపల స్పష్టమైన ఉద్యమకారుల గుర్తింపు కమిటీని ఏర్పాటు చేసి ఉద్యమకారులను గుర్తించి వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ పసుపులేటి నాసరయ్య , బచ్చల పద్మాచారి , కేలోత్ రవిచంద్ర చౌహాన్ , మొతుకురి వెంకటాచారి , గాజుల రవి కుమార్ , ఉపేందర్ , రెడ్డబోయిన వరలక్ష్మి , కామని అనంతలక్ష్మి , నల్లా స్వరూప , ధనలక్ష్మీ , కమలమ్మ , ఆకారపు కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు .



# రికార్డు స్థాయిలో 2.18 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు

### తప్పుడు వార్తలతో రైతుల్లో ఆందోళన సృష్టించవద్దు

### - రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దు :. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

### - ప్రభుత్వం పూర్తి స్థాయిలో పంటను కొనుగోలు చేస్తుంది.



ఖమ్మం, మే15( ప్రజా కలం న్యూస్ )

ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 2.18 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. వివిధ దినపత్రికల్లో మే 15న శుక్రవారం రోజున మొక్కజొన్న కొనుగోలు, లిఫ్టింగ్లో జాప్యం జరుగుతోందంటూ ప్రచురితమైన వార్తలు అసంపూర్ణ సమాచారం ఆధారంగా ప్రచురించబడినవని జిల్లా కలెక్టర్ రిజాయిండర్ జారీ చేశారు.జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జిల్లా యంత్రాంగం, టీజీ మార్క్ఫెడ్ ఆధ్వర్యంలో సజావుగా కొనసాగుతోందని తెలిపారు.

యాసంగి సీజన్ 2025-26లో భారీ స్థాయిలో దిగుబడులు రావడంతో కొన్ని కొనుగోలు కేంద్రాల వద్ద లోడెడ్ వాహనాల కదలికలో తాత్కాలిక ఒత్తిడి ఏర్పడిందన్నారు. అధిక స్టాక్ నిల్వలు, పరిమిత అన్లోడింగ్ స్థలాల కారణంగా కొంత ఆలస్యం చోటుచేసుకున్నప్పటికీ, సమస్య పరిష్కారానికి యంత్రాంగం అత్యంత ప్రాధాన్యతతో చర్యలు తీసుకుంటోందన్నారు.

జిల్లాలో ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 2.18 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు జరిగిందని, గతంలో ఎన్నడూ ఈ స్థాయిలో కొనుగోళ్లు జరగలేదని కలెక్టర్ తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అదనపు రవాణా వాహనాలు ఏర్పాటు చేయడం, ప్రత్యామ్నాయ గోదాములు, నిల్వ కేంద్రాలు సిద్ధం చేయడం జరుగుతోందన్నారు.

కొనుగోలు కేంద్రాల పనితీరును జిల్లా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, ప్రభుత్వం నిర్ణయించిన ప్రమాణాల ప్రకారం కొనుగోళ్లు కొనసాగుతున్నాయని తెలిపారు. జిల్లాలో మొక్కజొన్న, వరి పంట పండించిన రైతులకు ఏదైనా సమస్యలు ఉంటే తెలియజేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ 1077 ను ఏర్పాటు చేశామని, కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు కలిగిన ధాన్యం, మొక్కజొన్న పంటకు ఎవరైనా కోతలు విధించిన లేక ఏ ఇతర సమస్య ఉన్న వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులు అసత్య, అసంపూర్ణ వార్తలను నమ్మవద్దని, ప్రభుత్వం రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తుందని ఆ రిజాయిండర్ లో స్పష్టం చేశారు.

# మృతురాలి కుటుంబానికి పరామర్శ

### - ఆర్థిక సాయం అందజేసిన సర్పంచ్, మాజీ ఎంపీపీ

మల్హార్, మే15 ప్రజాకలం ప్రతినిధి మలహర్ రావు మండలంలోని పెద్దతూండ్ల గ్రామంలో ఇటీవల మరణించిన వోణపాకల రామమ్మ కుటుంబాన్ని గ్రామ సర్పంచ్ బండారి నరసింహం పరామర్శించారు. వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా తన వంతు సహాయంగా బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చింతలపల్లి మాలహల్ రావు, ఉప సర్పంచ్ తాళ్ళ రవీందర్, వార్డు సభ్యులు తాటికొండ కేశవ చారీ, బియ్యాన్ని రాజమౌళి, కందుగుల పోషక్క, వంశి, బియ్యాన్ని కుమార్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు రాజసమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ షాక్ తో బాలుడు మృతి

( వరంగల్/ పర్వతగిరి) మే 15, ప్రజాకలం ప్రతినిధి.పర్వతగిరి మండలం కల్లెడ గ్రామానికి చెందిన నంపెల్లి వెంకటేశ్వరావు కు చెందిన మామిడి తోటలో మామిడికాయలు తెంపడానికి వచ్చి ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతానికి గురై నేతావత్ సంపత్ (16) అనే బాలుడు మృతి. మృతుడి స్వగ్రామం సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం సెట్ రామ్ తండకు చెందిన బాలుడు. మృతుడు తల్లిదండ్రులకు ఒకే కుమారుడని, ఇటీవలే పదవ తరగతి పరీక్ష రాశాడని తెలిసింది. ప్రస్తుతం మృతదేహం వర్ధన్నపేట పోస్టుమార్టం లో ఉందని సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి వుంది.



# మృతుడి పార్థివ దేహానికి నివాళులర్పించిన మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు

( వరంగల్/ పర్వతగిరి) మే 15, ప్రజాకలం ప్రతినిధి. పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన మహంకాళి సదానందం గురు వారం రాత్రి మృతిచెందగా శుక్రవారం వారి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించిన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్. ఈ కార్యక్రమంలో ఇనవోలు దేవస్థానం ధర్మకర్త దారం పూర్ణచందర్, మాజీ ఏఎంసి డైరెక్టర్ పిన్నింటి సునీల్ రావు, సీనియర్ నాయకులు నారెడ్ల సూరయ్య, పాపారావు, రావుల రాజు తదితరులు పాల్గొన్నారు.



## నీట్ పరీక్షా పేపర్ లీకేజ్ పునరావృతం కాకుండా కేంద్ర విద్యాశాఖ మంత్రి బాధ్యత వహించి రాజీనామా చెయ్యాలి

### -మాజీ ఎంపిటిసి మాడుగుల రాజు

( వరంగల్/ పర్వతగిరి) మే 15, ప్రజాకలం ప్రతినిధి.



పేపర్ లీకేజీ ఆరోపణల నేపథ్యంలో మే 3, 2026న జరిగిన నీట్ యూజీ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ఎన్టిఏ ప్రకటించింది. అయితే గత సంవత్సరం కూడా ఇదే కారణంతో నీట్ పరీక్ష రద్దు అయిన విషయం తెలిసిందే. మళ్లీ ఈ సంవత్సరం కూడా నీట్ స్కామ్ బయటపడటం ప్రభుత్వం బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. పదేపదే పునరావృతమవుతున్న ప్రశ్నాపత్రాల లీకేజీలు, జాతీయ పరీక్షా సంస్థ నిర్లక్ష్య వైఖరిని మాజీ ఎంపిటిసి మాడుగుల రాజు తీవ్రంగా ఖండిచారు. 2026 మే 3న జరిగిన నీట్ పరీక్ష తర్వాత రాజస్థాన్, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో గెస్ పేపర్ పేరుతో సోషల్ మీడియాలో తిరిగిన ప్రశ్నాపత్రం అసలు ప్రశ్నాపత్రంతో సరిపోలినట్లు తేలింది. ఆ గెస్ పేపర్లోని 100కు పైగా ప్రశ్నలు అసలు పరీక్షలో వచ్చినట్లు దర్యాప్తులో బయటపడింది. అదేవిధంగా గత సంవత్సరం మాదిరిగానే లీకైన ప్రశ్నాపత్రాలను రూ.30 వేల నుంచి రూ.20 లక్షల వరకు విక్రయించినట్లు ప్రాథమిక సమాచారం వెలుగులోకి వచ్చింది. నీట్ స్కామ్ల వల్ల ముఖ్యంగా లక్షల రూపాయలు ఖర్చు చేసి కోచింగ్ తీసుకుంటున్న పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. వైద్య విద్యకు దూరమవుతున్నారు. మానసిక ఒత్తిడితో ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా జరుగుతున్న నీట్ స్కామ్లపై సమగ్ర దర్యాప్తు జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని, పదేపదే జరుగుతున్న ఈ స్కామ్లను పూర్తిగా అరికట్టాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎన్టిఏను రద్దు చేసి రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోనే వైద్య ప్రవేశ పరీక్షలు నిర్వహించాలని మాజీ ఎంపిటిసి మాడ్గుల రాజు డిమాండ్ చేసారు.

# మెడికల్ షాప్ ల బంద్ కు సహకరించండి

### - తాసిల్దార్ కు వినతిపత్రం అందజేసిన యూనియన్ సభ్యులు

వాజేడు మే 15 (ప్రజాకలం) దేశ వ్యాప్తంగా మెడికల్ యూనియన్ పిలుపుమేరకు ఆన్లైన్లో మందుల విక్రయాలను నిలిపివేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ ది 20-5-26 బుధవారం నాడు జరిగే దేశవ్యాప్త ఒక్కరోజు మెడికల్ షాప్ ల బంద్ సంబంధించి మండల తాసిల్దార్ కి మెమోరాండం అందజేస్తూ, ఒక్కరోజు దేశవ్యాప్త మెడికల్ షాప్ ల బంద్ కు మీ ద్వారా మండల ప్రజల మద్దతు కావాలని కోరుతున్నామని మండల మెడికల్ యూనియన్ సభ్యులు తెలియజేశారు. దీనికి తాసిల్దారు మద్దతు తెలుపుతు ఎమర్జెన్సీ సేవలకు మాత్రం ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని సూచనలు ఇచ్చారు.ఈ మెమోరాండం ను, మీ యొక్క సమస్యను ఉన్నతాధికారులకు ఫార్వర్డ్ చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వాజేడు మెడికల్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.



# సినీ హీరోలను వాడేసుకుంటున్న ఫ్యాన్స్

విజయవాడ : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు చాలా విచిత్రంగా ఉంటాయి. వ్యూహాత్మకంగా కూడా ఉంటాయి. ముఖ్యంగా సోషల్ మీడియా ద్వారా చేసే ప్రయత్నాలు బాగా ఆకట్టుకుంటాయి. ప్రధానంగా సినీ హీరోల అభిమానులను తన వైపునకు తిప్పుకునే ప్రయత్నంలో వైసిపి చేసే రాజకీయం మామూలుగా ఉండదు. ప్రస్తుతం టాలీవుడ్ ప్రముఖ హీరోల అభిమానులను వారికి తెలియకుండానే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ టర్న్ చేసుకోగలదు. అంత గొప్ప వ్యూహం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సొంతం. టిడిపి కూటమికి సినీ గ్లామర్ ఉంది. నందమూరి తో పాటు ఇతర సినీ పెద్దల అభిమానం ఉంది. జనసేనకు మెగా కాంపౌండ్ వాల్ నుంచి బలమైన సపోర్ట్ లభిస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మాత్రం ఆ స్థాయిలో లేదు. అందుకే ప్రముఖ హీరోల అభిమానులను వైసీపీ వైపు తిప్పుకునేందుకు సోషల్ మీడియాలో పెద్ద ప్రయత్నమే చేసింది. ఆ హీరోలంతా జగన్మోహన్ రెడ్డికి అభిమానులు అన్నట్టు సోషల్ మీడియాలో బిల్డప్ ఇస్తోంది. యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ విషయంలో అటువంటి ప్రచారమే చేసింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. ఇప్పటికీ చేస్తూనే ఉంది. ప్రభాస్ పెదనాన్న రెబల్ స్టార్ కృష్ణంరాజు. ఆయన బిజెపిలో ఉండేవారు. బిజెపి నేతగానే చనిపోయారు. ఒకానొక దశలో కృష్ణం రాజు జనసేనలో చేరుతారని అప్పట్లో ప్రచారం నడిచింది. అయితే ఆయన అకాల మృతి చెందారు. ఆ సమయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. కృష్ణంరాజు స్వగ్రామంలో పెద్ద కర్మ నిర్వహించారు. ఆ సమయంలో అయితే రాజశేఖర్ రెడ్డి పై కృష్ణంరాజుకు ఎంతో అభిమానం ఉండేదన్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ చేశారు. సహజంగానే రాజకీయ సినీ రంగాలకు దగ్గర సంబంధాలు ఉంటాయి. అప్పట్లో కృష్ణంరాజును రాజా అని రాజశేఖర్ రెడ్డి సంబోధించేవారని స్వయంగా రెబల్ స్టార్ ప్రకటించారు. దానిని పట్టుకొని యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ తమ వాడే అన్నట్టు సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అయితే దీనిని గుర్తించిన కృష్ణంరాజు భార్య ఏకంగా కూటమికి మద్దతు ప్రకటించడంతోపాటు ప్రచారం చేశారు. అయినా సరే ఇప్పటికీ ప్రభాస్ అభిమానులను వైసీపీ వైపు తిప్పుకోవడానికి ఆ పార్టీ చేయని ప్రయత్నం అంటూ లేదు. మరోవైపు జూనియర్ ఎన్టీఆర్ అభిమానులను సైతం వైసీపీ నిత్యం ఆకర్షిస్తూనే ఉంటుంది. నందమూరి, నారా ఫ్యామిలీలతో జూనియర్ ఎన్టీఆర్ కు గ్యాప్ ఉందంటూ ప్రచారం చేయడంలో వైయస్సార్ కాంగ్రెస్ సోషల్ మీడియా ముందుంటుంది. మంత్రి నారా లోకేష్ కోసం జూనియర్ ఎన్టీఆర్ ను పార్టీలో తొక్కేశారు అంటూ ప్రచారం చేయడంలో కూడా వైయస్సార్ కాంగ్రెస్ పాత్ర ఉంది. సినిమాలే ప్రపంచం గా బతుకుతున్నారు జూనియర్ ఎన్టీఆర్. రాజకీయాల గురించి పట్టించుకునే స్థాయిలో లేరు ఆయన. అయితే అయిన దానికి కానీ దానికి ఫ్యాన్స్ మధ్య విభజన రేఖ గీసి.. వారిని తమ వైపు తిప్పుకునే పనిలో ఉంటుంది వైయస్సార్ కాంగ్రెస్. ఎప్పటికప్పుడు చంద్రబాబుతో పాటు లోకేష్ కు చెక్ పెట్టాలని జూనియర్ ఎన్టీఆర్ పేరును తెరపైకి తీసుకొస్తూ వివాదాలు సృష్టించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. అల్లు అర్జున్ విషయంలో అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అతిగా వ్యవహరించింది అని చెప్పవచ్చు. మెగా కాంపౌండ్ వాల్ నుంచి అల్లు అర్జున్ ను వేరుచేసి చూపడంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పాత్ర ఉంది. మొన్నటి ఎన్నికలకు ముందు తనకు అత్యంత ఆత్మీయుడైన ఓ వైసిపి అభ్యర్థికి సంఘీభావం తెలుపుతూ మద్దతు ప్రకటించారు అల్లు అర్జున్. అది మొదలు అల్లు అర్జున్ తమ వాడే అని చెప్పుకునేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేయని ప్రయత్నం అంటూ లేదు. ఆయన సినిమాలు విడుదలైనప్పుడు హంగామా చేస్తూనే ఉంది. కేవలం పవన్ కళ్యాణ్ ను దృష్టిలో పెట్టుకొని.. మెగా ఫ్యామిలీతో అల్లు అర్జున్ కు విభేదాలు ఉన్నాయని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం వెనుక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉంది. అలా అల్లు అర్జున్ అభిమానులను తమ వైపునకు తిప్పుకునే ప్రయత్నం అన్నమాట. మహేష్ బాబును సైతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వదలట్లేదు. వైయస్ రాజశేఖర్ రెడ్డి తో సూపర్ స్టార్ కృష్ణకు మంచి సంబంధం ఉండేది. కృష్ణ వియ్యపురాలు గల్లా అరుణ కుమారి కాంగ్రెస్ పార్టీలో ఉండేవారు. కృష్ణ సిఫారసులతో రాజశేఖర్ రెడ్డి అప్పట్లో ఆమెను క్యాబినెట్లో తీసుకున్నారని కూడా ఒక టాక్ ఉంది. పైగా స్వతహాగా ఎన్టీఆర్ను వ్యతిరేకించిన కృష్ణ కాంగ్రెస్ పార్టీలోనే సుదీర్ఘకాలం కొనసాగారు. అయితే రాజశేఖర్ రెడ్డి పై ఉన్న గౌరవంతోనే కృష్ణ సోదరుడు ఆదిశేషగిరిరావు జగన్ వెంటే అడుగులు వేశారు. అక్కడ తగినంత ప్రాధాన్యం లేకపోవడంతోనే ఆదిశేషగిరిరావు టిడిపిలోకి వచ్చేసారు. గల్లా అరుణ కుమారి తో పాటు ఆమె కుమారుడు జయదేవ్ సైతం టిడిపిలోకి వచ్చారు. జయదేవ్ స్వయానా మహేష్ బాబు బావ. రెండుసార్లు గుంటూరు ఎంపీగా గెలిచిన జయదేవ్ ను వెంటాడారు జగన్మోహన్ రెడ్డి. అందుకే మొన్నటి ఎన్నికలకు ముందు ప్రత్యక్ష రాజకీయాలకు దూరమయ్యారు జయదేవ్. అయినా సరే మహేష్ బాబును తమ వాడిగా చూపి ఓట్లు కొల్లగొట్టాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు చేస్తోంది. అయితే సోషల్ మీడియా యుగం కాబట్టి ప్రజలకు అన్ని తెలుసు. ముఖ్యంగా హీరోల అభిమానులకు సైతం నేటి రాజకీయాల పట్ల స్పష్టమైన అవగాహన ఉంది. అయినా సరే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమానుల ఓట్ల కోసం తపన పడుతోంది.

# చంద్రబాబు.. ది గ్రేట్..

విజయవాడ : ఏపీ సీఎం చంద్రబాబు వయసుకు మించి కష్టపడుతున్నారు. ఒకవైపు రాష్ట్ర పాలన చూస్తూనే మరోవైపు జాతీయ స్థాయిలో సైతం నిత్య పర్యటనలు చేస్తున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించే క్రమంలో వరుసగా భేటీలు జరుపుతున్నారు. నిత్య సమీక్షలు కొనసాగుతున్నాయి. ఢిల్లీలో సంప్రదింపులు జరుపుతున్నారు. ఎన్ డి ఏ సమావేశాలకు హాజరవుతున్నారు. బిజెపితో పాటు ఎన్డీఏ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ప్రభుత్వాలు కొలువు తీరుతున్న సమయంలో ప్రమాణ స్వీకార కార్యక్రమాలకు హాజరవుతున్నారు. గత వారం రోజులుగా సీఎం చంద్రబాబు షెడ్యూల్ ను పరిశీలిస్తే.. క్షణం తీరిక లేకుండా గడుపుతున్న పరిస్థితి. ఈ వయసులో కూడా ఆయన కష్టపడుతున్న తీరు మాత్రం ఆకట్టుకుంటుంది. పశ్చిమ బెంగాల్లో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చింది. 15 సంవత్సరాల మమతా పాలనను తెరదించుతూ కాషాయ జండా ఎగురవేసింది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా సువేందూ అధికారి ప్రమాణం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీతో పాటు ఎన్డీఏ రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. ఏపీ సీఎం చంద్రబాబు కు ప్రత్యేక ఆహ్వానం అందింది. దీంతో కార్యక్రమానికి హాజరైన చంద్రబాబుకు కేంద్ర పెద్దలు గౌరవభావంతో చూశారు. చాలా ప్రాధాన్యం ఇచ్చారు. బిజెపిలో కొనసాగుతున్న బాలీవుడ్ నటుడు మిథున్ చక్రవర్తి చంద్రబాబుకు పాదాభివందనం చేశారు. పశ్చిమ బెంగాల్ సీఎం ప్రమాణ స్వీకారం నుంచి హైదరాబాద్ చేరుకున్నారు చంద్రబాబు. అదే సమయంలో హైదరాబాద్ వచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ నేరుగా చంద్రబాబు నివాసానికి చేరుకున్నారు. అక్కడ గంటపాటు గడిపారు మోడీ. అయితే ఆ పర్యటన ముగిసిన వెంటనే ఢిల్లీ బాట పట్టారు చంద్రబాబు.

నిన్న రోజంతా కేంద్ర మంత్రులను కలిసి ఏపీలో కీలక ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలను చర్చించారు. సాయంత్రం ఉన్నత స్థాయి సదస్సులో సైతం పాల్గొన్నారు. ఢిల్లీలోనే రాత్రి బస చేశారు. మంగళవారం అస్సాం లో సీఎం ప్రమాణ స్వీకారానికి హాజరయ్యారు. ఇలా క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు సీఎం చంద్రబాబు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వ పాలనలో క్షణం తీరిక లేకుండా ఉంటూనే.. జాతీయస్థాయిలో సైతం అన్ని కార్యక్రమాలకు హాజరవుతున్నారు. నిజంగా చంద్రబాబు ఓపికకు హాట్సాఫ్ చెప్పాల్సిందే.

# 2027 నాటికి పోలవరం పూర్తి

ఏలూరు : పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పై కీలక అప్డేట్ వచ్చింది. మంత్రి నిమ్మల రామానాయుడు కీలక ప్రకటన చేశారు. 2027 జూన్ నాటికి ప్రాజెక్టు పూర్తవుతుందని.. అదే నెలలో ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు. ఢిల్లీలో ఏపీ సీఎం చంద్రబాబు కేంద్ర జల శక్తి మంత్రి సిఆర్ పాటిల్ ను కలిసిన తరువాత మంత్రి రామానాయుడు ప్రకటన చేయడం విశేషం. ఆంధ్రప్రదేశ్కు జీవనాడిగా పోలవరం ప్రాజెక్టును భావిస్తున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో నత్తనడకన పనులు సాగాయి. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు వేగవంతం అయ్యాయి. ఏడాది కాలంలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది పోలవరం. ఎప్పటికప్పుడు మంత్రి నిమ్మల రామానాయుడు పర్యవేక్షిస్తున్నారు. సీఎం చంద్రబాబు సైతం నిత్య పరిశీలనలతో పాటు సమీక్షలు నిర్వహిస్తూ పనులను వేగవంతం చేయిస్తున్నారు. ఏడాది కాలంలో ఈ ప్రాజెక్టు అందుబాటులోకి రానుంది అని తెలుస్తుండడం మాత్రం శుభ పరిణామం. గోదావరి, కృష్ణా నదులను అనుసంధానిస్తూ ఏలూరు జిల్లా పోలవరం సమీపంలో ఈ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోంది. వైయస్ రాజశేఖర్ రెడ్డి ఈ ప్రాజెక్టు పనులను ప్రారంభించారు. అయితే 2014లో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించింది. ప్రారంభంలో రామ పాద సాగర్ గా పిలవబడిన ఈ పథకాన్ని పోలవరం ప్రాజెక్టు గా మార్చారు. 2004లో అధికారంలోకి వచ్చిన రాజశేఖర్ రెడ్డి జలయజ్ఞంలో భాగంగా ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించారు. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా నదీ ప్రవాహానికి కుడివైపున ఒక స్పిల్ వే నిర్మించారు. ఈ స్పిల్ వేకు అడ్డంగా 48 గేట్లతో ఒక బ్యారేజీ నిర్మాణం చేపడుతున్నారు. నదీ ప్రధాన ప్రవాహానికి అడ్డంగా ఆనకట్ట నిర్మించి.. ఆ ప్రవాహాన్ని కుడివైపున ఉన్న స్పిల్ వేలోకి మళ్ళిస్తారు. ఈ ప్రాజెక్టుకు గేట్లు ఉండవు. కేవలం రాక్ ఫీల్డ్ డ్యామ్ మాత్రమే ఉంటుంది. అయితే ఈ ప్రాజెక్టులో 1118 మీటర్ల పొడవు ఉండే స్పిల్ వే ప్రత్యేకమైనది. దాదాపు 22 సంవత్సరాల కిందట పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయి. కానీ చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత మాత్రమే ఈ ప్రాజెక్టుకు గుర్తింపు లభించింది. 2015లో జాతీయ ప్రాజెక్టుగా గుర్తించారు. పోలవరం జాప్యం జరగడంతో పట్టిసీమను తెరపైకి తెచ్చారు. పట్టిసీమ, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాలను నిర్మించారు. 2015 లోనే దాదాపు 1300 కోట్లు ఖర్చు పెట్టి తొలి విడతగా పూర్తి చేశారు. అయితే మరో ఏడాది కాలంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రాజెక్టును జాతికి అంకితం చేయాలని భావిస్తున్నారు. అందుకు అనుగుణంగా పనులు చేయిస్తున్నారు. మరో ఏడాదిలో పోలవరం ప్రాజెక్టు అందుబాటులోకి వస్తుండడం మాత్రం నిజంగా శుభ పరిణామం.

# బీజేపీతో కయ్యమేనా?

విజయవాడ : పదేళ్లుగా కేంద్రంలోని బీజేపీతో ఒక రకమైన అప్రకటిత మిత్రత్వం కొనసాగించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు తన రాజకీయ వ్యూహాన్ని సమూలంగా మార్చుకుంటున్నట్లు కనిపిస్తోంది. పశ్చిమ ఆసియా ఉద్రిక్తతల కారణంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు చేసిన సెవెన్ అప్పీల్స్ పిలుపుపై వైసీపీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ఇది కేవలం ఒక విధానపరమైన విమర్శ మాత్రమే కాదని, బీజేపీతో తెగతెంపులు చేసుకునే దిశగా పడుతున్న తొలి అడుగు అని విశ్లేషకులు భావిస్తున్నారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన వైసీపీ అధికార ప్రతినిధి పేర్ని, ప్రధాని మోదీపై నేరుగా విమర్శలు గుప్పించారు. ప్రజలకు నీతులు చెప్పే ముందు మోదీ ఆ సూత్రాలను స్వయంగా ఆచరించి చూపాలి అంటూ ఎద్దేవా చేశారు. దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులకు ప్రజలే కారణమన్నట్లుగా ప్రధాని వ్యవహరించడం బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. ముఖ్యంగా బంగారం కొనుగోళ్లు ఆపాలని, విదేశీ పర్యటనలు వాయిదా వేసుకోవాలని చెప్పడం కాదని మోదీ ఆచరించాలన్నారు. తమిళనాడులో సినీ నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళ వెట్రి కజగం సాధించిన విజయం, అక్కడ ఆయన అనుసరిస్తున్న రాజకీయ పంథా జగన్‌ను ఆకర్షించినట్లు కనిపిస్తోంది. విజయ్ నేరుగా రాహుల్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్‌తో జతకట్టి అక్కడ అధికారంలోకి రావడంతో, జగన్ కూడా అదే తరహా ప్రయోగానికి సిద్ధమవుతున్నారని సమాచారం. బీజేపీ, టీడీపీ, జనసేన ఒకే కూటమిలో ఉండటంతో జగన్ ఇక బీజేపీపై ఆశలు వదులుకున్నట్లు తెలుస్తోంది. చాలా కాలంగా కాంగ్రెస్ పార్టీకి దూరంగా ఉన్న జగన్, ఇప్పుడు మారుతున్న రాజకీయ సమీకరణాల దృష్ట్యా ఆ పార్టీ వైపు మొగ్గు చూపే అవకాశాలు మెండుగా ఉన్నాయి. బీజేపీ కూటమిని ఢీకొట్టాలంటే కాంగ్రెస్‌తో కలవడమే ఏకైక మార్గమని ఆయన భావిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. విజయ్ పార్టీని నెత్తికెక్కించుకున్న వైసీపీ సోషల్ మీడియా విభాగాలు కూడా, బీజేపీకి వ్యతిరేకంగా గళం వినిపించడం ద్వారా కాంగ్రెస్ వైపు వెళ్లేందుకు క్షేత్రస్థాయిలో సంకేతాలు పంపుతున్నాయి. రాష్ట్రంలో టీడీపీ–బీజేపీ–జనసేన కూటమి బలంగా ఉండటంతో, జగన్ ఇక తన పోరాటాన్ని నేరుగా కేంద్రంపైకి మళ్లించాలని నిర్ణయించుకున్నారు. గతంలో విభజన హామీలు, ప్రత్యేక హోదా విషయాల్లో కేంద్రంపై మెతక వైఖరి అవలంబించారనే విమర్శలను చెరిపివేసేందుకు మోదీని నేరుగా టార్గెట్ చేస్తున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఇటీవల పార్లమెంట్ లో ప్రత్యేకహోదా అంశాన్ని వైసీపీ ఎంపీలు ప్రస్తావించారు. ప్రధాని మోదీ విఫలమవుతున్నారని వైసీపీ అధికారికంగా ప్రకటించడం అంటే, భవిష్యత్తులో బీజేపీతో దోస్తీకి శాశ్వతంగా ముగింపు పలికినట్లేనని భావించవచ్చు. విజయ్ స్ఫూర్తితో కాంగ్రెస్ వైపు అడుగులు వేయడం ద్వారా జగన్ తన రాజకీయ భవిష్యత్తును వెతుక్కుంటున్నారు. ఒకవేళ జగన్ నిజంగానే కాంగ్రెస్‌తో జట్టు కడితే, అది ఏపీలో మాత్రమే కాకుండా జాతీయ స్థాయిలో కూడా పెద్ద సంచలనంగా మారనుంది.

# అగ్నిమాపక శాఖలో ఖాళీల భర్తీకి హోంమంత్రి ఆదేశాలు

అమరావతి : అగ్నిమాపక శాఖ పనితీరుపై ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఫైర్‌స్టేషన్లు లేని 22 నియోజకవర్గాల పరిస్థితిపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడారు. కొత్తగా ప్రతిపాదించిన 5 ఫైర్‌స్టేషన్ల ఏర్పాటును వేగవంతం చేయాలని సూచించారు.



**ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలి..**

విశాఖపట్నం పశ్చిమ పారిశ్రామిక ప్రాంతాల్లో ఇండస్ట్రీల భాగస్వామ్యంతో ఫైర్‌స్టేషన్లను ప్రతిపాదించినట్లు హోంమంత్రి అనిత తెలిపారు. అగ్నిమాపక శాఖలో 1,275 ఖాళీలను దశల వారీగా భర్తీ చేయాలని ఆదేశించారు. జాబ్ క్యాలెండర్‌లో ఉన్న 305 పోస్టుల నియామక ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. ఫైర్ సిబ్బంది స్పందన సమయాన్ని 30 నిమిషాల నుంచి 15 నిమిషాలకు తగ్గించాలని మార్గనిర్దేశం చేశారు. పరిశ్రమల సహకారంతో ఫైర్ అవుట్‌పోస్టుల ఏర్పాటును పరిశీలించాలని సూచించారు. ఫైర్ టెండర్ల వినియోగంపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు. సెజ్ ప్రాంతాల్లో సమష్టి ఫైర్‌స్టేషన్ల ఏర్పాటుపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. పరిశ్రమల్లో ఫైర్‌సేఫ్టీ అధికారుల నియామకం తప్పనిసరిగా చేపట్టాలని స్పష్టం చేశారు.

**ఫైర్‌సేఫ్టీ సర్టిఫికెట్లు తప్పనిసరి చేయాలి..**

లైసెన్స్ పొడిగింపులకు ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్లు తప్పనిసరి చేయాలని హోంమంత్రి అనిత సూచించారు. అడవిలో అగ్నిప్రమాదాల నియంత్రణలో డ్రోన్ల వినియోగంపై దృష్టిసారించాలని ఆదేశించారు. వ్యర్థాలపై సరైన వర్గీకరణ లేకపోవడంతో అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలు, ఆస్పత్రులు, అపార్ట్‌మెంట్లలో ఫైర్‌సేఫ్టీ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. 'ఆపద మిత్ర' తరహాలో యువతకు స్వచ్ఛంద సేవా శిక్షణను విస్తరించాలని సూచించారు. సింగపూర్, స్విట్జర్లాండ్ విపత్తు నిర్వహణ విధానాలపై అధ్యయనం చేయాలని మార్గనిర్దేశం చేశారు. ఛత్తీస్‌గఢ్, చండీగఢ్ నమూనాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని సూచించారు. అగ్నిమాపక అత్యవసర సేవలను 112 సేవలతో సమన్వయం చేయాలని హోంమంత్రి అనిత ఆదేశాలు జారీ చేశారు.

# త్యాగయ్యలకు దక్కని ఊరట.. పార్టీలు ఏదైనా అంతే..

విజయవాడ : ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకులు పలు విషయాలను ప్రస్తావిస్తూ.. ట్రోల్స్ చేస్తున్న విష యం తెలిసిందే. తాజాగా.. పిఠాపురం వర్మకుసంబంధించిన విషయాన్ని పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నా రు. గత 2024 అసెంబ్లీ ఎన్నికలకు ముందు వర్మ సీటును జనసేనకు కేటాయించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పవన్ కల్యాణ్ విజయం కోసం.. వర్మ కృషి చేశారు. 70 వేల ఓట్లకు పైగా మెజారిటీతో నాడు.. పవన్ కల్యాణ్ గెలుపు గుర్రం ఎక్కారు. ఈ క్రమంలో తన టికెట్‌ను త్యాగం చేసిన వర్మకు.. చంద్రబాబు ఎమ్మెల్సీ ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ, అనూహ్య, అనివార్య కారణాలతో చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేయలేక పోయారన్నది వాస్తవం. ఇక, ఇటీవల నియోజకవర్గం ఇంచార్జ్ బాధ్యతల నుంచి కూడా వర్మను పక్కన పెట్టారు. అయితే.. ఇక్కడే మరో కీలక విషయం ఉంది. పార్టీ ఇంచార్జ్ బాధ్యతల నుంచివర్మను తప్పించినా.. ఆయనకు రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్ష పదవిని ఇచ్చారు. అంటే.. పార్టీ పరంగా వర్మకు ఇంకా మెరుగైన అవకాశమే ఉంది. కానీ, వైసీపీ నాయకులు మాత్రం వర్మకు ఏదో అన్యాయం జరిగిపోయిందని.. చంద్రబాబు మాట ఇచ్చి కూడా తప్పారని పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. ఒకవేళ ఇదే నిజమని అనుకున్నా.. గతంలో వైసీపీ కూ డా ఇలానే చేసిందన్న విషయాన్ని ఆ పార్టీ నాయకులు గుర్తించాల్సి ఉంటుంది. చిలకలూరి పేట నియోజకవర్గం నుంచి 2019లో పోటీ చేయాలని భావించిన మర్రి రాజశేఖర్ టికెట్‌ను లాక్కుని విడదల రజనీకి ఇచ్చారు. నిజానికి ఇప్పుడు పిఠాపురం తీసుకోవడం వెనుక టీడీపీకి కూటమి ప్రయోజనాలు ఉన్నాయి. కానీ.. నాడు ఏ ప్రయోజనాలు ఆశించి వైసీపీ మర్రిని త్యాగం చేయాలని పట్టుబట్టింది.? అనే ప్రశ్నకు సమా ధానం లేదు. ఇక, ఆ నాడు.. జగన్ కూడా.. మర్రికి ఎమ్మెల్సీ సహా.. మంత్రి పదవిని కూడా ఆఫర్ చేశారు. నిజానికి చంద్రబాబు వర్మకు మంత్రి పదవి ఇస్తామని చెప్పలేదు. కానీ, ఆనాడు మర్రికి జగన్ మంత్రి పదవి ఇస్తామన్నారు. మరి అధికారంలోకి వచ్చాక ఏం జరిగింది? ఇచ్చారా? అంటే.. నాలుగున్నరేళ్లపాటు మర్రిని ముప్పుతిప్పలు పెట్టారు. చివరకు.. కమ్మ సామాజిక వర్గం ఓట్లు పూర్తిగా డొల్ల అవుతున్నాయని గుర్తించి.. అప్పుడు ఇచ్చారు. సో..నాడు చేసిన విషయాన్ని మరిచిన వైసీపీ ఇప్పుడు టీడీపీకి వంకలు పెడుతుండడమే చిత్రం.

# ఏపీలో స్థానిక ఎన్నికలపై ఎస్ఈసీ స్పెషల్ ఫోకస్

అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై కీలక సమావేశం నిర్వహించింది. స్టేట్ ఎలక్షన్ కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎన్నికల సన్నాహకాలు, ప్రీ–ఎలక్షన్ కార్యకలాపాల పురోగతిపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశానికి పంచాయతీరాజ్, మున్సిపల్, బీసీ సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. గ్రామ పంచాయతీలు, అర్బన్ లోకల్ బాడీస్ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాలపై అధికారులు వివరాలు సమర్పించారు.

**ప్రీ–ఎలక్షన్ కార్యకలాపాలపై సమీక్ష..**

స్థానిక సంస్థల ఎన్నికలకు ముందుగా చేపట్టాల్సిన కార్యక్రమాల పురోగతిని ఎస్ఈసీ సమీక్షించారు. ఓటరు జాబితాల సవరణ, రిజర్వేషన్ల ఖరారు, వార్డుల విభజన, పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు వంటి అంశాలపై చర్చించారు.

ఎన్నికల నిర్వహణను పారదర్శకంగా, సమర్థవంతంగా చేపట్టేందుకు కార్యాచరణ ప్రణాళికపై ఈ సమావేశంలో చర్చించారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు.

**ముందస్తు ఏర్పాట్లు వేగవంతం చేయాలి**

ప్రీ–ఎలక్షన్ పనులను వేగవంతం చేయాలని స్టేట్ ఎలక్షన్ కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఆలస్యం లేకుండా అన్ని ఏర్పాట్లు గడువులోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

# టీడీపీలో కమిటీల లొల్లి...

గుంటూరు : టిడిపి లో ఇటీవల రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు. జాతీయస్థాయిలో మంత్రి నారా లోకేష్ అదేవిధంగా పలువురు ఎంపీలు కూడా ఉన్నారు. రాష్ట్రస్థాయిలో విస్తృతమైన నాయకత్వాన్ని ఏర్పాటు చేశారు. తద్వారా నియోజకవర్గాల వారీగా పార్టీని బలోపేతం చేయాలని, వచ్చే ఎన్నికల నాటికి పార్టీ విస్తృతంగా పుంజుకోవాలన్నది ప్రధాన ఉద్దేశం. ముఖ్యంగా వైసీపీకి బలంగా ఉన్న కొన్ని కొన్ని నియోజకవర్గాల్లో పార్టీని విజయవంతంగా ముందుకు నడిపించేందుకు వీలుగా ఈ కమిటీలు పనిచేయాలన్నది చంద్రబాబు చేసిన దిశా నిర్దేశం. ఈ క్రమంలోనే కొత్తవారికి అదేవిధంగా యువతకు కూడా ప్రాధాన్యం కల్పించారు. వీరికి పార్టీ పరంగా అన్ని విధాల అండదండలు ఉంటాయని కూడా చెప్పారు. అయితే కొన్ని కొన్ని నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయి నాయకులు కొత్తగా ఏర్పాటు చేసిన కమిటీలకు సహకరించటం లేదన్న వాదన బలంగా వినిపిస్తోంది. ముఖ్యంగా రాయలసీమ జిల్లాల్లో ఈ ప్రభావం ఎక్కువగా ఉంది. కొత్తగా నియమించిన నాయకులు ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యేలకు మధ్య వివాదాలు.. తలెత్తుతున్నాయి. దీంతో కొత్త నేతలు తమ పనులను చేసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. పేరుకు మాత్రం కొత్తగా నాయకత్వాన్ని నియమించారని, కానీ క్షేత్రస్థాయిలో ఉన్న సీనియర్ నేతలను తమ మాట వినేలా కనీసం సూచనలు చేసేలా ఏమాత్రం దిశా నిర్దేశం చేయకపోవడాన్ని కొత్త నేతలు తప్పుపడుతున్నారు. ఇప్పుడిప్పుడే బాధ్యతలు చేపట్టిన తమకు ఎమ్మెల్యేల నుంచి ఎంపీల నుంచి సహకారం లేకపోతే ఏ విధంగా ముందుకు సాగాలని కూడా క్వశ్చన్ చేస్తున్నారు. ఉదాహరణకు కడప నియోజకవర్గంలో ఎమ్మెల్యే మాధవి రెడ్డి కొత్తగా నియమించిన కమిటీలకు ఏమాత్రం సహకరించడం లేదనే వాదన బలంగా వినిపిస్తోంది. అదేవిధంగా అనంతపురం, చిత్తూరు, కర్నూలు జిల్లాల్లోనూ ఇదే తరహా పరిస్థితి కనిపిస్తోంది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో కొత్తగా నాయకులను నియమించినప్పటికీ వారి ప్రభావం కూడా కనిపించడం లేదు. మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా ఈ పరిస్థితులు తీవ్రతరం అవుతున్న వాతావరణం కనిపిస్తుంది. ఇది కొత్త నాయకత్వానికి ముఖ్యంగా కొత్తగా ఏర్పాటు అయిన నాయకులకు కూడా ఇబ్బందికరంగా పరిస్థితులు తెచ్చేలాగా కనిపిస్తుంది. వీటిని సరిదిద్దాలని కొత్త నాయకత్వం పార్టీ అధిష్టానాన్ని కోరుతోంది. అయితే ఇప్పుడే కమిటీలను ఏర్పాటు చేశామని త్వరలో పుంజుకునే అవకాశం ఉందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు చెబుతున్నారు.

మరోవైపు రెండు మూడు మాసాల్లోనే స్థానిక సంస్థలు ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో అద్భుత విజయాన్ని సొంతం చేసుకోవాలన్న ఉద్దేశంతోనే నూతనంగా కమిటీలను ఏర్పాటు చేశారు. అయితే ఈ లక్ష్యం ఏ మేరకు సాధిస్తారు.. ఏ మేరకు విజయం సాధించగలుగుతారు అనేది కమిటీలు పనిచేసే తీరును బట్టి ఆధారపడి ఉంటుంది. కానీ అసలు పని చేసుకునేందుకు అవకాశం కల్పించే వాతావరణం

# మెగా పవర్ వర్సెస్ మ్యాన్ ఆఫ్ మాసెస్!



గ్లోబల్ స్టార్ల మధ్య ఆసక్తికరమైన పోరు నెలకొంటుందా? అంటే అవుననే అనాలి. ఆర్ఆర్ఆర్ చిత్రంతో ప్రపంచవ్యాప్తం గా గుర్తింపు పొందిన రామ్ చరణ్ – జూనియర్ ఎన్టీఆర్ ఇప్పుడు తదుపరి చిత్రాలతో పోటీ పడేందుకు సిద్ధమవుతున్నారు. మే మూడవ వారంలో ఇద్దరు హీరోల సినిమాలకు సంబంధించిన భారీ అప్‌డేట్స్ ఒకేసారి రావడం సోషల్ మీడియా వేదికగా అభిమానుల మధ్య సందడి , పోటీ వాతావరణం నెలకొంది. దీంతో చరణ్ వర్సెస్ తారక్ హంగామా ఫిలిం నగర్ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. మే 18 న మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తోన్న భారీ బడ్జెట్ చిత్రం పెద్ది ట్రైలర్ లాంచ్ అవుతుంది. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం ఉత్తరాంధ్ర నేపథ్యంతో కూడిన రా అండ్ రస్టిక్ స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతుంది. చరణ్ పుట్టిన రోజు సందర్భంగా విడుదలైన పోస్టర్లు ఇప్పటికే సంచలనం సృష్టించగా రాబోతున్న ట్రైలర్ సినిమా రేంజ్‌ను ఇంకేస్థాయికి తీసుకెళ్తుందో ఊహకే అందడం లేదు. చరణ్ మేకోవర్ – బుచ్చిబాబు మేకింగ్ స్టైల్ ట్రైలర్‌లో హైలైట్‌గా నిలవనున్నాయి. అలాగే చరణ్ సందడి ముగియకముందే మే 20న మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా తారక్ చిత్రం డ్రాగన్ కి సంబంధించిన గ్లింప్స్ విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న చిత్రంపై అంచనాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. తారక్ పుట్టినరోజు కానుకగా రాబోతున్న డ్రాగన్ గ్లింప్స్ యూట్యూబ్ రికార్డులను తిరగరాయడం ఖాయమని నందమూరి అభిమానులు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఇలా ఒకే వారంలో కేవలం రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు అగ్ర హీరోల అప్‌డేట్స్ వస్తుండటంతో ఎవరికి వ్యూస్ ఎక్కువ వస్తాయి? ఎవరి హ్యాష్ ట్యాగ్ ట్రెండింగ్‌లో ఉంటుంది? అనే అంశంపై ఫ్యాన్స్ మధ్య చిన్నపాటి యుద్ధమే జరుగుతోంది. డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ పై రికార్డులను కొల్లగొట్టేందుకు రెండు వర్గాల అభి మానులు సిద్ధమవుతున్నారు. ఆర్ ఆర్ ఆర్ తర్వాత ఇద్దరూ సోలో చిత్రాలతో వస్తుండటంతో ఎవరి స్టామినా ఎంత అనేది నిరూపించుకోవడానికి ఇదొక సవాలుగా మారుతోంది. ఈ రెండు సినిమాలూ పాన్ ఇండియా స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో విడుదల కాబోతున్నాయి. దర్శకులు బుచ్చిబాబు – ప్రశాంత్ నీల్ ఇద్దరూ తమ తమ హీరోలను మునుపెన్నడూ చూడని రీతిలో ప్రెజెంట్ చేస్తున్నారని సమాచారం. ఈ క్రమంలో రెండు చిత్రాల ప్రమోషనల్ కంటెంట్ బాక్సాఫీస్ వద్ద భారీ హైప్‌ను క్రియేట్ చేయడంలో కీలక పాత్ర పోషించనున్నాయి.

# ఏక్ దిన్.. ఆలోచన మార్చుకున్న సాయి పల్లవి?



సాయి పల్లవి ప్రస్తుతం ప్రతిష్టాత్మక 'రామాయణ' సినిమాలో నటిస్తున్న విషయం తెల్సిందే. రాముడి పాత్రలో రణబీర్ కపూర్ నటిస్తుండగా, సీత పాత్రలో సాయి పల్లవి నటిస్తోంది. రావణాసురుడి పాత్రలో కన్నడ స్టార్ యశ్ కనిపించబోతున్నాడు. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమా మొదటి పార్ట్‌ను ఈ ఏడాది దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నారు. హిందీలో రూపొందుతున్న ఈ సినిమాను పలు భాషల్లో డబ్ చేయబోతున్నారు. ముఖ్యంగా హిందీతో పాటు, తమిళ్, తెలుగు, కన్నడం, మలయాళం, మరాఠి, బెంగాలీ భాషల్లో విడుదల చేయడం కోసం డబ్ చేయబోతున్నారనే వార్తలు వస్తున్నాయి. ఈ సినిమా డబ్బింగ్ విషయమై పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారట. సినిమాలో నటించిన నటీనటులతో డబ్బింగ్ చెప్పించే ఆలోచనతో దర్శకుడు నితేష్ తివారీ ఉన్నారని బాలీవుడ్ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. రాముడి పాత్రలో నటించిన రణబీర్ కపూర్ చేత హిందీలోనే కాకుండా మరో రెండు మూడు భాషల్లోనూ డబ్బింగ్ చెప్పించేందుకు గాను ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆయన భాష పై పట్టు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. మరో వైపు సాయి పల్లవి సైతం హిందీతో పాటు సౌత్‌లో అన్ని భాషల్లోనూ డబ్బింగ్ చెప్పబోతుందనే వార్తలు వస్తున్నాయి. గతంలో సౌత్ సినిమాలకు సాయి పల్లవి డబ్బింగ్ చెప్పింది. తెలుగు, తమిళ్, మలయాళ ప్రేక్షకులకు సాయి పల్లవి మాత్రమే కాకుండా ఆమె వాయిస్ పరిచయం. తన పాత్రలకు తగ్గట్లుగా సాయి పల్లవి డబ్బింగ్ చెప్పడం మనం చూశాం. అయితే హిందీలో సాయి పల్లవి డబ్బింగ్ విషయమై విమర్శలు ఎదుర్కొంది. తాజాగా సాయి పల్లవి హిందీలో నటించిన 'ఏక్ దిన్' సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా కోసం సాయి పల్లవి సొంతంగా డబ్బింగ్ చెప్పడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఏక్ దిన్ సినిమాలో సాయి పల్లవి హిందీ డబ్బింగ్ విషయంలో విమర్శలు ఎదుర్కొంది. ముఖ్యంగా హిందీ భాషను ఆమె స్పష్టంగా పలకలేక పోయిందని, కొన్ని పదాలను ఉచ్ఛరించడంలో చాలా ఇబ్బంది పడ్డట్లుగా అనిపించింది. పైగా ఆమె బాడీ లాంగ్వేజ్‌కి హిందీ భాష సెట్ కావడం లేదని సోషల్ మీడియాలో ట్రోల్స్ వస్తున్నాయి. సాయి పల్లవి ఏక్ దిన్ కోసం సొంతంగా డబ్బింగ్ చెప్పి విమర్శలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో రామాయణ విషయంలో ఆలోచన మార్చుకునే అవకాశం ఉందనే వార్తలు వస్తున్నాయి. నితేష్ తివారీ ఇప్పటి వరకు సాయి పల్లవితోనే సీత పాత్రకు డబ్బింగ్ చెప్పించాలని భావించారని, కానీ ఏక్ దిన్ సినిమా తర్వాత ఆయన నిర్ణయంలో మార్పు ఉండే అవకాశం ఉందనే టాక్ సోషల్ మీడియాలో వినిపిస్తోంది. ప్రతిష్టాత్మక రామాయణ విషయంలో ఆయన ప్రయోగాలు చేయకుంటేనే ఉత్తమం అని పలువురు భావిస్తున్నారు. రామాయణ సినిమాలో డైలాగ్స్ మరింత కఠినంగా ఉంటాయి. హిందీలో స్పష్టంగా మాట్లాడలేని సాయి పల్లవితో డబ్బింగ్ చెప్పించడం అనేది సాహస నిర్ణయం అనే అభిప్రాయం మొదలైంది. అయితే సాయి పల్లవి తెలుగు, తమిళ్ ఇతర సౌత్ భాషల్లో డబ్బింగ్ చెప్పడం మాత్రం కన్ఫర్మ్. సినిమా విడుదలకు ఇంకా చాలా సమయం ఉంది కనుక అప్పటి వరకు ఒక నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే షూటింగ్ పార్ట్ పూర్తి అయిందని, ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. రామాయణ సినిమాల కారణంగా సాయి పల్లవి పలు సినిమాలను తిరస్కరిస్తూ వచ్చింది. షూటింగ్ పూర్తి అయిన నేపథ్యంలో సాయి పల్లవి కొత్త సినిమాలకు కమిట్ అవుతుందేమో చూడాలి. ప్రస్తుతం తమిళ్‌లో ధనుష్ తో ఒక సినిమాను చేస్తుంది, తెలుగులో ఈమె కొత్త సినిమాలు ఏమీ చేయడం లేదు. ఒకటి రెండు చర్చల దశలో ఉన్నాయని సమాచారం అందుతోంది.

# పాన్ ఇండియా సినిమాలో ఈ సారి ఛాన్స్ నాదే!



బాలీవుడ్ నటి చిత్రాంగదా సింగ్ పరిచయం అవసరం లేని పేరు. బాలీవుడ్ లో చాలా కాలంగా కొనసాగుతుంది. ట్యాలెంటెడ్ బ్యూటీ. కానీ అమ్మడికి రావాల్సినంత గుర్తింపు ఇంకా రాలేదు. అయినా నటిగా, నర్తకిగా ఏ రోజు ఖాళీగా లేదు. వచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకుంటూ కెరీర్ ని ముందకు తీసుకెళ్తోంది. ఈనేపథ్యంలో అమ్మడు ఒక్కసారిగా ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది. ఓ భారీ పాన్ ఇండియా ప్రాజెక్టులో భాగం కాబోతున్నట్లు హింట్ ఇచ్చింది. గతంలో నేషనల్ అవార్డ్ విన్నింగ్ సినిమా –ఉరి: ద సర్జికల్ స్ట్రైక్– లో ముఖ్యమైన పాత్ర కోసం తనను అనుకున్నారని కానీ అనివార్య కారణాల వల్ల ఆ సినిమా నుండి తప్పుకోవాల్సి వచ్చిందని ఆమె వెల్లడించారు. ఆ అవకాశం చేజారడం పట్ల అప్పట్లో కొంత బాధ కలిగినా? ఈసారి మాత్రం అదృష్టం మళ్లీ తలుపు తట్టిందని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. దర్శకుడు ఆదిత్య ధర్‌తో –సూఫీ– అనే ప్రాజెక్ట్ కోసం ఆమె 2012 సమయంలోనే చర్చలు జరిపారు. ఆ సినిమాలో చిత్రాంగదా కోసం ఆదిత్య అద్భుతమైన పాత్రను రాశారని కానీ దురదృష్టవశాత్తు ఆ సినిమా పట్టాలెక్కలేదని ఆమె గుర్తు చేసుకున్నారు. అప్పట్లో ఆ సినిమా చేసి ఉంటే తన కెరీర్ మరోలా ఉండేదని కానీ కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదని అభిప్రాయపడ్డారు. ఉరి తర్వాత ఆదిత్య ధర్ తెరకెక్కించిన ధురంధర్ చిత్రం బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించింది. ఈ చిత్రాన్ని చూసిన తర్వాత చిత్రంగద ఆదిత్య ధర్‌కు ఫోన్ చేసి ప్రత్యేకంగా అభినందించారట. ఈ సందర్భంగానే తమ పాత ప్రాజెక్టుల గురించి , భవిష్యత్తులో రాబోయే పాన్ ఇండియా సినిమాల గురించి చర్చించుకున్నట్లు తెలుస్తోంది. ఆదిత్య ఏ సినిమా చేసినా? అందులో ఈసారి పాన్ ఇండియా ఛాన్స్ నాదే అని చిత్ర ధీమా వ్యక్తం చేసింది. దీంతో వెనుక బలమైన కారణమే ఉండి ఉంటుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం చిత్రంగద సింగ్, అపూర్వ లఖియా దర్శకత్వంలో తెరకెక్కుతోన్న మాతృభూమి చిత్రంలో నటిస్తున్నారు. సల్మాన్ ఖాన్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రం గాల్వాన్ లోయలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతోంది. ఆగస్టులో సినిమా రిలీజ్ కానుంది. ఈ సినిమా తన కెరీర్‌లో మైలురాయిగా నిలుస్తుందని ఆశీస్తుంది. ఉరి వంటి అవకాశాన్ని కోల్పోయినా? ఇప్పుడు అంతకంటే పెద్ద ప్రాజెక్టులతో సిద్ధమవుతుంది. ధురంధర్ విజయంతో ఆదిత్య ధర్ ఇండియాలోనే సంచలన దర్శకుడిగా మారిపోయారు. ఇప్పుడాయన ఏ సినిమా చేసినా పాన్ ఇండియాలోనే ఉంటుంది. ఈ నేపథ్యంలో కథ, హీరో విషయంలో ఆదిత్య ఆచితూచి అడుగులు వేస్తున్నాడు.

# వరుస ఫ్లాప్స్ తర్వాత పూజాకు బంపర్ ఆఫర్?



టాలీవుడ్‌లో స్టార్ హీరోల హిట్ కాంబినేషన్స్‌కు ఎప్పుడూ ప్రత్యేకమైన క్రేజ్ ఉంటుంది. అందులో అల్లు అర్జున్–పూజా హెగ్డే జోడీకి ప్రత్యేక స్థానం ఉందనే చెప్పాలి. గతంలో వీరి కలయికలో వచ్చిన దువ్వాడ జగన్నాథం, అల వైకుంఠపురములో సినిమాల్లో ఈ జంట ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. ముఖ్యంగా అల వైకుంఠపురములో సినిమా ఇండస్ట్రీ హిట్‌గా నిలిచిన తర్వాత ఈ కాంబోపై అభిమానుల్లో భారీ స్థాయిలో అంచనాలు పెరిగాయి. ఇప్పుడు ఈ జోడీ మూడోసారి కలిసి నటించే అవకాశాలు ఉన్నాయన్న వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ తెరకెక్కించనున్న అల్లు అర్జున్ కొత్త సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం పూజా హెగ్డే పేరును పరిశీలిస్తున్నట్లు టాక్ రావడంతో ఈ ప్రాజెక్ట్ ఒక్కసారిగా హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ దశలో ఉండగా, లోకేష్ కనగరాజ్ స్క్రిప్ట్ ఫైనల్ చేసే పనిలో బిజీగా ఉన్నట్లు సమాచారం. నటీనటులు, టెక్నీషియన్స్ ఎంపిక కూడా వేగంగా జరుగుతోందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే లోకేష్ సినిమాటిక్ యూనివర్స్ అనే బ్రాండ్‌కు దేశవ్యాప్తంగా ప్రత్యేకమైన క్రేజ్ ఏర్పడింది. యాక్షన్, ఇంటెన్స్ క్యారెక్టరైజేషన్, స్టైలిష్ టేకింగ్‌తో ఆయన సినిమాలు పాన్ ఇండియా స్థాయిలో మంచి మార్కెట్ సాధిస్తున్నాయి. అలాంటి డైరెక్టర్ సినిమాలో పూజా హెగ్డే నటిస్తే ఆమె పాత్ర ఎలా ఉండబోతుందన్న ఆసక్తి కూడా పెరుగుతోంది. ఇప్పటివరకు ఎక్కువగా గ్లామర్, కమర్షియల్ ఎంటర్‌టైనర్స్‌లో కనిపించిన పూజా, లోకేష్ స్టైల్ రా యాక్షన్ ప్రపంచంలో కొత్తగా కనిపించే అవకాశముందనే చర్చ నడుస్తోంది. అయితే ఇక్కడ మరో ముఖ్యమైన విషయం గురించి చెప్పుకోవాలి. అదే పూజా హెగ్డే కెరీర్. ఒకప్పుడు టాలీవుడ్ లో వరుస భారీ అవకాశాలతో టాప్ హీరోయిన్‌ల జాబితాలో నిలిచిన ఆమెకు గత కొంతకాలంగా ఆశించిన స్థాయి విజయాలు దక్కలేదు. కొన్ని భారీ సినిమాలు నిరాశపరచడంతో ఆమె కెరీర్ స్లో అయిందనే విషయం అందరికీ తెలిసిందే. అలాంటి టైమ్ లో అల్లు అర్జున్– లోకేష్ కనగరాజ్ వంటి భారీ కాంబినేషన్‌లో అవకాశం దక్కితే అది పూజాకు గేమ్ ఛేంజర్ కావొచ్చనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా పాన్ ఇండియా మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని హీరోయిన్ ఎంపిక జరుగుతోందని, తెలుగు మాత్రమే కాకుండా తమిళ్, హిందీ ప్రేక్షకుల్లో కూడా గుర్తింపు ఉన్న ఫేస్ ను టీమ్ కోరుకుంటోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ లెక్కన చూస్తే పూజా హెగ్డే ఎంపికకు కమర్షియల్ కారణాలు కూడా బలంగానే ఉన్నట్లు తెలుస్తోంది. ఇక అభిమానులైతే ఇప్పటికే సోషల్ మీడియాలో ఈ కాంబోపై పోస్టులు, ట్రెండ్స్ మొదలుపెట్టేశారు. మూడోసారి మ్యాజిక్ రిపీట్ అవుతుందా?, అల వైకుంఠపురములో సెంటిమెంట్ మళ్లీ వర్కౌట్ అవుతుందా? అంటూ డిస్కషన్స్ చేస్తున్నారు. మరోవైపు అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందన్న ఆసక్తి కూడా నెలకొంది. అల్లు అర్జున్ ప్రస్తుతం రాకా షూటింగ్ పూర్తి చేసిన తర్వాత ఈ ప్రాజెక్ట్ సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉందని సమాచారం. భారీ బడ్జెట్‌తో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనున్న ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన రాబోయే వారాల్లో వచ్చే అవకాశాలు ఉన్నాయని టాలీవుడ్ వర్గాలు భావిస్తున్నాయి.

# హీరోయిన్ ద్వంద్వ వైఖరిపై విమర్శలు!



కేన్స్ వేదికగా భారతీయ చిత్రాల్లో పురుషాధిక్యతపై బాలీవుడ్ నటి ఆలియా భట్ సంచలన వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. పురుషులు కంటే మహిళలు ఏ కారణంగా తక్కువ అనే పాయింట్ ను హైలైట్ చేస్తూ అంతర్జాతీయ వేదికపై మాట్లాడటం పెద్ద దుమారానే రేపుతోంది. అయితే ఆ వ్యాఖ్యలు ఇప్పుడు ఆమెకే ఎదురుదెబ్బగా మారాయి. అలియాభట్ వ్యాఖ్యల్లో కపటత్వం కనిపిస్తుందని..సదర్భాన్ని బట్టి మాటలు సునాయాసంగా మార్చగల మహిళ అంటూ నెటి జనులు విమర్శిస్తున్నారు. అవసరం ఉంటే ఒకలా అవసరం లేకపోతే మరోలా మాట్లాడటం నీకే చెల్లిందంటూ రుస రుసలాడుతున్నారు. రణబీర్ కపూర్ యానిమల్ లో నటించిన సంగతి తెలిసిందే. ఈ సినిమా విడుదలైన సమయంలో యానిమల్ అత్యంత పురుషాధిక్యతతో కూడినదిగా మహిళలను కించపరిచే విధంగా ఉందని విమర్శలు వచ్చినా ఆలియా మాత్రం ఆ చిత్రాన్ని , రణబీర్ నటనను ప్రశంసల్లో ముంచెత్తింది. అప్పట్లో అంతటి పురుషాధిక్య చిత్రం గురించి నోరు మెదపని ఆలియా ఇప్పుడు అంతర్జాతీయ వేదికపై పురుష కేంద్రిత సినిమాల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందంటూ నెటిజన్లు మీమ్స్‌తో ట్రోల్ చేస్తున్నారు. రణవీర్ సింగ్ నటించిన ధురంధర్ వంటి సినిమాల విషయంలో కూడా అలియాభట్ మౌనంగా ఉండటాన్ని నెటిజన్లు తప్పుబడుతున్నారు. పురుషుల కోసం మాత్రమే సినిమాలు తీస్తున్నారని ప్రశ్నిస్తున్న ఆలియా తానూ అలాంటి చిత్రాల్లో భాగం కాలేదా? అనే ప్రశ్నలు ఎదురవుతున్నాయి. తనకు ప్రయోజనం ఉన్నప్పుడు ఒకలా? వేదిక దొరికినప్పుడు మరోలా? మాట్లాడటం సెలబ్రిటీలకు పరిపాటిగా మారిందని విమర్శకులు అభిప్రా యపడుతున్నారు. అలియాభట్ సొంత నిర్మాణ సంస్థలో చేసే సినిమాల విషయంలో ఎలాంటి మార్పుల కోసం ప్రయత్నిస్తున్నారనే చర్చ మొదలైంది. అలాగే ఆలియా భట్ తన వ్యాఖ్యల ద్వారా భారతీయ సినిమాను తక్కువ చేసి చూపిస్తోందని మరికొందరు వాదిస్తున్నారు. –హాలీవుడ్ సినిమాలు గొప్పవి. మన సినిమాలు కేవలం పురుషుల కోసమే అనే ధోరణిలో ఆమె మాట్లాడటం సరికాదని చెబుతున్నారు. భారతీయ సినిమాలో ఇప్పటికే మహిళా ప్రాధాన్యత పెరుగుతోందని –గంగూబాయి కతియావాడి– వంటి చిత్రాలను ప్రేక్షకులు ఆదరించిన విషయాన్ని ఆమె మర్చిపోయినట్లున్నారని గుర్తు చేస్తున్నారు. మార్పును కోరుకునే వారు ముందుగా తాము చేసే పనుల్లో చూపించాలని నెటిజన్లు హితవు పలుకుతున్నారు.

# కౌలు రైతులను గుర్తించాలి

## -డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి శంకర్

గజ్వేల్:15 మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్లు కౌలు రైతులను దించాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి శంకర్ డిమాండ్ చేశారు.గజ్వేల్ మండలం కోలుగూర్,పిడిచెడ్ కౌలు రైతుల సర్వేను



నిర్వహించారు.ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ 2011 కౌలు రైతుల చట్టం ప్రకారం కౌలు రైతులను గుర్తించి ఎల్ఈసి కార్డులను మంజూరు చేయాలని కోరారు.అదేవిధంగా ఎన్నికల హామీ ప్రకారం కౌలు రైతులకు రైతు భరోసాను అందించాలని డిమాండ్ చేశారు.ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్షుడి ఓదాలో అప్పటి ప్రభుత్వానికి కౌలు రైతులకు రైతు భరోసా నష్టపరిహారం చెల్లించాలని ఉత్తరం రాశాడని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో కౌలు రైతులకు రైతు భరోసా పంట నష్టపరిహారము వ్యవసాయ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చి ప్రస్తుతం విస్మరించిందన్నారు.ముఖ్యమంత్రి మూడేళ్ల పాలనలో కౌలు రైతులకు ఇచ్చిన హామీలపై దృష్టి సారించలేదని ఆరోపించారు.కౌలు రైతులను ప్రభుత్వము గుర్తించకపోవడంతో పంట నష్టపోయిన సమయంలో పరిహారము అందక కౌలు రైతులు మరింత అప్పుల పాలవుతున్నారు.ఇకనైనా ప్రభుత్వం కౌలు రైతుల సంక్షేమము కోసము చర్యలు తీసుకోవాలని కోరారు.భరోసాతో పాటు సన్న వడ్లకు బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో డి బిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణు, మైసయ్య, తదితరులు పాల్గొన్నారు.

# భర్త ఇంటి ఎదుట నిరసన చేపట్టిన గౌరీ కథ సుఖాంతం

## ఎస్సై దామోదర్ దౌత్యంతో కలిసిన జంట

గజ్వేల్ నియోజకవర్గం:15 మే 2026 (ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ నియోజకవర్గం మర్కుక్ మండలం పాతూరు గ్రామానికి చెందిన అభిలాష్ రెడ్డి,గజ్వేల్ మండలం కోమటి బండ గ్రామానికి చెందిన గౌరీ,గత మూడు సంవత్సరాల క్రితం,ఇంట్లో వారిని ఎదిరించి ప్రేమ వివాహం చేసుకొని ,హైదరాబాదులో కాపురం ఉంటూ 9 నెలల బాబు తో గౌరీ సంతోషంగా గడుపుతున్న కాపురంలో కొన్ని నెలల క్రితం అలజడి నెలకొంది, అభిలాష్ రెడ్డి




కుటుంబ సభ్యుల మాటలు విని గౌరీని వారి తల్లిగారి ఇంటి వద్ద అభిలాష్ రెడ్డి వదిలి చాలా రోజులుగా ముఖం చాటేయడంతో గత మూడు రోజులుగా పాతూరు గ్రామంలో అభిలాష్ రెడ్డి ఇంటి ముందు గౌరీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. మీడియాలో విస్తృత ప్రచారం జరగగా,మర్కుక్ ఎస్ఐ దామోదర్ జోక్యంతో భార్యాభర్తలు కౌన్సిలింగ్ ఇచ్చి వారిని ఒక్కటి చేశారు,దాంపత్యం అన్నప్పుడు చిన్నచిన్న గొడవలు రావడం సహజం అని వారికి వారి కుటుంబ సభ్యులకు చెప్పి వారిని ఒకటి చేయడంతో కథ సుఖాంతం అయింది

# రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

## -బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పాల రమేష్ గౌడ్

గజ్వేల్:15 మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పూర్తిగా మోసం చేస్తోందని బీఆర్ఎస్ గజ్వేల్ మండల ప్రధాన కార్యదర్శి పాల రమేష్ గౌడ్ ఆరోపించారు. శుక్రవారం గజ్వేల్ పట్టణంలో వారు మాట్లాడుతూ మాటలు చెప్పడం తప్ప చేతల్లో ప్రభుత్వం ఏమీ చూపించడం లేదని ఆయన విమర్శించారు.గజ్వేల్ మండలంలో ఏ రోడ్డు చూసినా రైతులు పండించిన వరి, పొద్దుతిరుగుడు ధాన్యం కనిపిస్తోందని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో పాటు లారీలు,గోనె సంచులు కూడా సరఫరా చేయడం లేదన్నారు. సంబంధిత శాఖల అధికారులు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.ఐకేపీ కేంద్రాల వద్ద



రైతులు రాత్రింబవళ్లు ధాన్యాన్ని కాపాడుకుంటూ పడిగాపులు కాస్తున్న పరిస్థితి నెలకొందని ఆయన అన్నారు.ప్రతి రైతు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు ఇస్తున్నప్పటికీ, ఆచరణలో మాత్రం ఎక్కడా కొనుగోళ్లు జరగడం లేదని విమర్శించారు.దీంతో రైతులు రోడ్లపైకి రావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి రైతుల పట్ల చిత్తశుద్ధి లేదని పాల రమేష్ గౌడ్ విమర్శించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు జరిగేవని గుర్తు చేశారు.అప్పటి మంత్రి హరీశ్ రావు ప్రతి కొనుగోలు కేంద్రాన్ని సమీక్షిస్తూ రైతులకు సకాలంలో ధాన్యం కొనుగోలు జరిగేలా,డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు.



# నిరుపేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి : ఎమ్మెల్సీ యాదవ రెడ్డి

గజ్వేల్ :15 మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

నిరుపేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి నిలిచిందని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి అన్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.వివిధ అనారోగ్యాలతో చికిత్స పొందుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేలా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేద ప్రజలకు వైద్య ఖర్చులు భారం కాకుండా ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సహాయం అందేలా తాను నిరంతరం కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ప్రభుత్వం వారి వెన్నంటే ఉంటుందని, ఈ నిధి ద్వారా ఎంతోమందికి ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం లభిస్తోందని చెప్పారు.మే నెలలో ఇప్పటి వరకు ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించి మొత్తం రూ.47,81,500 విలువ గల 181 చెక్కులు మంజూరయ్యాయని తెలిపారు. అందులో భాగంగా శుక్రవారం కొంతమంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గుడ్డోజి మధుకిరణ్ (రూ.24,000), ఎం.డి. షరీఫ్ (రూ.60,000), మహమ్మద్ షకీల్ (రూ.18,000), దొడ్ల మల్లయ్య (రూ.12,000), నాయిని బాబు (రూ.20,500), ఆర్. మల్లారెడ్డి (రూ.60,000), ఎం. క్యాతమ్మ (రూ.11,500), దోమకొండ సత్తయ్య (రూ.11,000), చినమౌలు జ్యోతి (రూ.24,000), నుస్రత్ బేగం (రూ.42,000), గొట్టె కనకయ్య (రూ.60,000) తదితరులు చెక్కులు అందుకున్నారు.ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వానికి మరియు ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# భారీ చోరీ కేసును చెందించిన ములుగు పోలీసులు

## 24½ తులాల బంగారం, 44 తులాల వెండి ఆభరణాలు స్వాధీనం

## కేసును చేదించిన పోలీసులను అభినందించిన సీపీ ఎస్.రష్మీ పెరుమాళ్



గజ్వేల్ నియోజకవర్గం:15 మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ నియోజకవర్గం ములుగు మండలం చిన్నతిమ్మాపూర్ గ్రామంలో జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు అత్యంత చాకచక్యంగా ఛేదించారు. ఇన్‌స్టాగ్రామ్ కాల్స్ ద్వారా పోలీసులకు ఆచూకీ దొరకకుండా జాగ్రత్తలు తీసుకున్న ముగ్గురు నిందితుల్లో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసి,భారీగా బంగారం,వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాలకు వెళితే ములుగు మండలం చిన్నతిమ్మాపూర్ గ్రామానికి చెందిన శాలివాహిని నర్సింలు వంటిమామిడి వద్ద "శ్రీరామ బ్యాంగిల్ స్టోర్" నిర్వహిస్తున్నారు.ఇటీవల తన కుమార్తె వివాహం నిర్వహించిన నర్సింలు, కట్నంగా ఇచ్చిన సుమారు 20 తులాల బంగారు ఆభరణాలను భద్రపరచేందుకు ఇంట్లోని బీరువాలో ఉంచారు.అదే బీరువాలో తన భార్యకు చెందిన బంగారం, వెండి ఆభరణాలు కూడా భద్రపరిచారు.ఈ నెల 4న కుటుంబ సభ్యులు బంధువుల వివాహానికి వెళ్లగా, నర్సింలు షాప్ పనిమీద హైదరాబాద్‌కు వెళ్లారు.ఈ సమయంలో ఇంటికి తాళాలు వేసి ఉండగా, దుండగులు ఇంటి తాళాలు, బీరువా పగులగొట్టి బంగారం, వెండి ఆభరణాలతో పాటు రెండు లక్షల నగదు ఎత్తుకెళ్లారు.బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.గజ్వేల్ రూరల్ సీఐ డి.రవిరాజు ఆధ్వర్యంలో ములుగు ఎస్సై రఘుపతి, సీసీఎస్, ఐటీ సెల్, ఫింగర్ ప్రింట్స్ మరియు క్లూస్ టీమ్ ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారంతో ముగ్గురు నిందితులను గుర్తించారు.

నిందితులు మడిగెల బాలచందర్, ఇప్పలపల్లి నరేష్ అలియాస్ నచ్చు, పోత్రకొండ బాలకృష్ణలుగా గుర్తించారు. వీరు అలవాటుపడిన నేరస్తులని, ఇలాంటి దొంగతనాల్లో నైపుణ్యం కలిగి ఉన్నట్లు విచారణలో తేలింది.ఈ నెల 9న వంటిమామిడి చెక్‌పోస్ట్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న పోత్రకొండ బాలకృష్ణను అదుపులోకి తీసుకుని విచారించగా, తాము ముగ్గురు కలిసి యమహా ఆర్–15 బైక్‌పై చిన్నతిమ్మాపూర్‌కు వచ్చి చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. అనంతరం అతడిని రిమాండ్‌కు తరలించారు.

తర్వాత కోర్టు ఆదేశాల మేరకు మొదటి నిందితుడు మడిగెల బాలచందర్‌ను కస్టడీలోకి తీసుకుని విచారించగా,చోరీ చేసినట్లు అంగీకరించాడు. అతడి వద్ద నుంచి 24½ తులాల బంగారం, 44 తులాల వెండి ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతడిని కూడా రిమాండ్‌కు తరలించారు.ఇక రెండో నిందితుడు ఇప్పలపల్లి నరేష్ అలియాస్ నచ్చు కొంత నగదు, బైక్‌తో పరారీలో ఉండగా, అతడి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు కొనసాగిస్తున్నాయి.ఈ కేసులో ప్రధానంగా నిందితులు సాధారణ ఫోన్ కాల్స్ చేస్తే పోలీసులు తమను గుర్తిస్తారనే భయంతో ముందస్తు ప్రణాళిక ప్రకారం ఇన్‌స్టాగ్రామ్ కాల్స్ ద్వారానే పరస్పరం మాట్లాడుకున్నట్లు విచారణలో తేలింది. అయినప్పటికీ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో కేసును ఛేదించిన పోలీసు బృందాన్ని సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్ అభినందించారు.




# చెరువులో పడి మహిళ మృతి

గజ్వేల్:15 మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

చెరువులో పడి మహిళ మృతి చెందిన ఘటన గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రాయపోల్ మండలానికి చెందిన కోయల మమత (32)కు భర్త రాజు, కొడుకు భాను ప్రసాద్ (4) కూతురు శివాని(5) కలిసి గజ్వేల్ లో నివాసం ఉంటున్నారు. మమత గురువారం ఉదయం ఇంట్లో చెప్పి పని కోసం వెళ్లి సాయంత్రం వరకు రాలేదు, భర్త రాజు చుట్టుపక్కల తెలిసిన వాళ్ళ దగ్గర వెతికిన సమాచారం లభించలేదు. శుక్రవారం ఉదయం గజ్వేల్ లోని పాండవుల చెరువులో మమత శవం పై తేలింది. చుట్టుపక్కల వున్న స్థానికులు చూసి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.



# బైక్ ల దొంగతనానికి పాల్పడిన నిందితుడి అరెస్ట్

## -1 బైక్, 2 ఆటో రిక్షాలు స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలింపు.

## -రాయికోడ్ ఎస్ఐ చైతన్య కిరణ్, సిబ్బంది పనితీరును అభినందించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్,

సంగారెడ్డి ప్రతినిధి మే 15 ( ప్రజా కలం): వివరాలలోకి వెళితే, ఈ నెల మే 9వ తేదీన సంగాపూర్ గ్రామానికి చెందిన కాపాడి సుమన్ గౌడ్ తన ఇంటి ముందు పార్క్ చేసిన బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారని రాయికోడ్ పోలీస్




స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన రాయికోడ్ ఎస్ఐ ఎం.చైతన్య కిరణ్ సీసీటీవీ కెమెరాలు మరియు సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకొని విచారించారు. విచారణలో నిందితుడి వద్ద నుండి 1 బైక్ మరియు 2 ఆటో రిక్షాలను స్వాధీనం చేసుకొని, అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. నిందితుడు నారాయణఖేడ్ మండలం ర్యాకల్ గ్రామానికి చెందిన పండరి గౌడ్‌గా గుర్తించారు. నిందితుడిపై గతంలో కూడా పలు చోరీ కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఏటీఎం చోరీ కేసు, నారాయణఖేడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇంట్లో బంగారు ఆభరణాల చోరీ కేసు, బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలయ చోరీ కేసులతో పాటు మరికొన్ని కేసుల్లో కూడా నిందితుడిగా ఉన్నట్లు తెలిసింది. ఈ కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన రాయికోడ్ ఎస్ఐ ఎం.చైతన్య కిరణ్, సిబ్బంది పనితీరును జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ అభినందించారు.



# కొత్తపల్లిలో ఎనిమిది సీసీ కెమెరాల ప్రారంభం.

సిద్దిపేట ప్రజాకలం మే 15.

సిద్దిపేట సురక్ష నేత్రం కార్యక్రమంలో భాగంగా, సీపీ సిద్దిపేట రష్మి పెరుమాళ్ ఆదేశాల మేరకు 4వ దశలో భాగంగా సోమవారం రాయపోల్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఎనిమిది సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తోగుట సీఐ లతీఫ్, ఎస్ఐ మానస పాల్గొని గ్రామంలో భద్రతా పరిరక్షణకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రజల సమక్షంలో సీసీ కెమెరాల ప్రారంభోత్సవం నిర్వహించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాల నియంత్రణతో పాటు ప్రజల్లో భద్రతాభావం పెరుగుతుందని అధికారులు పేర్కొన్నారు.

# వీధి విక్రయదారుల సమస్యలను పరిష్కరించాలి

సత్తెనపల్లి : పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని వీధి విక్రయదారులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ వీధి విక్రయదారుల కార్మిక ఫెడరేషన్, ఏఐటీయూసీ నాయకులు మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ఎన్. ఆనంద్ కుమార్ కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ సత్తెనపల్లి ఇంచార్జి కె. శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రభుత్వం జారీ చేసిన జీవోలకు అనుగుణంగా వీధి విక్రయదారులకు రుణాలు, గుర్తింపు కార్డులు, వ్యాపార స్థలాలు, సంక్షేమ పథకాలు వంటి సహాయ సహకారాలు అందించాలని కోరారు. పట్టణాల్లో నిరుద్యోగం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా అనేక మంది చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబం పోషిస్తున్నారని తెలిపారు. అయితే వీధి విక్రయదారులు పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా వ్యాపార స్థలాల సమస్య, రుణ సదుపాయాల లోపం, వర్షాకాలంలో రక్షణ లేకపోవడం, పారిశుద్ధ్య సమస్యలు వంటి అంశాలు వారి జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన వీధి విక్రయదారుల సంరక్షణ చట్టం అమలులో అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని, టౌన్ వెండింగ్ కమిటీలను సమర్థవంతంగా నిర్వహించి విక్రయదారుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వీధి వ్యాపారులను ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి సత్తెనపల్లి నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి అంజిరెడ్డి సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, గోపి, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# తమ భూమి ని కాపాడండి అంటూ బాధితుడి మొరా

**- భూ కబ్జా ఆరోపణల తో ఆందోల్ జోగిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ అలియాస్ (చిట్టిబాబు).**

సంగారెడ్డి ప్రతినిధి మే 15 ( ప్రజాకలం):

సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం జోగిపేట లో తొలి దశ మలిదశ ఉద్యమకారుడు కీర్తిశేషులు పులుగు కిష్టయ్య భార్య మాజీ కౌన్సిలర్ పులుగు లక్ష్మీబాయి ప్రెస్ మీట్ నిర్వహించారు.తమ స్థలం ఆందోల్ జోగిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ చిట్టిబాబు కబ్జాకు యత్నిస్తున్నారంటూ ఆరోపించారు. దళితులమైన తమను వేధిస్తూ తమ స్థలాని కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారంటూ వారు ఆరోపించారు.



తక్షణమే చర్యలు తీసుకొని కబ్జా దారుల నుంచి తమను కాపాడాలని వారు వేరుకున్నారు. పులుగు గోపాలరావు మాజీ కౌన్సిలర్ మాట్లాడుతూ 2010 సంవత్సరంలో జోగిపేట ప్రధాన రహదారిపై ఆనుకొని ఉన్న పోసానిపేట శివారుకు సర్వే నంబర్ 255 మూడు ఎకరాల నాలుగు గుంటల భూమి తమ తండ్రిగారైన పులుగు కిష్టయ్య కొనుగోలు చేశారంటూ గోపాల్ చెప్పుకొచ్చారు.వారి నాన్నగారైన పులుగు కిష్టయ్య మరియు మనుసాన్పల్లి నరసింహారావు మధ్య స్థల వివాదం కొన్ని సంవత్సరాలు పాటు కొనసాగిన అనంతరం 2018 లో కోర్టు ద్వారా కాంప్రమైజ్ అవుతూ స్థల వివాద పరిష్కారం చేసుకున్నామంటూ వారు చెప్పుకొచ్చారు.అట్టి స్థలంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు) కబ్జాకు యత్నిస్తున్నారంటూ ఆరోపించారు.రోడ్డు వెడల్పున తమ స్థలం ఆనుకొని వెనకాల ఈ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ స్థలం ఉన్నదని చెప్తూ రోడ్డు ఆనుకొని నిన్న ముగ్గు వేయడం స్థలాన్ని కబ్జా చేసే యజ్ఞం చేస్తున్నారంటు ఆరోపించారు ఇట్టి విషయంపై పోసానిపేట గ్రామ సెక్రెటరీ గారికి మండల ప్రజా పరిషత్ జోగిపేట కార్యాలయంలో మరియు జోగిపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామంటు వారు చెప్పుకొచ్చారు.దళితులమైన తమపై దౌర్జన్యం చేస్తూనా వైస్ చైర్మన్ పై త్వరలో జిల్లా కలెక్టర్ గారికి మరియు నియోజకవర్గ ఎమ్మెల్యే మంత్రివర్యులు శ్రీ దామోదర్ రాజనర్సింహ గారిని కలవనున్నట్లు వారు చెప్పుకొచ్చారు.తమ సమస్య పరిష్కరించాలంటూ మీడియా ద్వారా అధికారులను వారు వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో లాయర్ నరసింహారావు మరియు దళిత నాయకులు దన్నారం బలరాం మరియు కొందరు పాల్గొన్నారు.

# మిల్లుల్లో ధాన్యం దిగుమతి వేగవంతం చేయాలి

## : జిల్లా కలెక్టర్ కె. హైమావతి.

సిద్దిపేట ప్రజాకలం మే 15.

మిల్లుల్లో ధాన్యం దిగుమతిలో ఎలాంటి జాప్యం లేకుండా ఎక్కువ మంది హమాలీలను సమకూర్చుకుని షిఫ్ట్‌ల వారీగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి మిల్లర్ యజమానులను ఆదేశించారు. శుక్రవారం దుబ్బాక



మండలం హబ్సిపూర్ గ్రామంలోని లలిత పరమేశ్వర ఇండస్ట్రీస్, అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతే గ్రామంలోని భారతి ఇండస్ట్రీస్, మంజునాథ ఇండస్ట్రీస్, దౌల్తాబాద్ మండలం ముత్యంపేట గ్రామంలోని స్వాతి ఇండస్ట్రీస్, రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామంలోని శివసాయి బాలాజీ ఇండస్ట్రీస్‌లలో ధాన్యం దిగుమతి ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లు సజావుగా కొనసాగాలంటే కొనుగోలు కేంద్రాల నుంచి లారీలు, ట్రాక్టర్ల ద్వారా మిల్లులకు చేరే ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలని సూచించారు. దిగుమతిలో ఆలస్యం కాకుండా తగిన సంఖ్యలో హమాలీలను అందుబాటులో ఉంచి షిఫ్ట్‌ల వారీగా పనిచేయించాలని ఆదేశించారు. గ్రామాల్లో స్థానికంగా పనిచేసే హమాలీలను సమకూర్చుకుని కొనుగోలు కేంద్రాల వద్దనే పనిచేసేలా చర్యలు తీసుకుంటే మిల్లుల్లో దిగుమతికి ఆలస్యం ఉండదని రైతులకు సూచించారు. ధాన్యం దిగుమతి పూర్తయ్యగానే మిల్లర్ అక్నాలెడ్జ్‌మెంట్, ట్రక్ షీట్ జనరేషన్, ఓపీఎంఎస్ అప్‌లోడ్ వంటి ప్రక్రియలను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. దిగుమతిలో జాప్యం నివారించేందుకు రెవెన్యూ అధికారులను ప్రత్యేకంగా నియమించినట్లు తెలిపారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో సన్న వడ్ల సాగును ప్రోత్సహించాలని, సన్న వడ్లకు బోనస్ కూడా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో పండించే సన్న బియ్యం స్థానిక అవసరాలకు సరిపోతుందని, ప్రస్తుతం రేషన్ షాపుల కోసం ఇతర జిల్లాల నుంచి సన్న బియ్యం దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై అధికారి తనూజతో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## దళిత క్రైస్తవుల ఎస్సీ హోదా రద్దు రాజ్యాంగ విరుద్ధం

# దళితుల పై అగ్రవర్ణాల కుట్ర

**- కేవీపీఎస్ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు**

**-సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అతిమేల మానిక్.**

సంగారెడ్డి ప్రతినిధి మే15(ప్రజాకలం):

కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్)సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంఘం జిల్లా కార్యదర్శి పి. అశోక్ అధ్యక్షతన దళిత క్రైస్తవుల పట్ల సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగబద్ధమేనా! అనే అంశంపై సంగారెడ్డి లోని సుందరయ్య భవన్ లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అతిమేలా మనిక్, సామజికొద్యమా సీనియర్ నాయకులు అనంతయ్య సంగారెడ్డి జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా అధ్యక్షులు సత్యపాల్, సంగారెడ్డి నియోజకవర్గ అధ్యక్షులు సురేష్ కార్యదర్శి విజయ్ కుమార్, వ్యకస జిల్లా కార్యదర్శి ఎం. నర్సింలు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ రమేష్ గౌడ్ జాషువా స్టడీ ఫోరం జిల్లా అధ్యక్షులు బి అమృత్ యునైటెడ్ క్రిస్టియన్ ఫోరం వైస్ ప్రెసిడెంట్ మధుమోహన్ లు మాట్లాడుతూలి దళితులు క్రైస్తవాన్ని స్వీకరిస్తే రాజ్యాంగపరమైన హక్కులు, ఎస్సీ హోదా రద్దవుతుందని సుప్రీంకోర్టు 33 పేజీల తీర్పు కోట్లాదిమంది దళితుల గుండెపై దాడి చేసిందిని భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15,25 లను హత్య చేసిందని.బౌద్ధం సిక్కు మతాలలోకి వెళితే రాజ్యాంగ హక్కులు యధావిధిగా ఉన్నప్పుడు కేవలం క్రైస్తవంలోకి వెళితే మాత్రమే రాజ్యాంగ హక్కులు చట్టాలు రిజర్వేషన్లు ఎందుకు లేకుండా పోతాయని ఈ తీర్పుపై కేంద్రం సుప్రీం కోర్టుఫుల్ బెంచ్ కు వెళ్లి రాజ్యాంగ హక్కులు దళిత క్రైస్తవులకు వర్తింపచేయాలని కులం పుట్టుకతో వస్తుందనని, తను నచ్చిన మతాన్ని స్వీకరించటం విశ్వాసాలు నమ్మకాల ఆధారంగా నడుచుకుంటారని పేర్కొన్నారు. మతం ఆధ్యాత్మిక విశ్వాసం. కులం సామాజిక వంశపారంపర్యంగా కొనసాగుతున్నదని క్రైస్తవంలోకి వెళ్లినవారిలో దళితులుగా మాత్రమే కులవివక్ష అంటరానితనానికి ఎందుకు గురవుతున్నారో చెప్పాలని ప్రశ్నించారు. క్రైస్తవం పుచ్చుకున్నంత మాత్రాన కులవివక్ష ఇంటరానితనం పొవట్లేదని రుజువులు ఉన్నాయన్నారు. అగ్రకులాల్లో పుట్టి క్రైస్తవాన్ని పుచ్చుకున్న వారు తమ సామాజిక హోదాగా ఉన్నత కులం ఆధారంగానే గౌరవించబడుతున్నారనీ, దళితులు 15శాతం రిజర్వేషన్ పొందుతున్న వారు దళితులు క్రైస్తవం పుచ్చుకుంటే 1శాతానికి వారి రిజర్వేషన్ కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హిందూ మతంలో గుడిలోకి రానీయకపోయినా బడిలో చదువుకోనీయకపోయినా




క్రిస్టియన్ మిషనరీ స్కూల్స్ క్రిస్టియన్ మిషనరీస్ హాస్పిటల్ లు చర్చిలు సంపూర్ణంగా దళితుల్ని చేరవేశాయని చెప్పారు. ఎల్లయ్య అనే పేరిట దళితుడు హిందూ సమాజంలో ఉంటే ఎల్లిగాడు అని అవమానిస్తున్న స్థానంలో చర్చికి వెళితే ఏలియా అని పిలువబడుతున్నారని గుర్తు చేశారు. మతం మారినంత మాత్రాన తమ బ్రతుకు లు మారడం లేదని వారు ఎదుర్కొంటున్న కులవివక్ష పోవడం లేదన్నారు. మోడీ 12 ఏండ్ల పరిపాలన కాలంలోనే దళితులపై దాడులు దౌర్జన్యాలు 300 రెట్లు పెరిగాయన్నారు. కేంద్ర ప్రభుత్వ అండదండలతోనే ఈ దౌర్జన్యాలు కొనసాగుతున్నాయని చెప్పారు. బిజేపీ మతోన్మాద విధానాలపై పోరాటం చేయకుండా దళితుల హక్కులు రక్షించుకోలేమని చెప్పారు. 2018 లో ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని నీరుగార్చడానికి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును దేశంలో ప్రతీ పౌరుడు ఐక్యంగా ఉద్యమించిన ఫలితంగా ఆ తీర్పు వెనక్కి తీసుకున్నదని తెలిపారు. అదే స్పూర్తితో 2026 మార్చి 24న నచ్చిన తీర్పును వెనక్కి తీసుకునేంతవరకు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అంబేద్కర్ స్టడీ ఫోరం నాయకులు లక్ష్మయ్య కుమార్,రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాజేష్ నాయకులు సదానందం లు మాట్లాడారు.ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎం శివకుమార్ జిల్లా ఉపాధ్యక్షులు న్యాయవాది సుభాష్ సహాయ కార్యదర్శి దాస్, చంద్రయ్య భాస్కర్ కెవిపిఎస్ జిల్లా నాయకులు ప్రభాకర్ దత్తు సురేష్ పౌలు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి శ్రీధర్ బాబు కేంద్ర ప్రభుత్వం పై కీలక వ్యాఖ్యలు

**- పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై కేంద్రంపై విమర్శలు**

**- రైతులు, విద్యార్థుల అంశాలపై స్పందన**

సంగారెడ్డి ప్రతినిధి మే 15 (ప్రజా కలం):

మంత్రి శ్రీధర్ బాబు సంగారెడ్డిలో నిర్మలా జగ్గారెడ్డి నివాసంలో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఎంపీ సురేష్ షెట్కర్ కూడా పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ ధరలను రూ.3 పెంచడం ప్రజలపై భారంగా మారిందని విమర్శించారు. నాలుగు రాష్ట్రాల ఎన్నికల అనంతరం కేంద్ర ప్రభుత్వం ధరల పెంపు చేపట్టడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసినట్లేనని అన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలపై ఈ నిర్ణయం తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు.

బెంగాల్, తమిళనాడులో ఎన్నికల చివరి దశకు ముందు పెట్రోల్, డీజిల్ ధరలు పెరగవని అధికార వర్గాలు చెప్పి, ఇప్పుడు పెంపు చేయడం ద్వారా ఓటర్లను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు తగ్గిన సమయంలో కేంద్రం ప్రజలకు ఎప్పుడైనా ఉపశమనం కల్పించిందా అని బీజేపీని ప్రశ్నించారు.

"ఇప్పుడు రూ.3 పెంచి, ఇంకా ధరలు పెరిగే సంకేతాలు ఇస్తున్నారు. నిత్యావసర వస్తువుల ధరల పై అదనపు భారం మోపి పేదల , సామాన్య ప్రజల నడ్డి విరచడమే బీజేపీ అసలు స్వరూపం" అని వ్యాఖ్యానించారు. గత 12 ఏళ్లలో అంతర్జాతీయంగా చమురు ధరలు అత్యల్ప స్థాయికి చేరినా కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ప్రయోజనం కల్పించలేదని విమర్శించారు.

రాజకీయ అంశాలపై స్పందిస్తూ, ప్రజలను విభజించడం, ప్రజల మధ్య చిచ్చు పెట్టడం బీజేపీ లక్ష్యమని ఆరోపించారు. అన్ని వర్గాల ప్రజలు స్నేహపూర్వకంగా జీవించాలని రాహుల్ గాంధీ కోరుతున్నారని తెలిపారు. తెలంగాణ ప్రజలు విజ్ఞానవంతులని, బీజేపీ కుట్రపూరిత రాజకీయాలను అంగీకరించరని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభివృద్ధి, సంక్షేమానికే కట్టుబడి ఉందని స్పష్టం చేసిన మంత్రి, రేవంత్ రెడ్డి నేతృత్వంలో మంత్రులందరూ సమిష్టిగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వంలో ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని, ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సక్రమంగా వినియోగిస్తామని చెప్పారు. ధాన్యం కొనుగోలు అంశంపై మాట్లాడుతూ, దేశ చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా ఈసారి భారీగా ధాన్యం మార్కెట్‌కు వచ్చిందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు




లేకుండా కొనుగోలు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రతి రెండు రోజులకు ఒకసారి ధాన్యం కొనుగోలుపై సమీక్ష నిర్వహిస్తున్నారని, చివరి గింజ వరకు మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులకు హామీ ఇచ్చారు.

నీట్ పరీక్ష లీకేజీ ఘటనపై కూడా మంత్రి స్పందించారు. దాదాపు 23 లక్షల విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్రంలోని ఎన్డీఏ, బీజేపీ ప్రభుత్వం ఆడుకుందని ఆరోపించారు. ఎన్నో సంవత్సరాలు కష్టపడి చదివిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

అలాగే, "చట్టాలను చుట్టాలుగా బీఆర్ఎస్ ఉపయోగించినట్లు మేము చేయము. చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుంది" అని మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు.

# పటాన్చెరువు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ జన్మదిన సందర్భంగా అనాధ ఆశ్రమంలో పుట్టినరోజు వేడుకలు ,ఎం. కే. వై ఫౌండేషన్ బృందం



పటాన్ చేరు మే 15 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ జన్మదిన సందర్భంగా పటాన్చెరువు నియోజకవర్గ పరిధిలోని శివానగర్ వద్ద గల శిరీష మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ నందు, ఎం. కే. వై.ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో మెట్టు కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా, ఎం కే. వై.ఫౌండేషన్ బృందం వారు ఆశ్రమంలోని పిల్లల చేత కేక్ కట్ చేయించి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు, అనంతరం ఆశ్రమంలోని పిల్లలందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు మెట్టు కుమార్ యాదవ్ సహోదరులు మెట్టు ఎల్లేష్ యాదవ్ మాట్లాడుతూ పటాన్చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ జన్మదిన సందర్భంగా శిరీష మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ నందు గల పిల్లలతో పాటు మెట్టు కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలను, ఎం కే. వై.ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించామని తెలిపారు. ఆడంబరాలకు పోకుండా ఇలా అనాధ పిల్లల మధ్య పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో మెట్టు ఎల్లేష్ యాదవ్, ఆల్విన్ కాలనీ ప్రెసిడెంట్ సత్యనారాయణ మాజీ వార్డ్ కమిటీ మెంబర్ నవీన్ రెడ్డి,కార్ రాజు మెట్టు కళ్యాణ్ యాదవ్ , సన్నీ యాదవ్ అఫ్జల్ ,ఎం. కే. వై.ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





## నూతన ఆలయ నిర్మాణానికి విరాళం

వలిగొండ మే 15 ప్రజాకలం:మండల పరిధిలోని పులిగిల్ల గ్రామంలో నూతనంగా నిర్మించనున్న శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణంలో భాగంగా గణపతి ఉప ఆలయ నిర్మాణం కొరకు పులిగిల్ల గ్రామ తపాలా ఆఫీస్ ఉద్యోగి ఎడ్ల మల్లారెడ్డి పుష్పలత దంపతుల కుమారులైన ఎడ్ల సంపత్ రెడ్డి– భవాని,ఎడ్ల సందీప్ రెడ్డి– ప్రియ దంపతులు ఒక లక్ష 16 వేల రూపాయలను ఆలయ కమిటీ సభ్యులకు విరాళంగా చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా వారికి వారి కుటుంబ సభ్యులకు శ్రీ సీతారామచంద్ర స్వామి కరుణాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ఆలయ కమిటీ సభ్యులు ఆ భగవంతున్ని కోరుకున్నారు.అదే విధంగా ఈ ఆలయ నూతన నిర్మాణానికి గ్రామ ప్రజలు భక్తులు నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని,అంతేకాకుండా తమ వంతు సహాయ సహకారాలు అందించాలని తెలిపారు.




## ఉద్యమకారులను అరెస్టు చేయడం హేయమైన చర్య

### -సంగిశెట్టి క్రిస్టఫర్ మలిదశ ఉద్యమకారుడు

వలిగొండ మే 15 ప్రజాకలం:ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపై స్పష్టమైన ప్రకటన చేయాలని,కాలయాపన పేరుతో ఉద్యమకారులను మోసం చేయాలనుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ముఖ్యమంత్రి ఇల్లు ముట్టడి కార్యక్రమం పేరుతో కొన్ని ఉద్యమ సంఘాలు పిలుపునివ్వడంతో,ప్రభుత్వం పోలీసులు ఉద్యమకారుల హక్కుల కోసం కొట్లాడుతున్న వివిధ సంఘాల ఉద్యమకారులను శుక్రవారం అర్ధరాత్రి నుండే అక్రమంగా అరెస్టు చేయడం హేయమైన చర్య అని,మలిదశ ఉద్యమకారుడు టియుజేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ అన్నారు. ఈ రోజు పదవులు అనుభవిస్తున్నారంటే,అది ఉద్యమకారుల త్యాగాల ఫలితమే అని గుర్తించాలన్నారు.అనేక మంది ఉద్యమకారులు రాష్ట్ర సాధన కోసం,అలుపెరుగని పోరాటాలు చేసి జైలు నిర్బంధాలను ఎదుర్కొని కోర్టుల చుట్టూ తిరిగి ఆర్థికంగా చితికిపోయి రోజుకు ఒక ఉద్యమకారుడు పిట్టలు రాలినట్లు రాలిపోతుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదని,ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాలయాపన చేయడం మూర్ఖత్వమని ఆయన హెచ్చరించారు.జూన్ 2 నాడు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపై స్పష్టమైన ప్రకటన రాకపోతే,ఈ ప్రభుత్వానికి ఉద్యమకారులు సరైన గుణపాఠం చెప్తారని ఆయన అన్నారు.



## లీగల్ ఏయిడ్ కౌన్సెల్ గా నాగం సాయిబాబా నియామకం



కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 15 ప్రజా కలం : ఎల్లారెడ్డి పట్టణంలోని స్థానిక కోర్టులో లీగల్ ఏయిడ్ కౌన్సెల్ గా న్యాయవాది నాగం సాయిబాబాను నియమిస్తూ డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ కామారెడ్డి శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ పదవిలో ఆయన మూడేళ్ల పాటు కొనసాగుతారు. న్యాయవాది ఫీజు చెల్లించలేని నిరుపేద నిందితులకు ఉచిత న్యాయ సహాయం అందించడం ఈ పదవిలో ఆయన బాధ్యత. ఈ నియామకంపై ఎల్లారెడ్డి కోర్టు బార్ అసోసియేషన్ బృందం సాయిబాబాకు శుభాకాంక్షలు తెలిపింది..

## మృతి చెందిన పలు కుటుంబాలకు మాదాసు శ్రీనివాస్ పరామర్శ..

గజ్వేల్:15 మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ మండలం రిమ్మానాగూడ గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు దశరథకు మాతృ వియోగం జరిగింది.తల్లి రాగిల్లా విస్తరమ్మ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ నిన్న మద్యాహ్నం మృతి చెందింది.విషయం తెలుసుకున్న ఏఎంసి మాజీ చైర్మన్ మదాసు శ్రీనివాస్,బీఆర్ఎస్ నాయకులతో కలిసి శుక్రవారం ఉదయం పరామర్శించారు.ఇస్తారమ్మ మృతి పట్ల ప్రగాఢ సానుభూతితో పాటు సంతాపం వ్యక్తం చేశారు.వారి ఆత్మకి శాంతి చేకూరాలని ప్రార్థించారు.దశరథ కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలిపించారు.అదేవిధంగా అదే గ్రామానికి చెందిన జూపల్లి సంజయ్ (30) నిన్న ఆకస్మికముగా గుండె పోటుతో మరణించడం జరిగింది.మృతుడు చిన్న వయసులోనే మరణించడంతో భార్యా ఇద్దరు చిన్న పిల్లలు ఉండటంలో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను కూడా పరామర్శించి ఆర్థిక సహాయం అందచేయడం జరిగింది.ఈ సందర్భంగా వారి వెంట బిఆర్ఎస్ నేతలు రమేష్ గౌడ్,భీమప్ప,బాల రాజు గౌడ్, శివకుమార్,రాజశేఖర్,రాములు, వెంకటేష్ యాదవ్,కిష్టయ్య, బాబు,తదితరులు ఉన్నారు.



# తెలంగాణ రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ గా గూడూరు శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం

### శుభాకాంక్షలు తెలిపిన పర్యావరణవేత్త పిట్టల రవిబాబు,సామాజిక కార్యకర్త డా:లక్ష్మీవీరమల్లు



మేడిపల్లి మే 15(ప్రజాకలం న్యూస్)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ గా గూడూరు శ్రీనివాస్ శుక్రవారం నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా హైద్రాబాద్ సెక్రెటరియేట్ ఛాంబర్ లో ప్రొపెసర్.ప్రముఖ పర్యావరణ వేత్త పిట్టల రవిబాబు, సామాజిక కార్యకర్త.రా చెరువు పరిరక్షణ సమితి సభ్యులు,బోడుప్పల్ పద్మశాలి సంఘం ముఖ్య సలహాదారులు డా.లక్ష్మీవీర మల్లు కలిసి శాలువాతో సన్మానించి బోకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ విదేశీ వస్త్రాలు ప్రకృతిని, పర్యావణాన్ని, భారతీయ సంస్కృతి, సంప్రదాయపు విలువలను వస్త్రాలతో నాశనం చేస్తున్న సందర్భంలో మీ పదవి భాద్యతలు దేశీయ సప్రదాయ చేనేత వస్త్రాల ఉత్పత్తి పెంచి దేశానికి చేనేత శ్రామికులకు కుటుంబాలకు బాసటగా నిలిచి,ఆర్థికంగా, సంప్రదాయంగా ఉపయోగపడేలా నిలుపుతాయని వాఖ్యణించారు.డా.లక్ష్మీవీర మల్లు మాట్లాడుతూ గతకొన్ని దశాబ్దాలుగా చేనేత మగ్గం మూగబోయిందని, ఎలక్ట్రికల్ మగ్గం వచ్చాక అన్ని వర్గాలు కార్పొరేట్ వ్యవస్థలో చిక్కుకుని చేనేత కుటుంబాలు చితికి పోయే సందర్భం, కృత్రిమ వస్త్రాలు అందంగా,ప్లాస్టిక్, ఐరన్ మొదలైన చిన్న చిన్న అలంకరణలతో చిన్నారుల అనారోగ్యానికి కారణం అవుతాయేమో అనే భయం కూడా ఉందని అన్నారు. కృత్రిమ వస్త్రాల వల్ల చేనేత కుటుంబాలు ఆర్థికంగా కుంటుంబ విలువలు డిపోయాయని, ఎంతోమంది చేనేతలు అర్డర్లు లేక, వస్త్రాలు తయారులేక,తయారు అయ్యాక అమ్మకాలు లేక కుటుంబాలు ఆర్థికంగా బతుకులు చితికి పోయి సిరిసిల్ల, వరంగల్, కరీంనగర్. నల్గొండ మొదలైన ప్రదేశాల్లో అనేకమంది ఆత్మహత్య చేసున్నారు.ఇప్పుడు నూతన పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ లు గా మన కుల వృత్తిని కాపాడే విషయంలో అత్యంత చొరవ తీసుకుని పద్మశాలి బిడ్డల బతుకులు బాగుపడే విదంగా కృషి చేయాలని విజ్ఞప్తిచేశారు.చైర్మన్ సానుకూలంగా స్పందిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి సాధ్యమైనంత మేరకు పద్మశాలి కుటుంబ సభ్యుల సమస్యలు ఒక్కొక్కటిగా తీర్చే విదంగా కృషి చేస్తానని చెప్పారని వారు చెప్పారు.

### మోడీది డబుల్ ఇంజన్ సర్కార్ కాదు..

# రెండు నాలుకల సర్కార్

### - పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి



మేడిపల్లి మే 15(ప్రజాకలం న్యూస్)

మోడీ సారథ్యంలో ఉన్నది డబుల్ ఇంజన్సర్కార్ కాదు, రెండు నాలుకల సర్కార్ ఎన్నికలకు ముందు ఒకలా, ఎన్నికలు ముగిసిన తర్వాత మరోలా వ్యవహరిస్తున్నారని, నాలుగు రాష్ట్రాల్లో ఎన్నికలు పూర్తవగానే పెట్రోల్ ధరలు పెంచి బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలను మరోమారు మోసం చేసింది పీర్జాదిగూడ కార్పోరేషన్ మాజీ మేయర్ జక్కవెంకట్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.ఈ మేరకు శుక్రవారం నరేంద్రమోదీ ప్రభుత్వం పెట్రోల్ ధరలు పెంచి అతని అవకాశవాద రాజకీయాలను మరోసారి బహిర్గతం చేశారు. పెట్రోల్, డీజిల్ ఆరు నెలల స్టాక్ ఉందని గొప్పలకు పోయి ఇప్పుడు మళ్లీ యుద్ధమే కారణమని చెప్పడం గమనార్హం. తెలంగాణ రాష్ట్రం నుండి ఎంపీలుగా గెలిచి కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్ రెడ్డి ,బండి సంజయ్ పెట్రోల్ ధరలు పెరగవని చాలాసార్లు ప్రకటించారు. ఇప్పుడు ఎలా పెంచారో, ఎందుకు పెంచారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పెట్రోల్,డీజిల్ ట్యాక్స్ లను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తే ప్రజలపై భారం పడదని గత అసెంబ్లీ ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి, సీతక్క ప్రగల్భాలు పలికారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై భారం పడకుండా ట్యాక్స్ లను భరించి పెరిగిన ధరలను ప్రభుత్వమే భరించాలి. కొద్ది రోజుల క్రితం హైద్రాబాద్ పర్యటన లో పెట్రోల్ ,డీజిల్ తక్కువ వాడండి బంగారం కొనవద్దు, నూనె తక్కువ వాడాలని మోదీ చెప్పినప్పుడే ప్రజలకు అనుమానం వచ్చిందని, అధికారంలో ఉండి అడ్డగోలుగా ధరలు పెంచుతూ దేశ ప్రజల నడ్డి విరుస్తున్న ఈ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు పై ప్రజలు మండిపడుతున్నారన్నారు. సమీప భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు.

### బహదూర్ పల్లిలో చెరువులు, కుంటలు కబ్జాలకు గుర్రై కనుమరుగవుతుంటే

# అధికారులు పట్టించుకోరా?

### హైడ్రాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి: సాదు యాదవ్






ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బహదూర్ పల్లి డివిజన్ పరిధిలోని బొబ్బఖాన్ చెరువు, సందయ్య కుంట, ఫిర్జాది కుంట నేరెళ్ల కుంట (మల్లన్న కుంట) క్రమంగా కబ్జాల గుర్రై కనుమరుగవుతున్నాయని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోరా? అని స్థానిక కాంగ్రెస్ నాయకుడు సాదు యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం చెరువులు, కుంటలు కబ్జాకు గురి కావడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి ప్రజలు తాగునీటి కోసం ట్యాంకర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తుంది.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భవిష్యత్తు తరాలకు చెరువులు కుంటలు నాలాలను కబ్జాలకు గురికాకుండా వాటి పరిరక్షణ కోసం హైడ్రా వంటి సంస్థను ఏర్పాటు ఏర్పాటు చేయడం జరిగింది. గత ప్రభుత్వం (బిఆర్ఎస్) పార్టీ స్థానిక నాయకుల కనుసన్నల్లోనే చెరువులు కుంటలు కబ్జాలకు గురవుతున్నాయి. దీనికి తోడు అధికారులు మాత్రం" డోంట్ కేర్ అంటూ వ్యవహరిస్తున్నారు. చెరువులు కుంటలు కాపాడాల్సిన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు మౌనం ఎందుకు వహిస్తున్నారు. గత వర్షాకాలంలో అధికారుల నిర్లక్ష్యం వల్లనే చాలా కాలనీలు ముంపుకు గురయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువులు కుంటల్లో నిర్మించిన అక్రమ నిర్మాణాలను తొలగించి వాటిని పునరుద్ధరించాలని కబ్జాల్లో ఉన్న కుంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. కాపాడాల్సిన వ్యక్తులే కబ్జాల పాల్పడుతున్నారని ఆరోపించారు.




## కాచిగూడ మున్నూరు కాపు సంఘం విద్యార్థి వసతి గృహం సేవా భావంతో చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయం

### మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

హైదరాబాద్, మే 15(ప్రజా కలం ప్రతినిధి);

కాచిగూడ మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం,రాష్ట్ర దేవాదాయ, దర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్స్ సహకారంతో నిర్వహించిన ఉచిత మేగా వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది.ఈ మెగా వైద్య శిబిరంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పాల్గొని ప్రజలు ఈ ఉచిత వైద్య సేవలను



సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని,మున్నూరు కాపు సంఘం విద్యార్థి వసతి గృహం సేవా భావంతో చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన అభినందించారు. పేద ప్రజలకు మంచి ఆరోగ్య సేవలను చేదువ చేయాలని సంకల్పంతో ఈ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వసతి గృహం వ్యవస్థాపక కుటుంబ సభ్యులు దడువై రాఘవేందర్ తెలిపారు. దేవాదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్య చంద్రారెడ్డి, కిమ్స్ సన్ షైన్ కార్డియాలజీ హెచ్ ఓ డీ డాక్టర్ శ్రీధర్ కస్తూరి మాట్లాడుతూ ఈవైద్య పరీక్షల ద్వారా వ్యాధి లక్షణాలను ముందుగానే కనుగొని తగిన చికిత్స తీసుకుంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అని తెలిపారు.ఈ ఉచిత క్యాంప్ ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కిమ్స్ సన్ షైన్ కార్డియాలజీ హెచ్ ఓ డీ డాక్టర్ శ్రీధర్ కస్తూరి, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ చందర్ తేజవత్ ల ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది పాల్గొని ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించారు. ఆర్థోపెడిక్,కార్డియాలజీ, అప్తమాలజీ,ఫెర్టిలిటీ కౌన్సిలింగ్,జనరల్ ఫిజిషియన్,బీపీ,జీఆర్ బిఎస్, బిఎండి,వెయిట్,2 డిఈకో, ఈసీజీ తదితర వైద్య విభాగాల వైద్య నిపుణులు పాల్గొని ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి నివారణ చర్యలను వైద్యులు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక కుటుంబ సభ్యులు దడువై రాధాకృష్ణ,ఏనుగుల మాణిక్ ప్రభు మరియు మాజీ ట్రస్టీలు ఆకుల పాండురంగారావు,మంద సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు

### పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చేరు మే 15 (ప్రజా కలం)**

అమీన్పూర్ నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీలలోని ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బీరంగూడ డివిజన్ పరిధిలోని కిష్టారెడ్డిపేటలో గల లేక్ వ్యూ కాలనీలో శుక్రవారం రక్షిత మంచినీటి సరఫరా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వేసవికాలంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అవసరమైన పక్షంలో నూతన బోర్లు, ట్యాంకర్లు సైతం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ, గ్రామ మాజీ సర్పంచ్ కృష్ణ, జలమండలి జిఎం శ్రీనివాస్ రెడ్డి, డిజిఎం శివ, ఇంజనీరింగ్ డిఈ వెంకటరమణ, కాలనీ అధ్యక్షుడు విజయ్, తదితరులు పాల్గొన్నారు.



# మెడికవర్ హాస్పిటల్స్ హైటెక్ సిటీలో

# అత్యాధునిక కంటి వైద్య కేంద్రం ప్రారంభం

## - ముఖ్య అతిథిగా సినీ నటి, సామాజిక సేవకురాలు అమల అక్కినేని






హైదరాబాద్, మే 15 (ప్రజాకలం) :

అత్యాధునిక సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను మరింత విస్తరించేందుకు మెడికవర్ హాస్పిటల్ హైటెక్ సిటీ యూనిట్‌లో సమగ్ర కంటి వైద్య సేవలను అందించే అత్యాధునిక అడ్వాన్స్‌డ్ ఐ సెంటర్‌ను ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటి, సామాజిక సేవకురాలు అమల అక్కినేని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతనంగా ప్రారంభించిన ఈ ఐ సెంటర్‌లో కాటరాక్ట్, రెటినా, రిఫ్రాక్టివ్, కార్నియా, న్యూరో-ఆఫ్తాల్మాలజీ సేవలను ఒకే చోట అత్యాధునిక సాంకేతికతతో అందుబాటులోకి తీసుకువచ్చారు. అనుభవజ్ఞులైన నేత్ర వైద్య నిపుణుల బృందం ద్వారా ప్రపంచ స్థాయి నిర్ధారణ, చికిత్స మరియు శస్త్రచికిత్స సేవలను ఈ కేంద్రం అందించనుంది. ఈ సందర్భంగా అమల అక్కినేని మాట్లాడుతూ, ప్రజలకు అత్యాధునిక కంటి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్న మెడికవర్ హాస్పిటల్ ప్రయత్నాన్ని అభినందించారు. కంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించడం, క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవడం, సమయానికి చికిత్స పొందడం ద్వారా దృష్టి కోల్పోయే ప్రమాదాన్ని తగ్గించవచ్చని ఆమె తెలిపారు. ఈ కేంద్రంలో ప్రత్యేక రెటినా మరియు విట్రియో-రెటినల్ సేవలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో రెటినా లేజర్ చికిత్సలు, ప్రీమేచ్యూర్ శిశువుల్లో వచ్చే రెటినోపతి ఆఫ్ ప్రీమ్యాచ్యూరిటీ (ROP) చికిత్స, డయాబెటిక్ విట్రెక్టమీ, రెటినల్ డిటాచ్‌మెంట్ శస్త్రచికిత్సలు, యువియాటిస్ నిర్వహణ, కాటరాక్ట్ శస్త్రచికిత్స అనంతర సమస్యల చికిత్సలు ఉన్నాయి. అలాగే క్లిష్టమైన కంటి-నర సంబంధిత సమస్యలకు న్యూరో ఆఫ్తాల్మాలజీ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయి.




కాటరాక్ట్ చికిత్స విభాగంలో ఫేకోఎమల్సిఫికేషన్‌తో ఫోల్డబుల్ ఇంట్రా ఆక్యులర్ లెన్స్ (IOL) అమరిక, స్మాల్ ఇన్సిషన్ కాటరాక్ట్ సర్జరీ వంటి ఆధునిక శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు సెంటర్ సన్నద్ధమైంది. వీటి ద్వారా రోగులకు త్వరితగతిన కోలుకునే అవకాశం, మెరుగైన చూపు లభిస్తుంది.

అదేవిధంగా LASIK, SMILE, PRK, రిఫ్రాక్టివ్ లెన్స్ ఎక్స్చేంజ్, ఇంప్లాంటబుల్ కాలామర్ లెన్స్ (ICL), కెరటోకోనస్‌కు కార్నియల్ కొలాజెన్ క్రాస్‌లింకింగ్ (C3R) వంటి ఆధునిక రిఫ్రాక్టివ్ మరియు కార్నియా చికిత్సలు కూడా అందించను న్నారు.

ఇంకా ఇంట్రావిట్రియల్ ఇంజెక్షన్లు, YAG క్యాప్సులోటమీ, పెరిఫెరల్ YAG ఇరిడోటమీ, చలేజియన్ ఇన్సిషన్ అండ్ డ్రైనేజ్, తరచూ వచ్చే చలేజియన్ సమస్యలకు ఇంట్రాలెషనల్ స్టెరాయిడ్ చికిత్సలు వంటి సమగ్ర నేత్ర వైద్య సేవలు కూడా ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటాయి.

ఈ అడ్వాన్స్‌డ్ ఐ సెంటర్ ప్రారంభం ద్వారా తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాల ప్రజలకు అత్యాధునిక, నాణ్యమైన, అందుబాటు ధరల్లో కంటి వైద్య సేవలను అందించాలనే తమ లక్ష్యాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం డయాబెటిస్ కారణంగా వచ్చే రెటినా సమస్యలు, కాటరాక్ట్, రిఫ్రాక్టివ్ లోపాలు, జీవనశైలి కారణమైన కంటి సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో సమయానుకూలంగా ఆధారబద్ధమైన వైద్య సేవలను ఈ సెంటర్ ద్వారా అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డా. జ్యోత్స్న మైనేని (సీనియర్ కన్సల్టెంట్ -- రెటినా & యువియాటిస్), డా. హరినాథ్ బాబు కార్లపూడి (కన్సల్టెంట్ ఆఫ్తాల్మాలజిస్ట్), డా. కోటేశ్వర ప్రసాద్ వీరగంధం (సీనియర్ కన్సల్టెంట్ ఆర్థోపెడిక్), డా. రామకృష్ణ రావూరి (హెడ్ -- అనస్తీషియాలజీ విభాగం), మహేష్ డెగ్లూర్కర్ (చీఫ్ ఆఫ్ బిజినెస్ ఆపరేషన్స్), డా. జానకిరామ్ (రీజినల్ డైరెక్టర్), శ్రీకాంత్ (సెంటర్ హెడ్) పాల్గొన్నారు.



# ఫామ్ హౌస్ స్క్రిప్ట్ లు ఆపు ఆర్ఎస్ ప్రవీణ్,

## నిందితుడి అరెస్ట్ కోసం కొట్లాడు

## మహిళా బాధితురాలి ప్రైవసీని కాపాడమంటే కవితపై విమర్శలా?

## టీఆర్ఎస్ నేతలు చిలుక ప్రవీణ్, సూరారపు కృష్ణవేణి మండిపాటు

హైదరాబాద్: మే 15: ప్రజా కలం ప్రతినిధి

బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీరు పై టీఆర్ఎస్ నేతలు చిలుక ప్రవీణ్, సూరారపు కృష్ణవేణి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఫామ్ హౌస్ నుంచి వచ్చే స్క్రిప్టులను చదువుతూ, రోజుకో జబర్దస్త్ స్కిట్ చేయడం ప్రవీణ్ కుమార్ మానుకోవాలని వారు హితవు పలికారు. బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. రాజకీయ పబ్బం కోసమే డ్రామాలు చేయవద్దన్నారు. బండి సంజయ్ కుమారుడిపై నమోదైన పోక్సో కేసులో బాధితురాలి ప్రైవసీకి భంగం కలగకూడదని, నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయాలని తమ పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత డిమాండ్ చేస్తే.. ఆమెను టార్గెట్ చేయడం ఏంటని ప్రశ్నించారు. ఈ కేసులో బాధితురాలిని బద్నాం చేసైనా రాజకీయ లబ్ధి పొందాలని బీఆర్ఎస్ నేతలు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని ధ్వజమెత్తారు. బాధితురాలికి న్యాయం జరగాలన్న ఆకాంక్ష బీఆర్ఎస్ నేతల్లో లేదని, అందుకే నిందితుడిని అరెస్ట్ చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడం లేదని దుయ్యబట్టారు.



**కవితపై విమర్శలు ఆశ్చర్యకరం**

ఒక తల్లిగా ఆలోచించి బాధితురాలిని బజారుకీడ్చవద్దని, లుక్ అవుట్ నోటీసులు జారీ చేయాలని కవిత డిమాండ్ చేశారాని వెల్లడించారు. ఇది బీఆర్ఎస్ నేతలకు ఎందుకు మింగుడు పడటం లేదు? అని చిలుక ప్రవీణ్ ప్రశ్నించారు. మెట్రోలో ప్రచారం చేయడం, పోస్టర్లు వేయడం వల్ల బాధితురాలికి న్యాయం ఎలా జరుగుతుందని ఆయన నిలదీశారు. చేతనైతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేదా బండి సంజయ్ ఇంటి ముందు ధర్నా చేయాలని సవాల్ విసిరారు.

**అప్పుడు ఎందుకు నోరు విప్పలేదు?**

బీఆర్ఎస్ నాయకుడు సంతోష్ సన్నిహితుడి వల్ల ఒక మహిళా జర్నలిస్ట్ ప్రాణాలు కోల్పోయినప్పుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఎందుకు మాట్లాడలేదని సూరారపు కృష్ణవేణి ప్రశ్నించారు. ఆ కేసులోనూ పోక్సో సెక్షన్లు ఉన్నాయని, నిందితుడు స్వేచ్ఛగా తిరుగుతున్నా ఆర్ఎస్ ప్రవీణ్ కు కనిపించడం లేదా అని నిలదీశారు. కేవలం కవితకు వస్తున్న ఆదరణను తట్టుకోలేకనే అసందర్భంగా విమర్శలు చేస్తున్నారని, ప్రజలు అన్ని గమనిస్తున్నారని, తగిన సమయంలో బీఆర్ఎస్ కు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. తమ పార్టీ ఎప్పుడూ మహిళల ప్రైవసీని గౌరవిస్తుందని, ఇలాంటి ఘటనలను రాజకీయాలకు వాడుకోదని స్పష్టం చేశారు.

# నా వెంట్రుక కూడా పీకలేరు

### ప్రభుత్వం, మంత్రులపై ఎమ్మెల్యే మర్రి ఫైర్

### భూములు, కాలేజీలపై కక్ష సాధింపు చేస్తున్నారంటూ ఆరోపణలు

### సర్కార్‌పై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు




మల్కాజిగిరి,మే 16 (ప్రజా కలం ప్రతినిధి)

లినా కాలేజీ పైన నా భూమిభూమిపైన ప్రభుత్వం,మంత్రులు యుద్ధానికి దిగిన నా వెంట్రుక పీక్కోండి రా అంటున్నాను తప్ప నేను వెనక పోతలేను అని మల్కాజిగిరి ఎమ్మెల్యే మరియు రాజశేఖర్ రెడ్డి అన్నారు. డివిజన్ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం,మంత్రులపై తీవ్రవాఖ్యలు చేశారు. కార్యకర్తలను ఉత్తేజపరచడానికి ప్రభుత్వం,మంత్రులు నా కాలేజీల పైన సుచిత్ర లోని నా భూమిపై,నాపై కక్షలు కట్టి యుద్ధానికి దిగిన నా వెంట్రుక పీక్కోండి రా అంటూ.. నా అని తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు చేశారు. కార్యకర్తలను ఉత్తేజపరచడానికి చేసిన ఈ వ్యాఖ్యలు ప్రభుత్వం, మంత్రుల పైన చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో హల్చల్ గా మారాయి.

# సంగారెడ్డిలో టీజీఐఐసీ కార్యాలయం ప్రారంభోత్సవం

### హాజరైన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దామోదర్ రాజనర్సింహ

### పట్టణంలోని ఆదర్శనగర్ లో అందుబాటులోకి టీజీఐఐసీ చైర్ పర్సన్ నూతన కార్యాలయం



సంగారెడ్డి ప్రతినిధి మే 15 ( ప్రజా కలం):

సంగారెడ్డి పట్టణంలోని ఆదర్శ్ నగర్ లో టీజీఐఐసీ నూతన కార్యాలయ ప్రారంభోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన కార్యాలయంలో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం టీజీఐఐసీ ఛైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డిని నూతన కార్యాలయంలోని కుర్చీలో కూర్చోబెట్టారు. మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర్ రాజనర్సింహ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, సంగారెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, సెట్విన్ ఛైర్మన్ గిరిధర్ రెడ్డి, టీజీఐఐసీ అధికారులు ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డికి అభినందనలు తెలిపారు.

# సురక్షిత డ్రైవింగ్‌పై పోలీసుల సూచనలు

### బోయిన్‌పల్లి మార్కెట్‌లో ట్రాఫిక్ అవగాహన సదస్సు

కంటోన్మెంట్: మే 15: ప్రజా కలం ప్రతినిధి

తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బోయిన్‌పల్లి మార్కెట్‌లో ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాల్కాజిగిరి సిపి బి.సుమతి,డిసిపి కె. రాహుల్ రెడ్డి ఆదేశాల మేరకు తిరుమలగిరి ట్రాఫిక్ ఏసీపీ జి.శంకర్ రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించి నట్లు తెలిపారు. స్థానిక డ్రైవర్లు,రైడర్లు మార్కెట్ కమిటీ సభ్యులకు దిశానిర్దేశం చేశారు. వాహనదారులు తప్పనిసరి గా హెల్మెట్ ధరించాలని,మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని ఆయన సూచించారు. సీట్ బెల్ట్ ప్రాముఖ్యతను వివరిస్తూ, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్లు వాడటం ప్రాణాపాయానికి దారితీస్తుందని హెచ్చరించారు.?ఈ సందర్భంగా గత 30 ఏళ్లుగా ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా సురక్షితంగా ఆటో నడుపుతున్న డ్రైవర్ రమణయ్యను పోలీసులు ఘనంగా సన్మానించారు. బాధ్యతాయుతమైన డ్రైవింగ్‌కు ఆయన ఒక ఉదాహరణ అని కొనియాడారు. ఈ కార్యక్రమం లో తిరుమలగిరి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వి. సర్దార్ నాయక్, ఆర్ఐ ఐ.వి. రమణయ్య ఎస్ఐలు, మార్కెట్ అధికారులు పాల్గొన్నారు.




Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com